www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 6-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 201 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 12.41 తదుపరి షష్ఠి; నక్షత్రం: మూల ఉ. 11.00 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ. 9.19-11.00, రా. 8.54-10.33; దుర్ముహూర్తం: ఉ. 11.36-12.21; అమృతఘడియలు: ఉ. 6.49-8.28; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.19; సూర్యాస్తమయం: 5.37 | విజయవాడ సిటీ**


Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
బిజినెస్
విజయవాడ ● బుధవారం 6 నవంబరు 2024

రాయల్ ఎన్‌ఫీల్డ్ తొలి ఈవీ

ప్రముఖ మోటార్ సైకిళ్ల కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ సైతం ఎలక్ట్రిక్ బైక్‌ల విభాగంలోకి ప్రవేశించింది. తన తొలి ఎలక్ట్రిక్ మోడల్ 'ఫ్లయింగ్ ఫ్లీ సీ 6'ను ఇటలీలోని మిలాన్‌లో ఆవిష్కరించింది. కంపెనీ ఈ బైక్‌ను తొలుత అమెరికా, యూరప్ మార్కెట్లలో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. 2026 తొలినాళ్లలో ఈ బైక్ మార్కెట్లో అందుబాటులోకి రానుంది.



డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,342 కోట్లు

సెప్టెంబరు త్రైమాసికంలో 9% తగ్గుదల • ఆదాయంలో 17% వృద్ధి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జులై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 9.35 శాతం క్షీణించి రూ.1,341.50 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,480 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం 16.51 శాతం వృద్ధితో రూ.6,880.20 కోట్ల నుంచి రూ.8,016.20 కోట్లకు చేరుకుంది. ఒక త్రైమాసిక కాలంలో రూ.8,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించటం ఇదే తొలిసారని కంపెనీ పేర్కొంది. ఈ కాలంలో గ్లోబల్ జెనరిక్స్ ఆదాయాలు మెరుగ్గా ఉండటం ఎంతగానో కలిసివచ్చిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

వర్ధమాన మార్కెట్లు సహా భారత్, యూరప్, అమెరికా మార్కెట్ల నుంచి రెవెన్యూలు అంచనాలకు తగ్గట్టుగా ఉన్నాయని పేర్కొంది. త్రైమాసిక కాలంలో మొత్తం నిర్వహణ వ్యయాలు 34.3 శాతం వృద్ధి చెంది రూ.3,021.80 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. కంపెనీకి చెందిన అన్ని విభాగాలు నిలకడైన వృద్ధిని సాధించటంతో సెప్టెంబరు త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు రాబట్టుకోగలిగినట్లు డాక్టర్ రెడ్డీస్ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు. నెస్లే భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన సంస్థ కార్యకలాపాలు ప్రారంభించటంతో పాటు నికోటినల్, ఇతర బ్రాండ్ల కొనుగోలు పూర్తి కావటంతో భవిష్యత్‌లో మంచి వృద్ధిని కనబరిచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

రూ.1,200 కోట్ల పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.2,500 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించగా ఇప్పటి వరకు రూ.1,200 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎఫ్‌ఓ నరసింహం తెలిపారు. సెప్టెంబరు ముగిసే నాటికి కంపెనీ వద్ద రూ.1,889 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని వివరించారు. కాగా బయోసిమిలర్స్, ఇతర ఇన్నోవేటివ్ ఉత్పత్తులపై డాక్టర్ రెడ్డీస్ పెట్టుబడులను యథాతథంగా కొనసాగించనుందని కంపెనీ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ తెలిపారు. 2027 నాటికి అమెరికా, యూరోపియన్ మార్కెట్లలోకి కనీసం మూడు బయోసిమిలర్ ఉత్పత్తులను విడుదల చేయాలని చూస్తున్నట్లు చెప్పారు.

అమెరికా ఆదాయం రూ. 3,728 కోట్లు

సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ గ్లోబల్ జెనరిక్స్ ఆదాయాలు 17 శాతం వృద్ధి చెంది రూ.7,157.60 కోట్లుగా ఉన్నాయని డాక్టర్ రెడ్డీస్ సీఎఫ్‌ఓ ఎంవీ నరసింహం చెప్పారు. కాగా అమెరికా ఆదాయాలు కూడా 17 శాతం వృద్ధితో రూ.3,728.10 కోట్లకు చేరుకున్నాయన్నారు. అమ్మకాలు గణనీయంగా పెరగటంతో పాటు అమెరికా మార్కెట్లోకి కొత్తగా నాలుగు ఔషధాలను విడుదల చేయటం కలిసివచ్చిందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు యూరప్, వర్ధమాన దేశాల మార్కెట్ల నుంచి రెవెన్యూలు వరుసగా 9 శాతం, 20 శాతం మేరకు పెరిగాయని తెలిపారు. రష్యా మార్కెట్లో కొన్ని ఔషధాల బ్రాండ్ల ధరలు పెంచటంతో పాటు అమ్మకాలు పెరగటంతో కలిసివచ్చిందన్నారు. భారత మార్కెట్లో కూడా కంపెనీ ఆదాయాలు 18 శాతం వృద్ధి చెంది రూ.1,397.10 కోట్లకు చేరుకున్నాయని వివరించారు. ఈ కాలంలో దేశీయ మార్కెట్లోకి కంపెనీ కొత్తగా మూడు ఔషధ బ్రాండ్లను విడుదల చేసిందని నరసింహం తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కంపెనీ మొత్తం 16 ఔషధాలను విడుదల చేసిందని చెప్పారు.

ఒక రాష్ట్రానికి ఒకే ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్

ఆర్‌ఆర్‌బీలు 28కి కుదింపు
రంగం సిద్ధం చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్‌ఆర్‌బీ)ను మరింత పటిష్ఠం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఇప్పటికే నాబార్డ్‌తో కలిసి చర్చా పత్రాన్ని సిద్ధం చేసింది. దీనిపై ఈ నెల 20వ తేదీలోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని ఆయా ఆర్‌ఆర్‌బీలను స్పాన్సర్ చేసిన బ్యాంకులకు డీఎఫ్ఎస్ లేఖలు రాసింది. ప్రస్తుతం దేశంలో 43 ఆర్‌ఆర్‌బీలు పని చేస్తున్నాయి. వీటిని రాష్ట్రానికి ఒకటి చొప్పున 28కి కుదించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల వీటి నిర్వహణా సామర్థ్యం పెరగడంతో పాటు ఖర్చుల హేతుబద్ధీకరణ జరిగి తమ నిర్దేశిత లక్ష్యాలను సమర్థవంతంగా నిర్వహిస్తాయని అధికార వర్గాలు చెప్పాయి. 2004-05 ఆర్థిక సంవత్సరం తర్వాత ఆర్‌ఆర్‌బీలను కుదించడం ఇది నాలుగోసారి అవుతుంది.

ఏపీజీవీబీ ఆస్తుల విభజనే సమస్య

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ), చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ), సప్తగిరి గ్రామీణ బ్యాంక్ (సీజీబీ), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఏపీ విభాగం పేరుతో నాలుగు ఆర్‌ఆర్‌బీలు ఉన్నాయి. ఇందులో ఏపీజీవీబీ అతిపెద్ద ఆర్‌ఆర్‌బీ. మిగతా మూడు ఆర్‌ఆర్‌బీలను ఏపీజీబీలో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో ఏపీజీబీని కెనరా బ్యాంక్ స్పాన్సర్ చేస్తుండగా సీజీజీబీకి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీజీబీకి ఇండియన్ బ్యాంక్, ఏపీజీవీబీకి భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) స్పాన్సర్ బ్యాంకులుగా ఉన్నాయి. కాగా ఈ నాలుగు ఆర్‌ఆర్‌బీలకు కెనరా బ్యాంక్‌ను స్పాన్సర్ బ్యాంక్‌గా చేయాలని ప్రభుత్వం చర్చాపత్రంలో ప్రతిపాదించింది. అయితే ఏపీజీవీబీ ఆస్తుల పంపకం ఏపీజీవీబీ-తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ)ల మధ్య కొద్దిగా సమస్యగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ పంపకం తేలిన తర్వాత ఈ మార్పులు జరుగుతాయని అధికార వర్గాలు చెప్పాయి. తెలంగాణకు సంబంధించి ప్రస్తుతం ఏపీజీవీబీతో పాటు ఎస్‌బీఐ స్పాన్సర్ చేసిన టీజీబీ కూడా పని చేస్తోంది. ఆస్తుల విభజన తర్వాత ఏపీజీవీబీ తెలంగాణ శాఖలను టీజీబీలో విలీనం చేస్తారు.

బ్యాంకింగ్, లోహ షేర్లలో కొనుగోళ్లు

694 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు స్వల్ప లాభ, నష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆ తర్వాత కొనుగోళ్లు పుంజుకోవడంతో భారీ లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 694.39 పాయింట్ల వృద్ధితో 79,476.63 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 217.95 పాయింట్లు బలపడి 24,213.30 వద్ద ముగిసింది. ఆసియా, యూరప్ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు బ్యాంకింగ్, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లలో వాల్యూ బైయింగ్ ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 21 రాణించాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 4.72 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా స్టీల్ 3.64 శాతం వృద్ధి చెందగా.. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు 2 శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.48 శాతం వరకు లాభపడగా.. రంగాలవారీ సూచీల్లో ఐటీ, టెక్, సర్వీసెస్ మినహా అన్నీ ఎగబాకాయి. మెటల్ 2.38 శాతం, బ్యాంకెక్స్ 2.09 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ 1.84 శాతం వరకు పెరిగాయి.

స్విగ్గీ ఐపీఓ నేటి నుంచే..

» ఇష్యూ ధరల శ్రేణి రూ.371-390
» రూ.11,327 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీతో పాటు క్విక్ కామర్స్ సేవలందించే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగియనుంది. ఐపీఓలో షేర్ల విక్రయ ధరల శ్రేణిని కంపెనీ రూ.371-390గా నిర్ణయించింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా కంపెనీ రూ.4,499 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.6,828 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. అంటే ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ.11,327 కోట్లు సమీకరించనుంది. గరిష్ఠ ధర శ్రేణి ప్రకారంగా కంపెనీ 1,130 కోట్ల డాలర్ల (దాదాపు రూ.95,000 కోట్లు) మార్కెట్ విలువను ఆశిస్తోంది. స్విగ్గీ ప్రధాన ప్రత్యర్థి జొమాటో 2021 జూలైలోనే ఐపీఓకు వచ్చింది. ప్రస్తుతం జొమాటో మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.2.14 లక్షల కోట్ల స్థాయికి చేరింది.

హిందుస్థాన్ జింక్‌లో 2.5% వాటా విక్రయం

» షేరు కనీస ధర రూ.505

న్యూఢిల్లీ: వేదాంత గ్రూప్‌నకు చెందిన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్)లో 2.5 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా షేరు కనీస ధరను రూ.505గా నిర్ణయించింది. మంగళవారం బీఎస్ఈలో కంపెనీ షేరు ముగింపు ధర రూ.559.45తో పోలిస్తే, ఓఎఫ్ఎస్‌లో షేరు 9.7 శాతం తక్కువకు లభించనుంది. కంపెనీలో వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.5,000 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. రెండు రోజులపాటు సాగనున్న ఈ ఓఎఫ్ఎస్‌లో బుధవారం నాన్-రిటైల్ ఇన్వెస్టర్లు, గురువారం రిటైల్ ఇన్వెస్టర్లు కంపెనీ షేర్ల కొనుగోలుకు బిడ్ వేయవచ్చు. హెచ్‌జెడ్ఎల్‌లో వేదాంత 63.24 శాతం, కేంద్రం 29.54 శాతం, ఎల్ఐసీ 2.76 శాతం వాటా కలిగి ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	545	విజయవాడ	555
వరంగల్	547	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	128	విజయవాడ	125
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	118
కర్నూలు	128	నెల్లూరు	118
విశాఖపట్నం	111	అనంతపురం	118
గోదావరి	125		

మారుత్ డ్రోన్స్ రూ.52 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ సాంకేతిక స్టార్టప్ మారుత్ డ్రోన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా 62 లక్షల డాలర్ల (సుమారు రూ.52 కోట్లు) నిధులు సమీకరించింది. సిరీస్ ఏ ఫండింగ్‌లో భాగంగా లోక్ క్యాపిటల్ నుంచి ఈ నిధులను సేకరించినట్లు మారుత్ డ్రోన్స్ మంగళవారం వెల్లడించింది. వ్యాపార వృద్ధికి ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు తెలిపింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక వ్యవసాయ రంగ డ్రోన్ల అభివృద్ధితో పాటు భాగస్వామ్య నెట్‌వర్క్, సర్వీస్ సెంటర్లను ద్వితీయ, తృతీయ శ్రేణికి విస్తరించడం, డ్రోన్ అగ్రికల్చర్ సర్వీస్ హబ్‌ల ఏర్పాటు ద్వారా వ్యాపారాన్ని విస్తరించాలని కంపెనీ ప్రణాళికను రూపొందించుకుంది. తద్వారా వచ్చే ఐదేళ్లలో టర్నోవర్‌ను రూ.1,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఐటీ అధికారులు వడ్డీ మాఫీ చేయవచ్చు

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను శాఖ అధికారులు నిర్దిష్ట షరతులకు లోబడి పన్ను చెల్లింపుదారులు చెల్లించాల్సిన వడ్డీని మాఫీ చేయడం లేదా తగ్గించడం చేయవచ్చని ఆ శాఖ తెలిపింది. ప్రత్యక్ష పన్నుల సెంట్రల్ బోర్డు (సీబీడీటీ) ఈ మేరకు సోమవారం సర్క్యులర్ జారీ చేసింది. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 220 (2ఎ) కింద పన్ను చెల్లింపుదారుడు డిమాండ్ నోటీసు ప్రకారం పన్ను చెల్లించడంలో విఫలమైతే జాప్యం జరిగిన కాలానికి నెలకు ఒక శాతం వంతున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ (పీఆర్‌సీసీఐటీ) లేదా చీఫ్ కమిషనర్ (సీసీఐటీ) లేదా ప్రిన్సిపల్ కమిషనర్ (పీఆర్‌సీఐటీ), లేదా కమిషనర్ ర్యాంక్ అధికారులకు ఈ వడ్డీని మాఫీ చేయడం లేదా రద్దు చేసే అధికారం ఐటీ చట్టం దఖలు పరిచింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,240 ▼	73,550 ▼	1,05,000 ▼
ముంబై	78,566 ▲	71,967 ▲	94,261

స్పోర్ట్స్

జెడ్డాలో ఐపీఎల్ వేలం

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మెగా వేలానికి వేదిక ఖరారైంది. ఈ నెల 24, 25 తేదీల్లో సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో వేలాన్ని నిర్వహించనున్నట్టు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. తొలుత సౌదీ రాజధాని రియాద్‌లో వేలాన్ని నిర్వహిస్తారనే ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. కాగా, ఈ వేలం కోసం మొత్తం 1574 మంది క్రికెటర్లు రిజిస్టర్ చేసుకోగా.. వారిలో 1165 మంది భారత ఆటగాళ్లు. గతేడాది దుబాయ్‌లో వేలం నిర్వహించారు. ఇప్పటిదాకా 16 సార్లు ఐపీఎల్ మెగా వేలం జరగగా... వేలానికి ఎనిమిది సార్లు బెంగళూరు ఆతిథ్యమిచ్చింది.

వామప్ మ్యాచ్ రద్దు సరికాదు


గవాస్కర్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ 'ఎ'తో ఆడాల్సిన టీమిండియా ప్రాక్టీస్ మ్యాచ్‌ను రద్దు చేయడాన్ని మాజీ కెప్టెన్ గవాస్కర్ తప్పుపట్టాడు. 'వామప్ మ్యాచ్ ద్వారా జైస్వాల్, సర్ఫరాజ్‌లాంటి యువ ఆటగాళ్లకు అక్కడి పిచ్‌లపై అవగాహన వచ్చేది. ఒకవేళ వారు త్వరగా అవుటైనా నెట్స్‌లో త్రోడౌన్ స్పెషలిస్టుల ద్వారా ప్రాక్టీస్ సాగించేవారు. అలాగే పేసర్లు ఆకాశ్, హర్షిత్‌లకు సైతం వికెట్‌పై ఏ లెంగ్త్‌లో బౌలింగ్ వేయాలో తెలిసొచ్చేది' అని గవాస్కర్ సూచించాడు. ప్రస్తుత జట్టులో 8 మంది ఆటగాళ్లకు ఆసీస్ గడ్డపై భారత్ తరఫున ఆడిన అనుభవం లేకపోవడం గమనార్హం.



కల సాకారం దిశగా..

ఒలింపిక్స్ ఆతిథ్యంలో ముందడుగు
ఐఓసీకి ఆసక్తి వ్యక్తీకరణ లేఖ అందజేసిన భారత్

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ ఆతిథ్యానికి పట్టుదలగా ఉన్న భారత్ ఆ దిశగా ఓ అడుగు వేసింది. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ (ఎల్‌ఓఐ) లేఖను అందజేసింది. ఈమేరకు లేఖను అక్టోబరు ఒకటిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) పంపింది. 'ఈ మహదావకాశం దేశానికి గణనీయమైన ప్రయోజనం చేకూరుస్తుంది. ఆర్థికాభివృద్ధికి ఊతం ఇవ్వడంతోపాటు, సామాజిక పురోగతికి, యువత సాధికారితకు దోహదం చేస్తుంది' అని కేంద్ర క్రీడాశాఖ పేర్కొంది. 2036 విశ్వక్రీడలకు ఆతిథ్యమివ్వాలన్న ఆకాంక్షను ప్రధాని మోదీ గత ఏడాది వ్యక్తంజేసిన విషయం తెలిసిందే. వచ్చే సంవత్సరం ఐఓసీ ఎన్నికలు జరిగాక 2036 ఒలింపిక్స్ వేదికపై నిర్ణయం తీసుకుంటారు. సౌదీ అరేబియా, ఖతార్, టర్కీ సహా పలు దేశాలనుంచి భారత్ తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోంది. ఆసక్తి వ్యక్తీకరణ లేఖ సమర్పించడమంటే..ఒలింపిక్స్ ఆతిథ్య దేశం ఎన్నిక ప్రక్రియలో 'అనధికార చర్చల' నుంచి 'నిరంతర సంప్రదింపుల' దిశగా అడుగులు పడినట్టే. ఈ దశలో ఆయా దేశాల ఒలింపిక్స్ నిర్వహణ సత్తాపై అధ్యయనాన్ని ఐఓసీ ప్రారంభిస్తుంది. ఇందులో భాగంగా మానవ హక్కులు, సామాజిక వ్యాపార బాధ్యత, ప్రకృతి పరిరక్షణ ద్వారా సుస్థిర సాధించడం.. తదితర అంశాలను ఐఓసీ సునిశితంగా పరిశీలిస్తుంది. ఇది పూర్తయ్యాక 'లక్ష్యిత సంప్రదింపు'ల దశ మొదలవుతుంది. ఈ దశలో..ఒలింపిక్స్ ఆతిథ్యానికి సంబంధించి అధికారిక బిడ్ సమర్పించాల్సి ఉంటుంది. దీనిని ఐఓసీకి చెందిన 'భవిష్య ఆతిథ్య కమిషన్' అంచనా వేస్తుంది. ఆపై ఆతిథ్య దేశ ఖరారుకు ఎన్నిక నిర్వహణతో మొత్తం ప్రక్రియ ముగుస్తుంది. ఇక..ఒలింపిక్స్ నిర్వహించాలన్న భారత ప్రతిపాదనకు ఐఓసీ చీఫ్ థామస్ బాచ్ సంపూర్ణంగా మద్దతు పలుకుతుండడం విశేషం. 2010లో ఢిల్లీ కామన్వెల్త్ క్రీడల ద్వారా చివరిసారిగా భారత్ ఓ పెద్ద క్రీడా సంరంభానికి ఆతిథ్యం ఇచ్చింది.

అహ్మదాబాద్ ఆతిథ్య నగరం!

2036 ఒలింపిక్స్ ఆతిథ్య నగరం రేసులో అహ్మదాబాద్ ముందంజలో ఉన్నట్టు తెలిసింది. కాగా..ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష సహా పలువురు ఉన్నతస్థాయి దేశ క్రీడా పరిపాలకులు పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా మన దేశానికి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేశారు. ఒలింపిక్స్ ఆతిథ్యం దక్కించుకోవడంలో సఫలమైతే..స్వదేశీ క్రీడలు ఖోఖో, కబడ్డీ, యోగాలను కూడా విశ్వక్రీడల్లో ప్రవేశపెట్టాలని భారత్ యోచిస్తోంది. అలాగే చెస్, టీ20 క్రికెట్, స్క్వాష్ అంశాలకు కూడా స్థానం కల్పించాలని భావిస్తోంది. ఈమేరకు కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్యకు ఒలింపిక్స్ ఆతిథ్యానికి సంబంధించిన సవివర పత్రాన్ని భారత క్రీడాప్రాధికార సంస్థ 'విజన్ ఒలింపిక్ సెల్' ఇప్పటికే అందజేసింది.

ఆరో రౌండ్లో హంపి పరాజయం

షైంకెంట్ (కజకిస్థాన్): ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ రెండో అంచె ఆరో రౌండ్లో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఓటమి పాలైంది. మంగళవారం జరిగిన ఈ రౌండ్‌లో తెల్లపావులతో బరిలోకి దిగిన హంపిని స్టావ్‌రౌలా సోలకిడౌ (గ్రీస్) 41వ ఎత్తులో ఓడించింది. మరో భారత జీఎం దివ్యాదేశ్‌ముఖ్ తన గేమ్‌ను డ్రా చేసుకుంది. ఈ పోటీల్లో ఓటమి లేకుండా దూసుకెళ్తున్న రష్యా జీఎం అలెక్సాండ్రా గోరియాచ్కినా ఆరో రౌండ్లో ఎలిజబెత్ (జర్మనీ)పై నెగ్గి మొత్తం ఐదు పాయింట్లతో టాప్‌లో కొనసాగుతోంది. తాజా ఓటమితో హంపి 3 నుంచి 6వ స్థానానికి పడిపోయింది. టోర్నీలో మరో మూడు రౌండ్లు మిగిలున్నాయి.

అర్జున్ శుభారంభం

చెన్నై: తెలుగు యువ జీఎం ఇరిగేసి అర్జున్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. మంగళవారం మొదలైన ఈ పోటీల్లో అర్జున్ తొలి రౌండ్‌లో విదిత్ సంతోష్ గుజరాతిపై గెలిచాడు. ఇక, ఇక్కడే జరుగుతున్న గ్రాండ్‌మాస్టర్స్ చాలెంజర్స్ ఓపెన్ టోర్నీని హారిక ఓటమితో ఆరంభించింది. తొలి రౌండ్‌లో ప్రణవ్ చేతిలో హారిక పోరాడి ఓడింది.

ఆమె కాదు.. అతడే?

రహస్య వైద్య నివేదికలో వెల్లడి!
ఒలింపిక్ విజేత ఖెలిఫ్ లింగత్వంపై మళ్లీ వివాదం
బాక్సర్ పతకం వెనక్కి తీసుకోవాలన్న హర్భజన్ సింగ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ లింగత్వంపై మరోసారి వివాదం రేగింది. ఫ్రెంచ్ జర్నలిస్టు ఫైర్స్ మోర్గాన్.. తాను సంపాదించిన రహస్య వైద్య నివేదికల ప్రకారం ఖెలిఫ్ మహిళ కాదు పురుషుడని ఆరోపిస్తున్నాడు. మగవాళ్లలో కనిపించే హార్మోన్ల లక్షణాలు ఆమెలో ఉన్నాయన్నాడు. జీవశాస్త్రపరంగా ఖెలిఫ్ పురుషుడేనని చెబుతున్నాడు. పారిస్‌లోని క్రెమ్లిన్ బైసెట్రీ ఆసుపత్రి, అల్జీరియాలోని మరో హాస్పిటల్ కలసి ఈ నివేదికను 2023 జూన్‌లో తయారు చేసినట్టుగా తెలుస్తున్నదని మోర్గాన్ పేర్కొన్నాడు. 'ఖెలిఫ్ జననాంగాల ఎదుగుదలలో లోపాలున్నాయని ఎంఆర్ఐ రిపోర్టులో ఉంది. ఆమెకు గర్భాశయం లేదని.. అంతర్గత వృషణాలతోపాటు సూక్ష్మ పురుషాంగం ఉందని అందులో రాశారు. మరో పరీక్షలో ఎక్స్ వై క్రోమోజోమ్‌లతోపాటు పురుష హార్మోన్ టెస్టోస్టిరాన్ స్థాయిలు కూడా ఎక్కువగా ఉన్నట్టు నివేదికలో వైద్యులు పేర్కొన్నార'ని తెలిపాడు. శస్త్రచికిత్సతో సరిచేయించుకోవడంతోపాటు హార్మోన్ చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు చెప్పాడు. ఈ ఆరోపణలు బయటకు రావడంతో తక్షణం ఆమె ఒలింపిక్ స్వర్ణాన్ని వెనక్కు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కూడా ఆమె పతకాన్ని తిరిగి తీసుకోవాలని కోరాడు. 'మహిళగా భావించి ఆడవాళ్లతో తలపడేందుకు అనుమతించారు. అన్యాయం అని ప్రశ్నించిన వారికి వివక్ష అంటగట్టారు. కానీ, వైద్య నివేదికల ప్రకారం ఖెలిఫ్ పురుషుడే'నని ఎక్స్‌లో భజ్జీ రాశాడు.

విరాట్‌కు విషెస్ చెబుతావా?

ఇటలీ మహిళా ఫుట్‌బాలర్‌పై ట్రోలింగ్



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ఓ ఇటలీ మహిళా ఫుట్‌బాలర్ నెట్టింట ట్రోలింగ్‌కు గురైంది. మంగళవారం విరాట్ 36వ జన్మదినం సందర్భంగా 'ఇటలీలోని ఓ అభిమాని తరఫున విరాట్ కోహ్లీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఆల్ ద బెస్ట్' అంటూ ఎగటా ఇసబెల్లా సెంటాసో అనే ఫుట్‌బాలర్ ఎక్స్‌లో పేర్కొంది. దీంతో భారత్ నుంచే ఆమెకు విమర్శలు ఎదురయ్యాయి. 'నీకు క్రికెట్ గురించి, కోహ్లీ గురించి ఏమీ తెలీదు. అత్యధిక జనాభా కలిగిన భారత్ నుంచి ఎక్కువ లైక్స్ రావాలనే ఈ ప్రయత్నం' అంటూ ఒకరు.. 'రోహిత్ శర్మ ఫ్యాన్స్ నుంచి నీకిదే చివరి హెచ్చరిక. వెంటనే పోస్టును తొలగించు' అని మరొకరు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారు. అయితే వీటికి ఇసబెల్లా ఘాటుగానే స్పందిస్తూ.. 'విరాట్ లేదా క్రికెట్ గురించి నేనెప్పుడు మాట్లాడినా నాపై విమర్శలకు దిగుతుంటారెందుకో. నామీద ఇంత తక్కువ అభిప్రాయం ఉంటే నన్ను ఫాలో అవకండి' అని తెలిపింది.

జైపూర్ గెలుపు బాట



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జైపూర్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో జైపూర్ పింక్‌పాంథర్స్ జట్టు మూడు మ్యాచ్‌ల తర్వాత గెలుపుబాట పట్టింది. మంగళవారం ఇక్కడ జరిగిన పోరులో జైపూర్ 33-30తో యూపీ యోధాస్‌పై గెలిచింది. కాగా, పింక్ పాంథర్స్ స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ పీకేఎల్‌లో 1000 రైడ్ పాయింట్లు సాధించిన ఏడో ఆటగాడిగా అరుదైన ఘనత సాధించాడు. మరో మ్యాచ్‌లో యూ ముంబా 32-26తో దబాంగ్ ఢిల్లీపై విజయం సాధించింది.

మళ్లీ ఆఫ్రో-ఆసియా కప్!

బెనోని (దక్షిణాఫ్రికా): భారత్-పాకిస్థాన్‌కు చెందిన క్రికెటర్లు ఒకే జట్టు తరఫున కలిసి ఆడితే ఎలా ఉంటుంది? ప్రస్తుతం కష్టమే అనిపిస్తున్నా.. గతంలో రెండుసార్లు ఇలా ఆడిన అనుభవముంది. ఆసియా ఎలెవన్-ఆఫ్రికా ఎలెవన్ పేరిట ఈ రెండు ఖండాలకు చెందిన క్రికెట్ జట్ల మధ్య ఆఫ్రో-ఆసియా కప్ వన్డే టోర్నీ జరిగేది. 2005లో మొదట దక్షిణాఫ్రికాలో జరగ్గా, 2007లో భారత్‌లోనే నిర్వహించారు. అప్పుడు ధోనీ, గంగూలీ, సచిన్, సెహ్వాగ్, జహీర్, యువరాజ్, షోయబ్ అక్తర్, ఆసిఫ్‌లతో కూడిన జట్టు విజేతగా నిలిచింది. ఆ తర్వాత మూడో ఎడిషన్ 2009లో కెన్యాలో జరగాల్సి ఉన్నా, ముంబై దాడుల నేపథ్యంలో కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇన్నాళ్లకు ఈ టోర్నీని పునరుద్ధరించాలని ఆఫ్రికా క్రికెట్ సంఘం (ఏసీఏ) భావిస్తోంది. గత శనివారం జరిగిన వార్షిక సమావేశంలో ఈ కప్ నిర్వహణ కోసం ఆరుగురితో మధ్యంతర కమిటీని వేసింది. వీరి నివేదిక ఆధారంగా లీగ్ నిర్వహణపై చర్చించనుంది.

మన్‌దీప్‌కు డబ్ల్యూబీఎఫ్ టైటిల్



న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య (డబ్ల్యూబీఎఫ్) సూపర్ ఫెదర్‌వెయిట్ టైటిల్‌ను భారత ప్రొఫెషనల్ బాక్సర్ మన్‌దీప్ జాంగ్రా సొంతం చేసుకొన్నాడు. కేమన్ ఐలాండ్స్‌లో జరిగిన టైటిల్ బౌట్‌లో బ్రిటన్ బాక్సర్ కానర్ మెకింటోష్‌ను జాంగ్రా మట్టికరిపించాడు. 2021లో ప్రొఫెషనల్‌గా మారిన జంగ్రా తాను తలపడిన 12 బౌట్లలో 11 గెలిచాడు. 2014 కామన్వెల్త్ క్రీడల్లో మన్‌దీప్ అందుకున్నాడు.

ఆసియా పికిల్‌బాల్‌లో 5 స్వర్ణాలు

ముంబై: తైవాన్‌లో జరిగిన ఆసియా పికిల్‌బాల్ క్రీడల్లో భారత ఆటగాళ్లు 5 స్వర్ణాలతో అదరగొట్టారు. 50+ పురుషుల సింగిల్స్‌లో నితిన్, 35+ సింగిల్స్‌లో విశాల్, డబుల్స్‌లో నితిన్-సందీప్, మిక్స్‌డ్‌లో కపాడియా-వృశాలి పసిడి గెలిచారు. టోర్నీలో భారత్ మొత్తం 14 పతకాలు (5 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య) సాధించింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



కేన్సర్, గుండె సమస్యలకు చెక్
స్టెమీ, కేన్సర్ పరీక్షలకు ప్రభుత్వం శ్రీకారం
ఇంటింటికీ వెళ్లి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు
నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభం
9

అర్చకుల కనీస వేతనం 11
15 వేలకు పెంపు
ఆమోదించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

25 నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు 10
జమిలి, వక్ఫ్ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం

బుధవారం | 6-11-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
| విజయవాడ సిటీ**

మద్యంలో మతలబు!

వైసీపీ సర్కారు దుకాణాల్లో భారీ గోల్‌మాల్!?
రోజుకు రూ.10 కోట్ల సరుకు 'నేరుగా' స్వాహా!?



కొత్త పాలసీలో పెరిగిన విక్రయాలు
బ్రాండెడ్ ధరలు మారకున్నా..
చీప్ లిక్కర్ ధర సగానికి దిగినా
రోజుకు రూ.10 కోట్ల అదనపు విక్రయాలు
గతంలో ఇదంతా ఏమైనట్లు?
డిస్టిలరీల నుంచి నేరుగా తరలించేశారా?
ఆ సొమ్మునూ సొంత ఖాతాల్లో వేసుకున్నారా?
డిజిటల్ పేమెంట్లు వద్దన్నది అందుకేనా?
ఇప్పటిదాకా ఎన్నెన్నో అనుమానాలు
ఇప్పుడు బలపడుతున్న ఆధారాలు
డిస్టిలరీలలో సీఐడీ సోదాల్లో తేలిన తేడా!?
లోతుగా విచారిస్తే మరింత స్పష్టత

వైసీపీ ప్రభుత్వంలో మద్యంలో భారీగా కమీషన్లు చేతులు మారాయనీ, ప్రతి మద్యం కంపెనీ.... కేసుకు రూ.200 చొప్పున.. ఐదేళ్లలో రూ.మూడు వేల కోట్ల విలువైన మద్యం సొమ్ములను తాడేపల్లి ప్యాలెస్‌కు చేర్చాయని కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా తేల్చింది. ఇది ఒక లెక్క! అలాగే... డిస్టిలరీల నుంచి నేరుగా ప్రభుత్వ మద్యం షాపులకే సరుకు పంపించి, అనధికారికంగా విక్రయించారన్న అనుమానాలకు ఇప్పుడు ఆధారాలు లభిస్తున్నాయి. ఆ లెక్క ఎంతో సీఐడీ తేల్చాల్సి ఉంది.

పది రూపాయల టీ తాగినా గూగుల్‌పే, ఫోన్‌పేలో డబ్బులు చెల్లించే రోజుల్లోనూ... ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లను అనుమతించలేదు. 'క్యాష్' మాత్రమే కొట్టాలన్నారు! డిజిటల్ పేమెంట్లతో ప్రభుత్వ ఖాతాల్లోనే జమ అవుతుంది. అనధికారికంగా విక్రయించే సరుకు సొమ్ము చేతికి చిక్కదు! ఆ లెక్కల గుట్టు బయటపడొద్దనే జగన్ సర్కారు హయాంలో డిజిటల్ పేమెంట్లను అనుమతించలేదనే అనుమానాలున్నాయి.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
సరుకు వాళ్లదే! షాపులూ సర్కారువే! మధ్యలో.. నామమాత్రంగా బ్రూవరీస్ కార్పొరేషన్! డిస్టిలరీలలో తయారైన మద్యం బ్రూవరీస్ కార్పొరేషన్‌కు వచ్చి... అక్కడి నుంచి మద్యం దుకాణాలకు వెళ్లాలి! ఇదీ అధికారిక ప్రక్రియ! కానీ... కొంత మద్యం నేరుగా డిస్టిలరీల నుంచి మద్యం దుకాణాలకు వెళ్లిందని, అనధికార విక్రయాలు జరిగాయని తొలి నుంచీ అనుమానాలున్నాయి! వాటిని బలపరిచే ఆధారాలు ఇప్పుడు బయటపడుతున్నాయి. అప్పటికీ, ఇప్పటికీ మద్యం విక్రయాల్లో రోజుకు సగటున రూ.10 కోట్ల వరకు తేడా వస్తోంది. జగన్ హయాంలో ప్రభుత్వ దుకాణాల్లో రోజుకు రూ.80 కోట్ల విలువైన మద్యం విక్రయించగా... ఇప్పుడు రూ.90 కోట్లకు పైగా విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం దుకాణాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాకమునుపే ఇంత తేడా! ఈ పది కోట్ల విలువైన సరుకు గతంలో ఏమైంది? డిస్టిలరీల నుంచి

మిగతా 12వ పేజీలో...

శ్రీవారి భక్తులకు 'టూరిజం' టోపీ 12
పర్యాటక శాఖలో తిరుమల టికెట్ల స్కామ్
బస్సుల్లో తరలించినట్లు నకిలీ బిల్లులు
ఏపీటీడీసీలో ముగ్గురు అధికారుల చేతివాటం
గత సీఎంవో అధికారి కనుసన్నల్లో అక్రమాలు
ప్రతి టికెట్‌కు భక్తుల నుంచి 2 వేలు వసూలు
టీటీడీకి 300.. ఆహారం, వసతికి 500
మిగిలిన 1200 దొంగ ఖాతాలోకి




అనంతపురం పీటీసీలో డీఎస్పీల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఐదేళ్లలో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నాం
పోలీసులు ఇష్టం వచ్చినట్లు పనిచేశారు: డీజీపీ


ఎంపీని పట్టుకుపోయి కొట్టడమే ఉదాహరణ
ఒక పార్టీ కార్యాలయంపై దాడి జరిగితే భావ ప్రకటన స్వేచ్ఛలో భాగమని రాసుకున్నారు
ఆ ఘటనలో ఒక్కరినీ అరెస్టు చేయలేదు
నిందితులను ఎప్పుడైనా అరెస్టు చేయొచ్చు
కేరళలో ఓ ఐపీఎస్‌కు 20 ఏళ్ల తర్వాత శిక్ష

అనంతపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్లలో పోలీసు వ్యవస్థలో కొన్ని తప్పులు జరిగాయని డీజీపీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. అప్పట్లో జరిగిన తప్పులు సరిదిద్దడంపై ప్రధానంగా దృష్టి పెట్టామని అన్నారు. ఆరోపణలు, అభియోగాలు ఎవరిపైన వచ్చినా విచారణ చేయాలని, కానీ గత ప్రభుత్వ హయాంలో పోలీసులు సరిగా విధులు నిర్వర్తించలేదని.. ఇష్టం వచ్చినట్లు పనిచేశారని

మిగతా 11వ పేజీలో...

శవాల దగ్గర రాబందులు!
వైసీపీ సైకో బ్యాచ్‌పై చర్యలు: హోం మంత్రి
ఏమీ జరక్కపోయినా ఏదో జరిగినట్లు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు 11
సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు
అత్యాచారం జరిగిందో లేదో తెలుసుకోకుండా తిరుపతి ఘటనపై బురదజల్లుతున్నారు
వీటిని అడ్డుకోవడం మా గురుతర బాధ్యత
త్వరలో 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ
ఎస్ఐ పోస్టుల భర్తీపై సమీక్షిస్తున్నాం: అనిత
ఘనంగా డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్

2028కల్లా పోలవరం



త్వరగా పూర్తి చేయడమే కాదు.. నాణ్యతా ముఖ్యమే: సీఎం
నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణాలు
కీలక కట్టడాలకు అనుమతులొస్తే ఈ నెలలోనే ప్రాజెక్టును సందర్శిస్తా 11
కార్యాచరణ ప్రణాళిక విడుదల చేస్తా: బాబు

తప్పు చేసి.. ఎదురుదాడా?
రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశాడు
పత్రిక ఉందని తప్పుడు కథనాలు
జగన్‌పై చంద్రబాబు ఆగ్రహం

భూ కబ్జాలపై ఉక్కుపాదం!
దురాక్రమణదారులకు 10 నుంచి 14 ఏళ్ల జైలు
అపరాధంగా భూమి మార్కెట్ విలువ వసూలు
వారికి సహకరించే అధికారులకూ కఠిన శిక్షలు
నూతన ల్యాండ్ గ్రాబింగ్ చట్టంలో ప్రతిపాదనలు
నేడు కేబినెట్ భేటీ.. ముసాయిదాపై చర్చ 12
నామినేటెడ్‌లో బీసీలకు 34% రిజర్వేషన్లపైనా..



పల్నాడు జిల్లా వేమవరంలో ఓపెన్ టాప్ వాహనంపై నుంచి సరస్వతి పవర్ భూములను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

'సరస్వతి'పై సమగ్ర విచారణ
ప్లాంట్ పేరిట రైతుల భూములు దోచేశారు
ప్రజల ఆస్తులు లాక్కుని సొంత ఆస్తిలా జగన్ కుటుంబం కొట్టుకుంటోంది
400 ఎకరాల అటవీ భూమినీ కాజేశారు
24 ఎకరాల అసైన్డ్ భూమీ లాగేసుకున్నారు
పెట్రోలు బాంబులేసి భూములు లాక్కున్నారు
ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారు
రైతులకు సరైన పరిహారమూ ఇవ్వలేదు
లీజును జగన్ 50 ఏళ్లకు పెంచుకున్నారు: పవన్

భూములను పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్

పోలీసులూ.. వైసీపీ వాళ్లను చూసి
భయపడుతున్నారా?
శాంతిభద్రతలే మాకు ముఖ్యం
ఎవరినీ ఉపేక్షించవద్దు
వైసీపీ వాళ్లు ఇంకా అధికారంలోనే ఉన్నామని అనుకుంటున్నారు
పవన్ కల్యాణ్ ధ్వజం
కోడెలను వేధించి చంపేశారని వ్యాఖ్య 11

సరస్వతి పవర్ భూములు రైతుల కష్టార్జితం. రైతులకు అండగా ఉండేందుకు, ధైర్యం ఇచ్చేందుకే వచ్చాను. వైసీపీ నేతలు కొందరు ఇంకా అధికారంలోనే ఉన్నట్లు భావిస్తున్నారు. అడ్డగోలుగా వ్యవహరించే వారి తోలుతీస్తాం.
- డిప్యూటీ సీఎం పవన్



7
డ్రోన్ హబ్‌గా ఏపీ
కర్నూలులో డ్రోన్ డెవలప్‌మెంట్ సెంటర్
రాష్ట్రంలో వందకుపైగా డ్రోన్ కంపెనీలు
20 శిక్షణ కేంద్రాలు.. 50 నైపుణ్యాభివృద్ధి సంస్థలు.. రూ.1,000 కోట్ల పెట్టుబడులు
40 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
డ్రోన్ పాలసీకి ముఖ్యమంత్రి ఆమోదం

గోదావరి-పెన్నా అనుసంధానంపై
కదలిక 11
తొలి దశపై సీఎం చంద్రబాబు సమీక్ష
ప్రకాశం బ్యారేజీపైన హరిశ్చంద్రపురం నుంచి నకరికల్లు వరకు జలాల తరలింపు
2018లో రూ.6,212 కోట్ల అంచనా
తాజాగా 30 శాతం పెరిగే అవకాశం!
మరోసారి కూర్చుని చర్చిద్దామన్న సీఎం

శ్రీశైలం, సాగర్‌ను ఖాళీ చేయొద్దు
తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖ 7

కమల గెలిస్తే చరిత్రే!
చివరి అంకంలో సర్వేలు.. హ్యారిస్ వైపు స్వల్పంగా మొగ్గ
స్వింగ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న హోరాహోరీ
అయినా.. ఓటర్లు కమలవైపేనంటున్న సర్వేలు
కమల విజయావకాశాలు 50.015%
49.985 శాతానికి పడిపోయిన ట్రంప్
అమెరికావ్యాప్తంగా ప్రారంభమైన పోలింగ్
తొలి ఫలితం.. ఆరు ఓట్లలో ఇద్దరికీ చెరిసగం
ఎన్నికలవగానే కౌంటింగ్.. 7న పూర్తి ఫలితాలు
ట్రంప్ న్యాయపోరుకు 5 వేల మంది లాయర్లు
ఫలితాలు ప్రతికూలంగా వస్తే కోర్టుకెళ్లేందుకే
కమల గెలుపు కోసం తమిళనాట పూజలు
అమెరికా బరిలో భారత సంతతి పోరులు
మళ్లీ దిగిన ఐదుగురితో సహా మొత్తం 9 మంది
వీరిలో ఆరుగురి గెలుపు నల్లేరుపై నడకే

అమెరికన్లు కొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నారు. నేను ఓ మహిళగా ఓట్లడగలేదు. అధ్యక్ష పదవికి సరైన వ్యక్తిని అని భావించినందుకే ఓట్లడిగాను.
- కమలా హ్యారిస్

అమెరికాను తిరిగి గొప్పగా నిలబెడతా. అది నా వల్లే సాధ్యం. అమెరికా ఫస్ట్ నా నినాదం
- డొనాల్డ్ ట్రంప్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న రిపబ్లికన్ ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్

న్యూయార్క్, నవంబరు 5: హోరాహోరీగా ప్రచారం కొనసాగిన 47వ అమెరికా అధ్యక్ష ఎన్నికలు మంగళవారం తుది అంకానికి చేరుకున్నాయి. దేశవ్యాప్తంగా వేర్వేరు కాలమానాల ప్రకారం.. తెల్లవారుజాము నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. పోలింగ్ క్రతువు మంగళవారం రాత్రి 10 గంటలకు(భారత కాలమానం ప్రకారం.. బుధవారం ఉదయం 11 గంటలకు) పూర్తికానుంది. పోలింగ్

మిగతా 10వ పేజీలో...



అన్నీ కుదరదు
ప్రైవేటు ఆస్తులన్నింటిపై ప్రభుత్వానికి హక్కు లేదు!
ఉమ్మడి ప్రయోజనాల కోసమంటూ స్వాధీనానికి వీల్లేదు
8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
ఆర్టికల్ 39ని వివరించడంలో గత న్యాయమూర్తులు విఫలం
నాటి జస్టిస్ అయ్యర్ సిద్ధాంతం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం: సీజేఐ
అయ్యర్‌పై సీజేఐ వ్యాఖ్యలు అవాంఛనీయం, అన్యాయం.. తీర్పులో పేర్కొన్న జస్టిస్ నాగరత్న.. వ్యతిరేక తీర్పు ఇచ్చిన జస్టిస్ ధులియా
చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు సరికాదని ఉద్ఘాటన

10
మదర్సాలకు సుప్రీం ఊరట
యూపీ మదర్సా చట్టం రాజ్యాంగబద్ధమే
హైకోర్టు తీర్పు కొట్టివేత

నేరం ఎంతో.. అంతే శిక్ష పడుతోందా?
సమీక్షించే యోచనలో కేంద్రం
అవసరమైతే పాత తీర్పులు నిలుపుదల


9

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ
కన్నుమూత
సత్యం మాస్టారు నిరాడంబరతకు నిలువుటద్దం
ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఆర్టీసీ బస్సు, రైలులోనే ప్రయాణం

చంపి.. సూట్‌కేస్‌లో కుక్కి..
ఆభరణాల కోసం వృద్ధురాలి దారుణ హత్య
శవాన్ని మాయం చేసేందుకు చెన్నై రైల్లో ప్రయాణం 12

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జార్ఖండ్‌లో వరాల వర్షం

జార్ఖండ్ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో, మంగళవారం ఇండియా కూటమి తన మేనిఫెస్టో విడుదల చేసింది. కూటమి పార్టీలైన జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం), కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఎం ఉమ్మడిగా ఏడుగ్యారంటీలతో ఈ మేనిఫెస్టోను ప్రకటించాయి. పదిలక్షలమంది యువతకు ఉపాధి, పదిహేను లక్షల రూపాయలవరకూ ఆరోగ్యబీమా, నాలుగువందల యాభైరూపాయలకే సిలిండర్, మహిళలకు నెలకు రెండున్నరవేల రూపాయలు, ప్రతివ్యక్తికీ ఏడుకేజీల ఆహారధాన్యాలు, వరి కనీస మద్దతుధరను ఎనిమిదివందల రూపాయలు పెంచడం, వెనుకబడిన తరగతులవారికి ప్రత్యేక కమిషన్, మైనారిటీల హక్కుల పరిరక్షణ ఇందులో ఉన్నాయి. జార్ఖండ్‌లో ఉన్నవి 81 సీట్లే కానీ, అక్కడ రెండువిడతల్లో, ఈనెల 13, 20 తేదీల్లో పోలింగ్ జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించుకుంది. గత ఎన్నికల్లో బీజేపీ కంటే ఓ ఐదుసీట్లు ఎక్కువ తెచ్చుకున్న జెఎంఎం, కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. స్థాయితో సంబంధం లేకుండా ప్రతీ చిన్న ఎన్నికనూ తీవ్రంగా తీసుకొనే బీజేపీ ఈ మారు జార్ఖండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

బీజేపీ ఇప్పటికే విడుదల చేసిన మేనిఫెస్టోలో, తాను అధికారంలోకి రాగానే 2.87లక్షల ప్రభుత్వోద్యోగాలను భర్తీచేస్తానని, నెలకు రెండువేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇవ్వడంతోపాటు, మహిళలకు వివిధ పథకాలద్వారా దండిగానే ఆర్థికసాయం ప్రకటించింది. పదేళ్ళక్రితం బీజేపీ ఆదివాసీయేతరులను, ప్రధానంగా ఓబీసీలను దగ్గరచేర్చుకొని జార్ఖండ్‌లో అధికారంలోకి రాగలిగింది. ఆ ఎన్నికల్లో మోదీ హవా ఉధృతంగా ఉన్నందువల్ల కూడా ఆ ఎత్తుగడ సులువుగా పనిచేసింది, ఓబీసీ నాయకుడు రఘుబర్‌దాస్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. కానీ, ఐదేళ్ళక్రితం బీజేపీయేతర శక్తులన్నింటినీ దగ్గరకు చేర్చుకోగలిగిన జెఎంఎంకు అనుకూలంగా గాలి తిరిగిపోయింది. ఆదివాసులను విస్మరించినందునే అధికారాన్ని చేజార్చుకున్నానని బీజేపీ నమ్ముతున్నందున ఈ మారు వారి ఓట్లను సైతం అధికంగా కొల్లగొట్టేందుకు విశేషమైన ప్రయత్నం చేస్తోంది. జార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి (యూసిసి)ని అమలు చేస్తానని ప్రకటించిన ఆ పార్టీ దానినుంచి ఆదివాసులను మాత్రం మినహాయించింది. ఇందుకు పూర్తిభిన్నంగా జెఎంఎం ఆదివాసులకు 1932 నాటి ఖతియాన్ విధానం ఆధారంగా సర్నా మతనియమావళిని అమలుచేసి ఒక ప్రత్యేక ఆదివాసీ మత గుర్తింపునకు హామీ పడుతోంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం ఐదు ఎస్టీ రిజర్వుడు సీట్లనూ ఇండియా బ్లాక్ గెలుచుకున్న విషయం తెలిసిందే.

ఆదివాసుల ఓట్లకోసం బీజేపీ ఎంతగా కష్టపడుతోందో సోమవారం ఎన్నికల సభలో మోదీ చేసిన వ్యాఖ్యలు తెలియచెబుతాయి. రాష్ట్ర బీజేపీ ఉధృతంగా ప్రచారం చేస్తున్న అంశాలను ఆయన కాస్తంత హుందాగా చెప్పారంతే. బంగ్లాదేశీ అక్రమ వలసదారులు జార్ఖండ్ మూలమూలల్లోకి చొరబడ్డారని, వారికి దొంగసర్టిఫికేట్లు ఇచ్చి స్థిరపరచడం ద్వారా ఇండియా కూటమిలోని పార్టీలు అతిపెద్ద ఓటుబ్యాంకును తయారుచేసుకున్నాయని, ఆ చొరబాటుదారులు గిరిజన ఆడబిడ్డలమీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, విద్యాసంస్థలకు మైనారిటీ గుర్తింపుతో ఆదివాసీ విద్యార్థులకు జెఎంఎం ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని బీజేపీ విమర్శ. సంథాల్ పరగణాస్‌లో పెద్దసంఖ్యలో అక్రమ చొరబాటుదారులు స్థిరపడ్డారంటూ జార్ఖండ్ హైకోర్టులో ఒక పిల్ దాఖలు కావడం, దానిపై మీడియాలో విస్తృతంగా చర్చ జరుతూండటం ఎన్నికల మహత్యమే కావచ్చు. జెఎంఎం–కాంగ్రెస్ కూటమి ఏలుబడిలో అన్ని రకాలుగా అన్యాయమైపోయిన ఆదివాసుల ప్రయోజనాలను పరిరక్షించేది తానేనని బీజేపీ చెబుతోంది.

ఒక భూకుంభకోణంలో హేమంత్ సొరేన్ అరెస్టు, సుప్రీంచొరవతో విడుదల కావడం, హేమంత్ భార్య కల్పనా సొరేన్ తెరమీదకు రావడం ఇత్యాది పరిణామాలు నిజానికి జెఎంఎంకు కొత్తశక్తిని ఇచ్చాయి. మహిళా ఓటర్లను ఆమె బలంగా ఆకర్షించగలుగుతున్నదని అంటారు. అయితే, ఓబీసీలు, ఎగువకులాల ఓట్లు అధికంగా బీజేపీపక్షాన ఉన్నందున ఇండియా కూటమిని ఆదుకోవాల్సింది ప్రధానంగా రాష్ట్రజనాభాలో దాదాపు 27శాతంగా ఉన్న ఆదివాసులే. హేమంత్ సొరేన్ మీద కేసులు, అనంతరం చంపయ్ సొరేన్ బీజేపీలో చేరడం ఇత్యాది పరిణామాల మీద జార్ఖండ్ వాసులు ఏ తీర్పు ఇచ్చారో నవంబరు 23న తేలుతుంది.

వివక్షలు లేని వ్యాపార భారతం లక్ష్యం

ఈస్టిండియా కంపెనీ భారత్‌ను అణచివేసింది. తన వ్యాపార శక్తి సామర్థ్యాలతో కాకుండా, భారతీయ సంపద సృష్టికర్తలను తన కుటిల వ్యాపార పద్ధతులతో జీవన్మరణ దుస్థితిలోకి నెట్టివేయడం ద్వారా ఆ కంపెనీ మన దేశంపై పెత్తనం చేసింది. మన మహారాజులు, నవాబులతో భాగస్వామ్యం నెరపి, ముడుపులు, లేదంటే బెదిరింపులతో వారిని వశంచేసుకుని మన మాతృభూమి జీవన చైతన్యాన్ని స్తంభింపజేసింది. సుదూర పరాయి దేశం నుంచి వచ్చిన ఆ కంపెనీ మన సంప్రదాయ బ్యాంకింగ్ వ్యవస్థలను నియంత్రించింది; పాలనా యంత్రాంగాలపై అజమాయిషీ చేసింది; సమాచార వాహికలను తన ప్రభావ ప్రాబల్యాలలోకి తీసుకున్నది. మనం మన స్వాతంత్ర్యాన్ని మరో దేశానికి కోల్పోలేదు. ఒక గుత్తాధిపత్య వాణిజ్య సంస్థకు చేజార్చుకున్నాము. ఇదొక కఠోర వాస్తవం. ఈ విషాద చరిత్రను మరువ వద్దు, సదా జ్ఞాపకముంచుకోవాలి.

మనతో వాణిజ్యానికి వచ్చిన ఈస్టిండియా కంపెనీ మనకు వ్యాపార నిబంధనలను నిర్దేశించింది. పోటీని నిర్మూలించింది. ఎవరు ఎవరికి ఏది అమ్మాలో, అమ్మకూడదో ఆజ్ఞాపించింది. మన సంప్రదాయ వస్త్ర ఉత్పత్తి రంగాన్ని సర్వనాశనం చేసింది. సరుకుల తయారీ వ్యవస్థలను ఆనవాలు లేకుండా చేసింది. వినూత్న ఉత్పత్తులు వేటినైనా ఆ కంపెనీ ప్రవేశపెట్టిందా? విపణి అవకాశాలను విస్తరింపచేసిందా? నాకు తెలియదు. చరిత్ర చెప్పితే కదా. నాకు తెలిసిందల్లా మన దేశంలో అభిని (నల్ల మందు మొక్క) సాగుపై సంపూర్ణ నియంత్రణ సమకూర్చుకుని మరో దేశం (చైనా)లో నల్లమందు వ్యసనపరులకు ఆ సరుకును సరఫరా



> ఒక రాజకీయవేత్తగా నా కర్తవ్యం చారిత్రకంగా అణగారిపోయిన, గొంతుక లేనివాళ్ల పక్షాన నిలబడడమే.

చేయడంపై ప్రత్యేక, సురక్షిత గుత్త వ్యాపార హక్కులను సాధించుకున్నది. ఆ కంపెనీ మన సిరిసంపదలను దోపిడీ చేసింది. పాలనాధికారాలూ పొంది మన ప్రజలను అధిక పన్నులతో పీడించింది. అయినప్పటికీ బ్రిటన్‌లో ఆదర్శ వాణిజ్య సంస్థ (నవీన పరిభాషలో మోడల్ కార్పొరేట్ సిటిజన్)గా ప్రస్తుతులనందుకున్నది. ఆ కంపెనీ విదేశీ వాటాదారులు ఆ సంస్థ పేరు ప్రఖ్యాతులకు పొంగిపోయేవారు!

1857లో ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంతో ఈస్టిండియా కంపెనీ ప్రాబల్యం అన్ని విధాల అంతరించింది. దాన్ని మన తీరానికి పంపిన ఆ పరసీమ సామ్రాజ్యవాదులే మన దేశానికి ప్రత్యక్ష పాలకులు అయ్యారు. ఆనాడు ఆ కంపెనీ వ్యాపార, పాలనా కార్యకలాపాలతో నెలకొన్న భీతి ఇప్పుడు మళ్లీ మన దేశ ప్రజలను ఆవహిస్తోంది. ఆ కంపెనీ లక్షణాలను పుణికి పుచ్చుకున్న కొత్త గుత్త వ్యాపారులు మన వ్యాపార, వాణిజ్య రంగాలలో చెలరేగిపోతున్నారు. అపార ధనరాశులను కూడగట్టుకున్నారు. వారి ఆర్థిక అభిజాత్యానికి హద్దులు లేకుండా పోయాయి. కోటానుకోట్ల భారతీయులు కృశించిపోతుండగా ఆ ఆధునిక కుబేరులు ఉజ్వలంగా వెలిగిపోతున్నారు. మన సంస్థలు, వ్యవస్థలు ఇంకెంత మాత్రం మన ప్రజలకు చెందినవిగా లేవు. వాటి కార్యకలాపాలు మన ప్రజల నిర్ణయాలకు లోబడి జరగడం లేదు. అతి కొద్దిమంది గుత్త వ్యాపారుల ఆదేశాల మేరకు అవి పనిచేస్తున్నాయి. వారి పురోగతే వాటి లక్ష్యమైపోయింది. పర్యవసానంగా లక్షలాది చిన్న పరిశ్రమలు చితికిపోయాయి. మన దేశం ఇప్పుడు యువ భారతీయులకు సరైన ఉపాధి అవకాశాలను కల్పించలేని దుస్థితిలోకి జారిపోయింది. వందే మాతరం. భారత భూమి ఈ గడ్డపై పుట్టిన వారందరికీ మాతృమూర్తి. అయితే ఆమె ప్రసాదించిన అపార సహజ వనరులు అన్నీ ఇప్పుడు గుత్తాధిపత్యంలో ఉన్నాయి. అనేక మంది హక్కులను త్రోసిపుచ్చి ఎంపిక చేసుకున్న అతి కొద్ది మందికి ఆ అనంత సిరులపై స్వామ్యం కల్పించడమేమిటి? భారతమాత పరితాపం చెందుతోంది.



> ఈ దేశం మనందరి కోసం ఉన్నది. ప్రభుత్వాధినేతలతో మంచి సంబంధాలతో బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణం తీసుకుని తిరిగి చెల్లించడాన్ని ఎగవేసిన 100 మంది బడా వ్యాపారస్తుల పట్ల ఇంకెంత మాత్రం ఆదరభావం చూపవద్దు. నిబంధనల ప్రకారం వ్యవహరించే వ్యాపార సంస్థలకు మాత్రమే రుణాలు మంజూరుచేసి లాభాలు ఆర్జించాలి. ఇది అందరికీ శ్రేయస్కరం.

దేశ ఆర్థిక రంగంపై గుత్తాధిపత్యం పెంచుకుంటున్న వారి మూలంగా భీతి చెందుతున్న వ్యవస్థాపనాదక్షులు, దేశభక్తి ప్రపూర్ణులు అయిన భారతీయ వ్యాపారులు ఎంతో మంది ఉన్నారని నాకు తెలుసు. మీరూ వారిలో ఒకరుగా ఉన్నారా? ఫోన్‌లో మాట్లాడడానికి సైతం భయపడుతున్నారా? గుత్తాధిపత్యవాదులు రాజ్య వ్యవస్థతో లాలూచీపడి మీ వ్యాపార రంగంలోకి ప్రవేశించి, మీ సొంత సంస్థను స్వాయత్తం చేసుకోవడానికి పూనుకుంటారేమోననే భయం కలుగుతుందా? మీ వ్యాపార సంస్థలను ఆ గుత్తాధిపత్య కంపెనీలకు విక్రయించేలా చేసేందుకు ఐటీ, సీబీఐ, ఈడీ దాడులు జరగవచ్చని ఆందోళన చెందుతున్నారా? వ్యాపార పురోగతికి అవసరమైన పెట్టుబడి సకాలంలో మీకు లభించకుండా చేస్తారేమోనని కలవరపడుతున్నారా? మీ వ్యాపార మనుగడను దెబ్బతీసేందుకు హఠాత్తుగా నియమ నిబంధనలు మార్చివేస్తారేమోనని స్థిమితం కోల్పోతున్నారా? ఇంతకూ ఉత్పత్తుల ఉత్కృష్టతగానీ, వినియోగదారుల బాహుళ్యం కానీ, భావాల వినూత్నత్వంగానీ ఆ బడా గుత్త వ్యాపారుల ప్రధాన యోగ్యత కానే కాదు; అది, భారతదేశ పాలనా సంస్థలు, విధాన నిర్దేతలను తమకు అనుకూలంగా ప్రభావితం చేయగల సామర్థ్యం మాత్రమే. మీ వలే కాకుండా, ఆ బడా గుత్తాధిపత్య కంపెనీలు భారతీయులు ఏ పుస్తకాలు, పత్రికలు చదవాలో, ఎలాంటి సినిమాలు, ఏ టీవీ కార్యక్రమాలు చూడాలో నిర్ణయిస్తున్నాయి. భారతీయులు ఎలా ఆలోచించాలో, ఏ విధంగా మాట్లాడాలో ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పుడు ఒక వ్యాపారవేత్త విజయం, ఒక వ్యాపార సంస్థ సాఫల్యం లేదా పురోగతిని నిర్ణయిస్తుంది మార్కెట్ శక్తులు కావు, అధికార సంబంధాలు మాత్రమే! వ్యాపార జయాపజయాలను ఇవే నిర్ణయిస్తున్నాయి.

మీ హృదయాలలో ఒక భయవిహ్వలత గూడుకట్టుకుని ఉంది. అయితే దానితో పాటు ఆశాభావం కూడా ఉన్నది. ఒక రాజకీయవేత్తగా నా లక్ష్యం, కాదు కర్తవ్యం చారిత్రకంగా అణగారిపోయినవాళ్ళ, గొంతుక లేనివాళ్ల పక్షాన నిలబడడమే. సమాజంలో అట్టడుగున ఉన్న చిట్టచివరి బడుగుజీవిని ఉద్ధరించడమే మన ధ్యేయం కావాలన్న గాంధీజీ మాటలే నాకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తే నా రాజకీయ కార్యాచరణను సదా ప్రభావితం చేస్తోంది. ఆ ప్రభావమే గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, ఆహార హక్కుకు, భూ స్వాధీన బిల్లుకు మద్దతునిచ్చేలా నన్ను పురిగొల్పింది. నియామగిరి ఘర్షణల్లో ఆదివాసీల తరఫున నేను నిలబడ్డాను. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమించినప్పుడు వారి పక్షాన నా గొంతు విప్పాను. మణిపూర్ ప్రజల వద్దకు స్వయంగా వెళ్లి వారి బాధలు చూశాను, వారి వ్యథలు విన్నాను.

మీకు ఇదిరాస్తున్న సందర్భంగా గాంధీజీ స్ఫూర్తిదాయకమాటల గాంభీర్యాన్ని, పరమార్థాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయానన్న సత్యాన్ని గ్రహించాను. మన సమాజంలో అనేక సామాజిక శ్రేణులు ఉన్నాయి. మీ వ్యాపార వర్గం వాటిలో ఒకటి. మీరు అనేక ప్రతికూలతల నెదుర్కొంటున్నారు. పీడనలకు గురవుతున్నారు మీకు ఏవైతే నిరాకరించబడ్డాయో అంటే ఒకటి రెండు సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ న్యాయమైన రీతుల్లో పోటీపడే పరిస్థితులు లేకుండా చేశారో అటువంటి పరిస్థితులు, అవకాశాలను కల్పించడమే నా రాజకీయాల లక్ష్యం. ప్రభుత్వం కేవలం ఒకరి ప్రయోజనాలకు మాత్రమే కాపుకాస్తూ మిగతా వారిని ఉపేక్షించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించకూడదు. అవినీతికర రహస్య వ్యాపార పద్ధతులను ప్రోత్సహించకూడదు. ప్రభుత్వ ఏజెన్సీలు అనేవి ఆయుధాలు కాదు. వ్యాపార సంస్థలను బెదిరించడానికి వాటిని దుర్వినియోగం చేయకూడదు. ఇదలా ఉంచితే మీలో నెలకొని వున్న భయం మీ నుంచి ఆ బడా గుత్తాధిపత్య వ్యాపారులకు బదిలీ కాకూడదు. అలా కావడాన్ని నేను ఎటువంటి పరిస్థితులలోను సమర్థించను. వారు చెడ్డ వ్యక్తులేమీ కాదు. మన సామాజిక, రాజకీయ పరిస్థితుల నుంచి ఉత్పన్నమైనవారే. వారికీ వ్యాపారాల నిర్వహణకు అవకాశాలు కల్పించాలి. అలాగే మీకు కూడా.

ఈ దేశం మనందరి కోసం ఉన్నది. ప్రభుత్వాధినేతలతో మంచి సంబంధాలతో బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణం తీసుకుని తిరిగి చెల్లించడాన్ని ఎగవేసిన 100 మంది బడా వ్యాపారస్తుల పట్ల ఇంకెంత మాత్రం ఆదరభావం చూపవద్దు. నిబంధనల ప్రకారం వ్యవహరించే వ్యాపార సంస్థలకు మాత్రమే రుణాలు మంజూరుచేసి లాభాలు ఆర్జించాలి. ఇది అందరికీ శ్రేయస్కరం. చివరిగా రాజకీయ ప్రవర్తనా రీతులను ప్రభావితం చేసి వాటిని తీర్చిదిద్దడంలో సామాజిక ఒత్తిళ్ల, ప్రతిఘటనల శక్తిని తక్కువ అంచనా వేయకూడదు. అవతార పురుషులు, మహాశక్తిశీలులయిన అతివలు అవసరం లేదు. మీరు మార్పును సాధించగల శక్తులు. సంపదను సృష్టించండి, అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించండి.

ప్రగతిశీల భారతీయ వ్యాపార సంస్థలకు చేయూత నివ్వాలి. వాటిని ప్రత్యేకంగా ప్రోత్సహించాలి. అందుకు శాసనపరమైన, పాలనాపరమైన చర్యలు చేపట్టాలి. ఇది వ్యాపార భారత్‌కు ఒక కొత్త ఒప్పందం. ఇదొక నూతన భావన. దీనిని అమలుపరచాల్సిన సమయమాసన్నమయిందని నేను నిండుగా విశ్వసిస్తున్నాను.

● రాహుల్ గాంధీ
కాంగ్రెస్ ఎంపీ

కాలానికి ముందు నడిచిన ఆర్థికవేత్త

‘మీ ఆంధ్రజ్యోతికి కాలమ్ రాయడం నాకు సంతోషమే.. కాని ప్రతి వారమూ రాయలేను’ అని రెండునెలల క్రితం చెప్పిన ప్రముఖ ఆర్థికవేత్త, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆర్థిక సలహా మండలి చైర్మన్ బిబేక్ దేబ్‌రాయ్ నవంబర్ 1న అనారోగ్యంతో మరణించారు. చాలా కాలం క్రితం యూపీఏ హయాంలో ఆయన ఆంధ్రజ్యోతికి కాలమ్ రాసేవారు. అప్పుడు ఆయన సోనియాగాంధీ చైర్మన్‌గా ఉన్న రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌లో పనిచేసేవారు. 1991లో ఆర్థిక ఉదారీకరణ తర్వాత వెలుగులోకి వచ్చిన వారిలో బిబేక్ దేబ్‌రాయ్ ఒకరు. అమర్త్యసేన్, వై. వేణుగోపాల్ రెడ్డి, రఘురామరాజన్, అనంత్, అరవింద్ పనగ్రియా లాంటి కొద్ది మంది ప్రముఖ భారతీయ ఆర్థికవేత్తలకు సమస్కంధుడు వివేక్ దేబ్‌రాయ్.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టకపోతే దేశంలో అభివృద్ధి రేటు ఇంత వేగంగా పెరిగేది కాదని, మౌలిక సదుపాయాల కల్పన పుంజుకునేది కాదని కొద్ది రోజుల క్రితం తమిళనాడులో పీవీ స్మారకోపన్యాసంలో చెప్పిన దేబ్‌రాయ్ కోల్‌కతా ప్రెసిడెన్సీ కాలేజీ, పూణే గోఖలే ఇనిస్టిట్యూట్, ఐఐఎఫ్‌టిల్లో పని చేశారు. ఆయన భారతదేశ భావజాలం, సంస్కృతి పూర్తిగా ఇముడ్చుకున్న స్వదేశీ ఆర్థిక నిపుణుడు. 40వ ఏట సంస్కృతం నేర్చుకుని మహాభారతం, రామాయణంతో పాటు అనేక పురాణాలను ఆంగ్లంలో అనువదించిన బిబేక్ దేబ్‌రాయ్ పాత వ్యవస్థల్ని సృజనాత్మక విధ్వంసం చేయడం ద్వారానే కొత్త వ్యవస్థల్ని ఏర్పర్చగలమని విశ్వసించే ఆధునికుడు. నిజమైన ఆధునిక ఆర్థిక వ్యవస్థ ఏర్పడాలంటే కాలం చెల్లిన చట్టాల్ని రద్దు చేయాలని, రెడ్ టేపిజం, అవినీతిని అంతం చేయాలని, న్యాయ సంస్కరణలతో పాటు మొత్తం రాజ్యాంగాన్నే తిరగరాయాలని ఆయన వాదించారు. పెండింగ్‌లో ఉన్న వేలాది కేసులు పరిష్కారం కావడం, న్యాయమూర్తుల నియామకాలు, గవర్నర్ల పాత్ర, ఎన్నికల సంస్కరణలపై విప్లవాత్మక నిర్ణయాలు అవసరమని ఆయన చెప్పారు. అంతర్జాతీయ వర్తకం, పెట్టుబడులపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, పరిపాలనా సంస్కరణలను, వికేంద్రీకరణను, సమాఖ్య స్ఫూర్తిని సమగ్రంగా అమలు చేయాలని ఆయన విశ్వసించారు. ఏడవ షెడ్యూలులో చెప్పిన విధంగా రాష్ట్రాల అధికారాలను కాపాడాలని, స్థానిక సంస్థలకు పూర్తిగా సాధికారిత కల్పించాలని ఆయన చెప్పారు.

రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌లో పనిచేసినప్పుడు గుజరాత్ ఆర్థిక నమూనాను సమర్థించినందుకు బయటకు వెళ్లాల్సి వచ్చిన బిబేక్ దేబ్‌రాయ్ ప్రధానమంత్రి సలహాదారుగా ఉన్నప్పటికీ ఆయన సలహాల ప్రకారమే మోదీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వహించిందని చెప్పలేము. బిబేక్ దేబ్‌రాయ్ లాంటి వారు తమ కాలాని కంటే ముందు ఆలోచించి స్వల్పకాలిక లక్ష్యాలు కాకుండా దీర్ఘకాలిక లక్ష్యాలు నిర్ణయించుకోవడంలో ప్రభుత్వానికి సలహా నిస్తారు. 2047 కల్లా వికసిత భారత్, అమృత కాల్ అన్న పదాలు ఆయన ఆలోచనల నుంచే పుట్టాయి. కాని నినాదాలు చేయడమే కాని ఆచరించడంలో పాలకులు శ్రద్ధ చూపకపోతే ఆర్థికవేత్తలు మాత్రం ఏమి చేయగలుగుతారు? ఉదాహరణకు వచ్చే ఏడాది కల్లా భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గత ఏడాది బడ్జెట్ ప్రసంగంలో చెప్పిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది జనవరిలో మాట మార్చి 2027–28 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోనున్నట్లు ప్రకటించారు. బిబేక్ దేబ్‌రాయ్ ఈ విషయంలో స్పష్టంగా ఉన్నారు. ‘రూపాయి విలువతో అంచనా వేసే జీడీపీని డాలర్లకు మార్చి 5 ట్రిలియన్లకు చేరుకోవడం సాధ్యమా? అలా జరగాలంటే మన జీడీపీ కనీసం 10 శాతం దాటాలి’ అని చెప్పారు.

14వ ఆర్థిక సంఘం చైర్మన్ వైవి రెడ్డి చేసిన అనేక ప్రతిపాదనలను బిబేక్ దేబ్‌రాయ్ ప్రభుత్వానికి సూచించారు. భారతదేశంలో పరిపాలన అత్యధికంగా కేంద్రీకృతం అయిందని ఆయన అభిప్రాయపడ్డారు. అధికారాల వికేంద్రీకరణ, నిధుల పంపిణీ, కేంద్ర ప్రాయోజిత పథకాలను పునర్వ్యవస్థీకరించడం. రాష్ట్రాలకు పన్నుల్లో వాటా పెంచడం వంటి 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసులను అమలు చేయాలని ఆయన సూచించారు. అసలు ఫైనాన్స్ కమిషన్లను శాశ్వతం చేయాలా లేక రద్దు చేయాలా అన్న చర్చను రేకెత్తించారు. రాష్ట్రాలకు పన్నులు, నిధుల పంపిణీ వాటాను రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించవచ్చు కదా అని ఆయన వాదించారు. కేంద్ర రాష్ట్ర సంబంధాల గురించి ఆయన కొత్త అధ్యాయాన్ని తెరిచారు.

రిజర్వు బ్యాంకుకు స్వతంత్ర ప్రతిపత్తి లేదని స్పష్టంగా చెప్పిన వారిలో బిబేక్ దేబ్‌రాయ్ ఒకరు. మన వ్యవస్థలో అలాంటి అవకాశం లేదని, విత్త విధానం, ఆర్థిక విధానం వేర్వేరు కాదని ఆయన చెప్పారు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్‌ను, ఆ తర్వాత, జీఎస్టీ కౌన్సిల్ నేర్పాటు చేసిన తర్వాత భారతీయ ఆర్థిక సమాఖ్య స్ఫూర్తిలో మౌలిక మార్పులు వస్తున్నాయని వేణుగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యతో ఆయన పూర్తిగా ఏకీభవించారు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసిన తర్వాత ఏర్పడిన అసమానతల్ని పూరించేందుకు సంస్థాగత యంత్రాంగం అవసరమని ఆయన వాదించారు. డాలర్ డినామినేషన్‌తో కూడిన బాండ్లలో విదేశాల నుంచి అప్పులు తీసుకోవాలని బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనను బిబేక్ దేబ్‌రాయ్‌తో పాటు వైవి రెడ్డి, రంగరాజన్, రఘురామరాజన్ కూడా విమర్శించారు. దీనివల్ల దేశం శ్రీలంకలాగా స్వతంత్రత కోల్పోతుందని హెచ్చరికలు రావడంతో ప్రభుత్వం ఆ బడ్జెట్ ప్రసంగాన్ని తయారు చేసిన అధికారిని తప్పించాల్సి వచ్చింది.

ప్రభుత్వ రంగ అసమర్థత సంకెళ్ల నుంచి భారత ఆర్థిక వ్యవస్థను విముక్తి చేయాలని వాదించిన వారిలో బిబేక్ ఒకరు. అంతర్గత వనరులను సృష్టించలేని రైల్వే లాంటి వ్యవస్థలను అభివృద్ధి చేయాలంటే భారీ ఎత్తున ప్రభుత్వ రంగ, ప్రైవేట్ భాగస్వామ్యం అవసరమని ఆయన చెప్పారు. పెరుగుతున్న ప్రయాణీకులు, రవాణా అవసరాల రీత్యా 2030 నాటికి 50 లక్షల కోట్లు అవసరమని, అది కేవలం ప్రభుత్వరంగమే సమకూర్చలేదని ఆయన వాదించారు. కాని రైల్వేలో ఆయన ఆశించినంత భారీ మార్పులు జరుగుతున్న దాఖలాలు కనపడడం లేదు.



> 40వ ఏట సంస్కృతం నేర్చుకుని మహాభారతం, రామాయణంతో పాటు అనేక పురాణాలను ఆంగ్లంలో అనువదించిన బిబేక్ దేబ్‌రాయ్ పాత వ్యవస్థల్ని సృజనాత్మక విధ్వంసం చేయడం ద్వారానే కొత్త వ్యవస్థల్ని ఏర్పర్చగలమని విశ్వసించే ఆధునికుడు. నిజమైన ఆధునిక ఆర్థిక వ్యవస్థ ఏర్పడాలంటే కాలం చెల్లిన చట్టాల్ని రద్దు చేయాలని, రెడ్ టేపిజం, అవినీతిని అంతం చేయాలని, న్యాయసంస్కరణలతో పాటు మొత్తం రాజ్యాంగాన్నే తిరగరాయాలని ఆయన వాదించారు. యూపీఏ హయాంలో ‘ఆంధ్రజ్యోతి’కి కాలమ్ రాసిన బిబేక్ దేబ్‌రాయ్ ప్రముఖ ఆర్థికవేత్తలు వై.వి. రెడ్డి, రఘురామరాజన్, అరవింద్ పనగ్రియాలకు సమస్కంధుడు.

పన్ను వ్యవస్థను సరళతరం చేసి పన్నును చెల్లించే వారి సంఖ్య పెంచేందుకు ఆయన 15 సంవత్సరాల లక్ష్యాన్ని నిర్దేశిస్తూ నీతీ ఆయోగ్‌కు ఒక పత్రాన్ని ఏడేళ్ల క్రితమే సమర్పించారు. కాన్ని పట్టించుకున్న నాథుడే లేడు. ‘మన దేశంలో విద్యారంగం నాణ్యత అన్ని రాష్ట్రాల్లో ఒకే రకంగా లేదు. ప్రభుత్వాలు పూర్తిగా దృష్టి కేంద్రీకరించి, వనరుల్ని కేటాయించి, అధ్యాపకులు, తల్లిదండ్రులతో చర్చించి దేశమంతా ఒకే రకమైన నాణ్యమైన విద్య అందించేలా చూడాలి’ అని ఆయన చెప్పారు. కాని ఆధునిక భారతదేశానికి అవసరమైన నాణ్యమైన విద్యను కల్పించడంలో మనం ఎన్నో దశాబ్దాలు వెనుకబడి ఉన్నాం.

దేశంలో పోషకాహారం లేకపోవడం మనకు కనపడని ఆకలితో సమానమేనని బిబేక్ దేబ్‌రాయ్ చెప్పారు. ఈ కనపడని ఆకలి వల్ల పుట్టుక లోపాలు, శిశుమరణాలు, అంధత్వం వంటి వాటికి దారితీస్తుందని ఆయన చెప్పారు. వివేక్ దేబ్‌రాయ్ లాంటి ఆర్థిక విజ్ఞుల ప్రోద్బలం వల్లే 80 కోట్ల మందికి ఆహార ధాన్యాల పంపిణీ జరుగుతోంది. ‘సంస్కరణలంటే ఏమిటి? వ్యక్తులు, సమూహాలు, సంస్థల్లో మార్పులు రావడం. ప్రభుత్వం అవసరమైన చోట ప్రజల పట్ల తన బాధ్యతను విస్మరించకుండా అనసరమైన చోట్ల నుంచి తప్పుకోవడం కావాలి’ ఆయన రాజస్థాన్ కేడర్‌కు చెందిన తెలుగు అధికారి వి. శ్రీనివాస్ పుస్తకానికి రాసిన ముందుమాటలో పేర్కొన్నారు. భారతదేశంలో అవినీతిపై ఆయన ఒక పుస్తకమే రాశారు. మన జీడీపీలో ప్రభుత్వ అధికారుల అవినీతి, రియల్ ఎస్టేట్‌తో సహా వివిధ రంగాల్లో ఎంత శాతం ఉన్నదో ఆయన పూసగుచ్చినట్లు తెలిపారు. కాని అవినీతిపై ప్రభుత్వం మాటల్లోనే కాని చేతల్లో ఏమీ చేయదని రోజురోజుకూ రుజువవుతోంది.

కేంద్రం నిర్విచక్షణగా వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌ఛార్జీల వల్ల ఫైనాన్స్ కమిషన్ నిర్ణయించిన పన్నుల పంపిణీ అనే దానికే అర్థం లేకుండా పోయింది. వైవిరెడ్డి హయాంలో 14వ ఆర్థిక సంఘం నిర్ణయించిన అత్యధిక పంపిణీకి అర్థం లేకుండా పోయింది. భారతీయ పన్ను వ్యవస్థలో సెస్‌లు, సర్ ఛార్జీలు శాశ్వత లక్షణంగా మారిపోయాయి. సెస్‌ల వినియోగంలో పారదర్శకత లేదు. జాతీయ ప్రాధాన్యత గల రంగాలకే కేంద్ర ప్రాయోజిత పథకాలను అమలు చేయాలని ముఖ్యమంత్రుల కమిటీలతో పాటు అనేక కమిటీలు సిఫారసు చేసినప్పటికీ కేంద్ర ప్రాయోజిత పథకాలు రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశాల్లోకి కూడా చొచ్చుకుపోయాయి. రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర పథకాలను పునర్వ్యవస్థీకరించకూడదని బిబేక్ దేబ్‌రాయ్ చెప్పిన మాటల్ని కేంద్రం విస్మరిస్తోంది. అధికరణ 282 ప్రకారం చేసే ప్రాయోజిత పథకాల క్రింద గ్రాంట్లు ఫైనాన్స్ కమిషన్ బదిలీలకు మించిపోతున్నాయి. ఉచితాలను బిబేక్ దేబ్‌రాయ్ తీవ్రంగా విమర్శించారు. దేశమంతటా బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు అన్ని రాష్ట్రాలు ఉచితాలను, రాయితీలను ఎడా పెడా కల్పించడంపై ఆయన వ్యాఖ్యానిస్తూ ‘మన ప్రజలు దేనికి అర్హులవుతారో అవే వారికి లభిస్తాయి’ అని వ్యాఖ్యానించారు. మీరు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ కదా.. మీ సలహాలన్నీ అమలు అవుతున్నాయా అని ప్రశ్నిస్తే ‘నా పాత్ర ప్రధానమంత్రికి సలహా ఇవ్వడం మాత్రమే. అది కూడా ఆయనకు అవసరమైనప్పుడే’ అని బిబేక్ దేబ్‌రాయ్ నిర్వేదంగా అన్నారు!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

శ్వేతసౌధ విజేత ఎవరు?

అమెరికా అధ్యక్ష ఎన్నికలలో సాధారణంగా స్థానిక అంశాల ప్రాతిపదికన కాకుండా అంతర్జాతీయ అంశాల ఆధారంగా తమ అధినేతను ఎన్నుకోవడానికి ఓటర్లు ప్రాధాన్యత ఇవ్వడం పరిపాటి. ఈ కారణంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలలో విదేశాంగ విధానం సహజంగా ముఖ్య భూమిక వహిస్తుంది.

అమెరికాకు అత్యంత సన్నిహిత దేశం ఇజ్రాయెల్. ఈ యూదు దేశానికి చేసినంతగా ఆర్థిక, సైనిక సహాయం అమెరికా ఇప్పటివరకు ఏ ఇతర దేశానికీ చేయలేదు. అమెరికా విదేశాంగ విధానంలో ఇజ్రాయెల్ అరబ్బు, ఇరాన్ ఉద్రిక్తతలకు అగ్ర ప్రాధాన్యం వహిస్తున్నాయి. గత ఏడాది అక్టోబర్ నుంచి పలస్తీనాలోని గాజాపై ఇజ్రాయెల్ అమానుష సైనిక దాడులు చేస్తోంది. అమెరికాతో సహా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో పెల్లుబుకుతున్న నిరసనల నేపథ్యంలో అమెరికా ఓటర్లు తమ తీర్పును వెలువరిస్తున్నారు.



> గుజరాత్‌లోని ముంద్రా రేవు నుంచి ఇజ్రాయెల్‌లోని హైఫా రేవు మీదుగా ఐరోపాకు సరుకులు రవాణా చేయడానికి ఉద్దేశించిన ఒక బృహత్తర పథకాన్ని అమలుపరిచేందుకు ప్రధాని మోదీ పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సముద్ర మార్గం విషయమై అమెరికా, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, భారత్ అధికారులు కసరత్తు చేస్తున్నా అనూహ్యంగా గాజా దాడుల నేపథ్యంలో దానిపై పురోగతి కొరవడింది. ఈ పరిస్థితులలో అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల ఫలితాల పట్ల ఇటు భారత్ నుంచి అటు అరబ్బు, ఇజ్రాయెల్ వరకు ఆసక్తి నెలకొని ఉన్నది.

అధ్యక్ష పదవీ పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థులు – డోనాల్డ్ ట్రంప్, కమలా హరిస్ – కూడ ఇజ్రాయెల్‌కు అనుకూలురే. ఇరువురిలో ఎవరు విజేతగా నిలిచినా ఇజ్రాయెల్‌ను నివారించడం లేదా దానికి సైనిక సహాయాన్ని స్తంభింపచేసే అవకాశాలు అంతగా లేవు. అయినా మధ్య ప్రాచ్య ఉద్రిక్తతలు అమెరికా ఎన్నికలలో ఒక కీలక అంశం కావడం విచిత్రం. ఆక్రమిత గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల ప్రకంపనలు అమెరికా అనుకూల అరబ్బు దేశాల ప్రజానీకంలో ఆగ్రహావేశాలకు కారణం కాకూడదని ఆయా దేశాల ప్రభుత్వాలు కోరుకుంటున్నాయి. అందుకే అవి అమెరికా ద్వారా ఇజ్రాయెల్‌ను నిలువరించేందుకు విఫలయత్నాలు చేశాయి. అమెరికా చరిత్రలో జో బైడెన్ ఇజ్రాయెల్‌కు అత్యంత సన్నిహిత అధ్యక్షుడుగా పేరు పొందగా అదే రాజనీతిని కమలా హరిస్ కూడ కొనసాగించే అవకాశాలు ఉన్నాయని అరబ్బు మేధావులు అభిప్రాయపడుతున్నారు. అయితే డెమొక్రాట్లలో వ్యవస్థీకృతమైన దౌత్యవిధానం ఉంటుందని, అందులో అరబ్బులకు కూడ కొంత వరకు స్థానం ఉంటుందని కూడా అరబ్బు మేధావులు విశ్వసిస్తున్నారు. ఈ నాటకీయ దౌత్య విధానం తమకు కొంత వరకు ఉపశమనం చేకూర్చగలదని అరబ్ ప్రభుత్వాల ఆశ.

ఇజ్రాయెల్‌తో సరిహద్దులు ఉన్న జోర్డాన్, ఈజిప్టులు ఆ యూదు దేశంతో దౌత్య సంబంధాలు కలిగి ఉండడమే కాకుండా అమెరికా కారణాన పలస్తీనాపై దాడులకు జోర్డాన్ పరోక్షంగా ఇజ్రాయెల్‌కు సహకరిస్తుందనే ఆరోపణలు కూడ ఉన్నాయి.

డోనాల్డ్ ట్రంప్ తన అధ్యక్ష హయంలో అబ్రహం ఒడంబడికకు శ్రీకారం చుట్టడం ద్వారా మధ్యప్రాచ్య అరబ్బు దేశాలలో ఒక సాహసోపేత దౌత్య విధానానికి నాంది పలికారు. ఈ ఒడంబడిక ద్వారా ఇజ్రాయెల్‌తో సంపన్న అరబ్బు దేశాలు మైత్రి చేసుకొనే అవకాశం కల్పించారు. గల్ఫ్‌లోని యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, బహ్రెయిన్‌లతో పాటు సుడాన్, మొరకో దేశాలు ఇజ్రాయెల్‌ను గుర్తిస్తూ వాటితో దౌత్యసంబంధాలను నెలకొల్పుకున్నాయి. దుబాయి అయితే ఇజ్రాయెల్ దోస్తానా విషయమై మిగతా గల్ఫ్ రాజ్యాల కంటే ముందంజలో ఉన్నది. పలస్తీనాను కూడ ఒక ప్రత్యేక దేశంగా గుర్తించే నిబంధనలతో కీలకమైన సౌదీ అరేబియా సైతం అబ్రహం ఒడంబడికలో చేరుతుందనే వార్తలు వచ్చిన నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్ 7న ఇరాన్ ప్రొద్బలంతో హమాస్ ఇజ్రాయిల్‌పై క్షిపణి దాడులు చేసింది. అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ పాల్పడుతున్న మారణకాండతో అరబ్బులలో ఆగ్రహావేశాలు పెరిగిపోయాయి. దీంతో ఏ ఒక్క అరబ్బు దేశం కూడ అబ్రహం ఒడంబడిక లేదా మరే ఇతర నూతన ఒప్పందాల ద్వారా ఇజ్రాయెల్‌తో బాహాటంగా మైత్రి చేసేందుకు మొగ్గు చూపకపోవచ్చు.

అబ్రహం ఒడంబడిక ద్వార భారత్ నుంచి కీలక గల్ఫ్ అరబ్బు దేశాలతో పాటు ఇజ్రాయెల్ మీదుగా ఐరోపాకు నౌకా రవాణా మార్గాన్ని సుగమం చేసే దిశగా కూడ అడుగులు పడుతున్నాయి. ఈ యురేసియా మార్గం ద్వారా భారత్ నిజంగా తాను విశ్వగురు అని నిరూపించుకునే అవకాశం ఉంది. గుజరాత్‌లోని ముంద్రా రేవు నుండి ఇజ్రాయిల్‌లోని హైఫా రేవు మీదుగా ఐరోపాకు సరుకులు రవాణా చేయడానికి ఉద్దేశించిన ఈ బృహత్తర పథకాన్ని అమలుపరిచేందుకు ప్రధాని మోదీ పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. గుజరాత్‌లోని ముంద్రా నౌకాశ్రయం, అటు చివర ఇజ్రాయిల్‌లోని హైఫా నౌకాశ్రయ నిర్వహణ రెండు కూడ అదానీ గ్రూప్ యాజమాన్యంలో ఉన్నాయనేది మరో విషయం. ఈ మార్గం గురించి అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, భారతీయ అధికారులు కసరత్తు చేస్తున్నా అనూహ్యంగా గాజా దాడుల నేపథ్యంలో దీనిపై పురోగతి కొరవడింది. ఈ పథకం ముందుకు సాగడానికి అబ్రహం ఒడంబడిక కర్త అయిన డోనాల్డ్ ట్రంప్ మరోసారి శ్వేత సౌధంలో ఉండడం భారత్‌కు చాలా అవసరం కూడా.

డోనాల్డ్ ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికయిన తర్వాత తన విదేశీ పర్యటనను సౌదీ అరేబియా నుంచి ప్రారంభించారు. తద్వారా మధ్య ప్రాచ్య అరబ్బు ప్రాంతం పట్ల తనకున్న ప్రాధాన్యతను చాటారు. జెరుసాలం మూమ్మాటికి ఇజ్రాయిల్‌కు చెందాలని చెప్పిన డోనాల్డ్ ట్రంప్‌కు కీలక అరబ్బు పాలకులందరితో పాటు ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమీన్ నెతన్యాహుతో కూడ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ పరిస్థితులలో అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల ఫలితాల పట్ల ఇటు భారత్ నుంచి అటు అరబ్బు, ఇజ్రాయెల్ వరకు ఆసక్తి నెలకొని ఉన్నది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రజాసేవ, కళాసేవ రెండు కనులుగా...

తెలుగు రాజకీయ నేతలలో అరుదైన జీవనవిధానంతో నిస్వార్థ ప్రజాసేవకు మారుపేరుగా నిలిచారు ఎస్.ఆర్.ఎ.ఎస్. అప్పలనాయుడు. బడుగుల ఇంట పుట్టి ఎందరికో అడుగు జాడగా ఎదిగిన ఆదర్శమూర్తి ఆయన. ఉమ్మడి విశాఖ జిల్లా పెందుర్తిలో జన్మించారు. తాతల నుండి వారసత్వంగా వచ్చిన గ్రామ మునసబు వృత్తి కొన్నాళ్ళు నిర్వహించారు. తర్వాత పెందుర్తి గ్రామ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం మొదలైంది. మరి వెనుదిరిగి చూడలేదు. 1967లో ఆనాటి పరవాడ శాసనసభ్యునిగా ఎన్నికై, ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టారు. అది మొదలు ఆజన్మాంతం కాసు బ్రహ్మానందరెడ్డి అంతేవాసిగా, కుటుంబ సభ్యునిగా మమేకమైన విధేయుడు, విశ్వాసపాత్రుడు. మూడేళ్ళు రాష్ట్ర మంత్రిగా, పదమూడేళ్ళు లోక్‌సభ సభ్యునిగా, ఏడాది కాలం పాటు ఆనాటి ‘వుడా’ చైర్మన్‌గా వ్యవహరించారు. ఎన్ని పదవులు చేపట్టినా, అవినీతి మరక అంటని విశుద్ధవర్తనుడు.



రాజకీయంగా ఎంత కార్యశూరుడో.. నాటకం ఆయనకు ఆరోప్రాణం. యవ్వనంలోనే పెందుర్తిలో ‘యువజన కళా సమితి’ పేరుతో, ఒక కళా, నాటక సంస్థను స్థాపించారు. ఆయన మూడోసారి లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైన తర్వాత, 1980 సెప్టెంబరులో, పెందుర్తి టూరింగ్ టాకీస్‌లో ‘యువజన కళా సమితి’ రజతోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ‘యువజన కళా సమితి’ నటులతో కలసి ‘అన్నాచెల్లెలు’, ‘పల్లెపడుచు’, ‘పూలరంగడు’ వంటి సాంఘిక నాటకాల్లో నటించారు. పార్లమెంటు సభ్యునిగా వుంటూ, ఢిల్లీలోను, పెందుర్తిలోను, ‘మహామంత్రి తిమ్మరుసు’, ‘యోగి వేమన’, ‘అల్లూరి సీతారామరాజు’ వంటి చారిత్రక నాటకాలలో నటించారు. 1985లో ఆయన షష్టిపూర్తి ఉత్సవాలు వారం రోజుల పాటు కళా, క్రీడా కార్యక్రమాలతో జరిగాయి. 1993లో పెందుర్తిలో కాంస్య విగ్రహావిష్కరణ జరిగింది. 1996లో ఆయన మరణించిన తర్వాత 2005లో విశాఖ జిల్లా గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలోను, 2015లో పెందుర్తి శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలోనూ 80, 90వ జయంతి ఉత్సవాలు జరిగాయి. నేటి నుంచి మొదలుకొని వచ్చే ఏడాది నవంబరు 6 వరకు శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించటానికి ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులతో శత జయంతి ఉత్సవ నిర్వహణ కమిటి కార్యక్రమాలు రూపొందిస్తోంది.

– బి.వి. అప్పారావు





గవర్నర్ బంగ్లా సమీపంలోని నాగేంద్రస్వామి ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

గవర్నర్ బంగ్లా సమీపంలోని నాగేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలోని ఆలయంలో క్షీరాభిషేకం

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన చేసి పుట్టలో పాలుపోసి మొక్కు తీర్చుకున్నారు. విజయవాడ నగరంలోని గవర్నర్ బంగ్లా సమీపంలోని నాగేంద్రస్వామి పుట్ట, పోలీస్ కంట్రోల్ రూమ్, కృష్ణలంక, కరకట్ట రోడ్డు, యనమలకుదురు లాకులు తదితర ప్రాంతాల్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచివుండి స్వామివారిని దర్శించుకుని తరించారు. 4లో

డ్రోన్ పోలీస్

పోలీస్ స్టేషన్‌కు ఒక డ్రోన్



- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- కమిషనరేట్ పరిధిలో మూడు ఎయిర్ త్రీ వెర్షన్ డ్రోన్లు
- జిల్లాలో మొత్తం 28 పోలీస్‌స్టేషన్లు
- ప్రస్తుతం డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ జామ్‌ల గుర్తింపు
- ఇసుక రీచ్‌ల్లో ఎగురుతున్న డ్రోన్లు

జిల్లాలో కొన్ని పోలీస్‌స్టేషన్ల పరిధి విసిరేసినట్టుగా ఉంటుంది. నగరంలో నివాస సముదాయాలు ఎక్కువగా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలు విస్తారంగా ఉంటాయి. ఆ ప్రాంతాల్లో ఎవరు ఉన్నారో, ఏం చేస్తున్నారో తెలుసుకోవడం కష్టం. ఇలాంటి ప్రదేశాల్లోకి సులువుగా, వేగంగా వెళ్లాలంటే డ్రోన్లే ఉత్తమమని పోలీస్ అధికారులు భావిస్తున్నారు. డ్రోన్లను పైలట్ ప్రాజెక్టుగా ఉపయోగించి ఫలితాలను చూస్తున్న పోలీస్ అధికారులు ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక డ్రోన్‌ను సమకూర్చాలన్న యోచనలో ఉన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 28 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో 13 పోలీస్‌స్టేషన్లు విజయవాడ నగరంలో, మిగిలిన 15 పోలీస్‌స్టేషన్లు రూరల్ పరిధిలో ఉన్నాయి. వాటిలో మైలవరం సర్కిల్‌లో మూడు, తిరువూరు సర్కిల్‌లో నాలుగు, నందిగామ సర్కిల్‌లో నాలుగు ఉండగా, జగ్గయ్యపేట సర్కిల్‌లో నాలుగు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. విజయవాడ నగరంతోపాటు రూరల్‌లో ఉన్న మొత్తం 28 పోలీస్‌స్టేషన్లకు ఒక్కో డ్రోన్‌ను సమకూర్చాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

ఫలితాలు ఇచ్చిన ప్రయోగాలు

విజయవాడకు సెప్టెంబరు నెలలో బుడమేరు వరదలు వచ్చాయి. ఆ సమయంలో ముంపు ప్రాంతాల్లో చిక్కుకుని ఉన్న బాధితులను గుర్తించడానికి పోలీసులు డ్రోన్లను ఉపయోగించారు. తర్వాత నగరానికి వచ్చే ప్రవేశ ద్వారాల్లో నిలిచిపోతున్న ట్రాఫిక్‌కు కారణాలను డ్రోన్ల ద్వారా తెలుసుకుంటున్నారు. ఆయా మార్గాల్లో వాహనాలు ఏ కారణంగా నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయో ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని వీడియోవాల్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై నిఘాకు డ్రోన్లను మిగతా 4లో..

రౌడీ సీఐ!

సివిల్ పంచాయితీలో గుణదల సీఐ అత్యుత్సాహం

- ఇద్దరు రియల్టర్ల నడుమ సరిహద్దు తగాదా
- ఒకరికి కొమ్ము కాస్తూ మరొకరిపై కేసు నమోదు
- రియల్టర్ ఇంటికెళ్లి ఆయనపై భౌతిక దాడి
- రౌడీషీట్ పెడతానంటూ బెదిరింపులు



శ్రీహరితో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



శ్రీహరిపై దాడి చేస్తున్న సీఐ శ్రీనివాస్

విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు సివిల్ పంచాయితీల్లో తలదూరుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా కొద్ది రోజుల కిందట గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ వ్యవహరించిన తీరు వివాదాస్పదమవుతోంది. ఇద్దరు రియల్టర్ల నడుమ సివిల్ వివాదంలో తలదూర్చడమే కాకుండా ఓ రియల్టర్‌పై చేయి చేసుకోవడం పెనుదుమారం రేపుతోంది.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరంలోని గుణదల ప్రాంతంలో ఎస్ఎల్‌వీ రియల్ ఎస్టేట్ యజమానులకు.. దాని పక్కనే ఉన్న కైలాష్ హైట్స్ రియల్ ఎస్టేట్ యజమాని దేవినేని శ్రీహరికి నడుమ కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఎస్ఎల్‌వీ యజమానులు తన స్థలంలోకి వచ్చి గోడ నిర్మాణం చేస్తున్నారని దేవినేని శ్రీహరి ఆరోపిస్తుండగా, తాము తమ స్థలంలోనే గోడ నిర్మాణం చేసుకున్నామని ఎస్ఎల్‌వీ యజమానులు చెబుతున్నారు. ఈ వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో తమ గోడను కూలగొట్టారంటూ ఎస్ఎల్‌వీ యజమానులు ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని గుణదల పోలీసులు అక్టోబరు 23న దేవినేని శ్రీహరిపై కేసు నమోదు చేశారు. ఓ సాధారణ సివిల్ కేసు విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఏకంగా సీఐ శ్రీనివాస్ అక్టోబరు 26న శ్రీహరి ఇంటికి వెళ్లి ఆయనపై దాడికి దిగినట్లు సమాచారం. సివిల్ వివాదంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఐపై అనేక ఆరోపణలు

శ్రీనివాస్ ఈ ఏడాది జనవరి వరకు విజయవాడ కమాండ్ కంట్రోల్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించేవారు. ఆ తర్వాత పదోన్నతి లభించడంతో గుణదల సీఐగా వచ్చారు. సినీ నటి కాదంబరి జత్వాని కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ సీపీ కాంతి రాణాకు నమ్మినబంటుగా శ్రీనివాస్‌కు పేరుంది. సిబ్బందితోనూ శ్రీనివాస్ దురుసుగా ప్రవర్తిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఈ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్ఐ ఈయన తీరు భరించలేక రెండు నెలల్లోనే బదిలీపై వెళ్లిపోయారు. తాను 41ఏ నోటీసు ఇచ్చేందుకు వెళ్లానని, నోటీసు తీసుకోకపోగా దురుసుగా మాట్లాడటంతో ఘర్షణ నెలకొందని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఎల్‌వీ యజమానులతో కుమ్మక్కయ్యి, తనపై వ్యక్తిగత కక్షతోనే సీఐ దాడికి పాల్పడ్డారని, తనపై రౌడీషీట్ తెరుస్తానని బెదిరించారని దేవినేని శ్రీహరి ఆరోపించారు. ఎలాంటి కారణం చెప్పకుండా స్టేషన్‌కు రావాలని కోరడంతో తాను ప్రశ్నించానని.. దీంతో సీఐ దాడికి దిగారని శ్రీహరి తెలిపారు.

డీఎస్సీకి వేళాయె!

కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1,208 టీచర్ పోస్టుల భర్తీ భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇప్పటికే జిల్లాల వారీగా రోస్టర్ పాయింట్ల ఆధారంగా పోస్టులను గుర్తించింది. డీఎస్సీకి సమయం ఆసన్నం కావడంతో ఎట్టిపరిస్థితుల్లో ఈ సారి పోస్టు కొట్టేందుకు అభ్యర్థులు తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు.

ఉమ్మడి కృష్ణాలో 1,208 టీచర్ పోస్టుల భర్తీ

నేడు డీఎస్సీ నోటిఫికేషన్!

- ఇప్పటికే రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఉపాధ్యాయుల పోస్టుల గుర్తింపు
- టీచర్ పోస్టులు కొట్టేందుకు అభ్యర్థుల కసరత్తు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు రంగం సిద్ధమైంది. డీఎస్సీ షెడ్యూలును ప్రభుత్వం బుధవారం విడుదల చేసే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 16,700 టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో టీచర్ పోస్టుల భర్తీ కోసం రోస్టర్ పాయింట్లను విద్యాశాఖ ఉన్నతాధికారులు పదిరోజుల కిందట జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపారు. జనరల్, మహిళల కోటా, ఎస్సీ, ఎస్టీ, బీసీలలో ఏబీసీడీ కేటగిరీలకు ఎన్ని పోస్టులు కేటాయించాలనే అంశంపై ఈ పాయింట్ల ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయా కేటగిరీల వారీగా టీచర్ పోస్టులను గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో 1,208 పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని నివేదికను ప్రభుత్వానికి పంపారు.

ఆయా కేటగిరీల వారీగా జిల్లాలో భర్తీ చేసే టీచర్ పోస్టులు ఇలా..

టీచర్‌ల కేటగిరీ	జడ్పీ/ప్రభుత్వ	మునిసిపల్	మొత్తం
ఎస్ఏ తెలుగు	35	20	55
ఎస్ఏ హిందీ	23	9	32
ఎస్ఏ ఇంగ్లీష్	88	9	97
ఎస్ఏ లెక్కలు	48	7	55
ఎస్ఏ, ఫిజికల్‌సైన్స్	53	6	59
ఎస్ఏబయాలజికల్‌సైన్స్	140	3	143
ఎస్ఏ సోషల్	130	5	135
ఎస్ఏఫిజికల్ఎడ్యుకేషన్	122	4	126
ఎస్‌జీటీ	450	50	506
మొత్తం	1096	113	1208

నాడు 117 జీవో ప్రకారం తక్కువ పోస్టులే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో 117 జీవో ప్రకారం 3,4,5 తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో పాఠశాలల్లో టీచర్లు మిగులుబాటుగా ఉండిపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల ముందు జిల్లాలో 209 పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్‌ను అప్పటి ప్రభుత్వం విడుదల చేసింది. అభ్యర్థులు పరీక్ష రాసేందుకు మిగతా 4లో..

జిల్లాలో లక్ష ఉద్యోగాలు



జిల్లాలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు

ఎన్ఐఆర్‌డీతో యువకులు, రైతులకు శిక్షణ.. తిరువూరులో క్లస్టర్ ఏర్పాటు

- నూరుశాతం జల్ జీవన్ మిషన్ కోసం సరికొత్త డీపీఆర్ రూపకల్పన
- గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి సిద్ధమవుతున్న యాక్షన్ ప్లాన్
- వ్యవసాయ రంగంలో తీసుకురానున్న డ్రోన్ విప్లవం
- జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలు నూరు శాతం అమలుకు కృషి
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

6లో

దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానానికి శ్రీకారం

- మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

6లో

గొల్లపూడిలో ఇక రైట్ రైట్..!

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన పోలీసులు
- వన్ సెంటర్‌లో డివైడర్ ఏర్పాటు.. ట్రాఫిక్ ప్రక్షాళన

6లో

రవాణాశాఖ అధికారిపై విచారణకు ఆదేశం

పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద 2 నెలలుగా అనధికార వసూళ్లు!

- 'దారి దోపిడీ' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతి
- స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అనధికార వసూళ్లకు పాల్పడుతున్న రవాణాశాఖ అధికారిపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. పదహారవ నంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)పై పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రెండు నెలలుగా ఓ అధికారి ప్రైవేటు వ్యక్తులతో అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారు. లారీలపై టార్చిలైట్లు వేయించి సడెన్‌గా నిలుపుదల చేయించటం, వారి దగ్గర నుంచి డబ్బులు గుంజడం వంటి సంఘటనలు ఇక్కడ నిత్యకృత్యం అయ్యాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం పోతున్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి 'దారి దోపిడీ' శీర్షికతో ప్రత్యేక కథనం మంగళవారం ప్రచురించింది. ఈ కథనంపై రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నారు. అయితే ఈ విచారణను నీరుగార్చేందుకు కొంతమంది రవాణా శాఖ అధికారులు తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. పొట్టిపాడు టోల్‌ప్లాజా దగ్గర ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించినా.. వీరి వసూళ్ల బాగోతం బయటపడుతుంది. రవాణా శాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి విచారణ సమగ్రంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైల్వే పనులకు నిధుల విడుదల



- మచిలీపట్నం-రేపల్లె నూతన రైల్వేలైన్ సర్వే పనులకు రూ.1.13 కోట్లు
- బాపట్ల-రేపల్లె నూతన రైల్వేలైన్ సర్వే నిమిత్తం మరో రూ.1.15 కోట్లు
- ఫలించిన మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కృషి



మచిలీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం-రేపల్లె మధ్య నూతన రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే పనుల నిమిత్తం నిధులు విడుదల చేస్తూ రైల్వే బోర్డు డైరెక్టర్ అభిషేక్ జగవర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం-రేపల్లె మధ్య 45.30 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్ నిర్మాణం చేస్తామని ఎంపీ ఇటీవల కాలంలో చెబుతున్నారు. ఈ రైలు మార్గం నిర్మాణం చేసేందుకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను తయారు చేసేందుకు రూ.1.13 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే బాపట్ల-రేపల్లె మధ్య 45.81 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్ నిర్మాణం కోసం డీపీఆర్‌ను తయారు చేసేందుకు రూ.1.15 కోట్లు విడుదల చేశారు.

దశాబ్దాల కల

మచిలీపట్నం-రేపల్లె మధ్య నూతన రైల్వేలైన్‌ను ఏర్పాటు చేయాలని కృష్ణాజిల్లా వాసులు దశాబ్దాలుగా కోరుతూ వస్తున్నారు. ఎంతోకాలంగా ఈ ప్రతిపాదన ఉన్నా కనీసం సర్వేపనులకు కూడా నిధులు విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎంపీ బాలశౌరి మచిలీపట్నం-రేపల్లె, రేపల్లె-బాపట్ల మధ్య నూతన రైల్వేలైన్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత నెల 2వ తేదీన మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు మచిలీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ అంశంపై ఎంపీ బాలశౌరి వివరించారు. ఈ రెండు రైల్వేలైన్లను అనుసంధానం చేస్తే కోల్‌కటా నుంచి చెన్నై వెళ్లే రైళ్లు విజయవాడ జంక్షన్‌కు వెళ్లకుండా, మచిలీపట్నం మీదుగా వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఈమార్గం గుండా రైళ్లు ప్రయాణిస్తే 70 కిలోమీటర్ల దూరం తగ్గడంతోపాటు విజయవాడ జంక్షన్‌పై రైళ్ల ట్రాఫిక్ కూడా కొంతమేర తగ్గుతుందని చెప్పారు. ప్రయాణ సమయం కలసి రావడంతోపాటు సరుకు రవాణా ఖర్చులు తగ్గుతాయని ఎంపీ ముఖ్యమంత్రికి వివరించారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం పూర్తయితే సరుకుల రవాణాను తక్కువ ఖర్చుతో చేయవచ్చని కూడా చెప్పారు.



కుటుంబసభ్యులతో కలిసి పూజలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సుబ్బారాయుడి సేవలో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీలు మోపిదేవి వెంకటరమణారావు, కనకమేడల రవీంద్రకుమార్

నాగుల చవితికి పోటెత్తిన భక్తులు





మోపిదేవిలో బారులు తీరిన భక్తులు

చోడవరంలో లక్ష్మీనారాయణ సహిత నాగేంద్రస్వామి.. పుట్టలో పాలుపోసేందుకు భక్తుల క్యూ

మోపిదేవి/పెనమలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నాగుల చవితి పర్వదినం పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మంగళవారం తెల్లవారు జాము 2.30గంటలకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు విచ్చేయగా, ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు, అర్చక బృందం పూర్ణకుంభంతో వేద మంత్రాలతో స్వాగతం పలికారు. నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలుపోసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేయగా, శేషవస్త్రాలతో అర్చక బృందం ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. ఉదయం 3 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించగా, పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పుట్టలో పాలుపోసేందుకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన జాతీయ రహదారిపై కిలోమీటర్ మేర భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకుని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర, మంచినీరు, పాలు స్వచ్ఛంద సంస్థసేవకులచే ఉచితంగా పంపిణీ చేశారు. అన్నసమారాధనను ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ప్రారంభించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో 130 మంది సిబ్బందిచే ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

సుబ్బారాయుడి సేవలో పలువురు ప్రముఖులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, రాజ్యసభ మాజీ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, కనకమేడల రవీంద్రకుమార్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి స్వాగతం పలికారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు వారికి అందజేశారు.

చోడవరంలో ..

ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన చోడవరం లక్ష్మీనారాయణ సహిత శ్రీనాగేంద్రస్వామి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. చోడవరంలో స్వయంభుగా వెలిసిన స్వామిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు భక్తజనంతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తిరునాళ్లను చూడడానికి వచ్చిన బంధుమిత్రులతో చోడవరం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్వామివారి అన్న ప్రసాదాలను వేలాదిగా భక్తులు స్వీకరించారు. భజన, కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెనమలూరు, ఉయ్యూరు సీఐలు వెంకటరమణ, రామారావు, ఎస్సైలు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

విద్యలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

» కృష్ణా డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో కృష్ణాజిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఎంఈవోలు బాధ్యత వహించాలని డీఈవో పీవీజే రామారావు అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఎంఈవోలతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రతి విద్యార్థి పేరు యుడైస్‌తో పాటు అపార్‌తో అనుసంధానం చేయాలన్నారు. పుట్టిన తేదీ, పేరు, ఆధార్ కార్డును అపార్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని 25 మండలాల్లో ఇంకా పెనమలూరు, కృత్తివెన్ను, మోపిదేవి, ఉయ్యూరు, కంకిపాడు మండలాలు అపార్‌లో వెనుకంజలో ఉన్నాయన్నారు. దీనిపై ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రతినిధులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఏడీ మనోహర నాయక్, బందరు డీవైఈవో శేఖర్‌సింగ్, గుడివాడ డీవైఈవో పద్మారాణి, సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పోలీస్

(3వ పేజీ తరువాయి)

ఉపయోగించారు. రీచ్‌లకు చుట్టుపక్కల అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను వాటి ద్వారా గుర్తించి సీజ్ చేశారు. వరుసగా ఈ ఫలితాలను చూసిన పోలీస్ కమిషనరేట్ అధికారులు ప్రతి స్టేషన్‌కు ఒక్కో డ్రోన్‌ను సమకూర్చితే మరిన్ని మంచి ఫలితాలను చూడవచ్చన్న ఆలోచనలో ఉన్నారు.

కీలకమైన కేసుల్లోనూ.

కీలకమైన కేసుల్లో ఈ డ్రోన్లు చాలా ఉపయోగకరంగా ఉంటాయని భావిస్తున్నారు. పోలీస్ కమిషనరేట్‌కు ప్రభుత్వం 2018లో పెంటాన్ 4 ప్రో మోడల్‌కు చెందిన తొమ్మిది డ్రోన్లను ఇచ్చింది. ఈ డ్రోన్ల కాలపరిమితి ముగిసింది. డ్రోన్ల కాలపరిమితి రెండేళ్లు. 2018లో ఇచ్చిన డ్రోన్లను ఈ ఏడాది ఆరంభం వరకు ఉపయోగించారు. గాల్లోకి లేచిన డ్రోన్ ఎక్కువ ఎత్తుకు ఎగరడంతోపాటు ఎక్కువ దూరం ప్రయాణించాలి. దాని నుంచి సిగ్నల్ ఆపరేటర్ చేతిలో ఉండే రిమోట్‌కు స్పష్టంగా అందాలి. ఈ రెండింటిలో ఏది సరిగా లేకపోయినా ఆ డ్రోన్‌కు కాలం చెల్లినట్టుగా నిర్ధారిస్తారు. ఈ తొమ్మిది డ్రోన్లు మూలనపడడంతో కొత్తగా మూడు డ్రోన్లను కొనుగోలు చేశారు.

ఇసుక రీచ్‌లు, ట్రాఫిక్‌కు వినియోగం

అప్‌డేట్ వెర్షన్ గల ఎయిర్ 3 డ్రోన్లు కమిషనరేట్‌లో ఉన్నాయి. నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేటలో ఉన్న ఇసుక రీచ్‌ల్లో ఈ డ్రోన్లే ఎగురుతున్నాయి. వాటిని జీపీఎస్ ద్వారా ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. అధికారులు ఇక్కడి నుంచి వీడియోవాల్‌పై ప్రత్యక్షంగా అక్కడున్న పరిస్థితిని వీక్షిస్తున్నారు. ట్రాఫిక్‌కు సంబంధించి పోలీసులు అస్త్రం యాప్‌ను రూపొందించారు. దీనికి డ్రోన్లను అనుసంధానం చేశారు. నగరంలోని వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే పది ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పరిస్థితిని తెలుసుకుంటున్నారు. అస్త్రం యాప్ డాష్ బోర్డుపై ఆయా కూడళ్లలో వాహనాలు ఏ సమయానికి, ఎంత దూరం నిలిచిపోయాయో చూపిస్తోంది. దీన్ని బట్టి ఇక్కడి సిబ్బంది ఆయా కూడళ్లలో ఉన్న ట్రాఫిక్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మొత్తం ఐదుగురు డ్రోన్ ఆపరేటర్లు ఉన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి సాంకేతిక నైపుణ్యం పూర్తిగా ఉండాలన్న ఉద్దేశంతో దానికి సంబంధించిన అన్ని అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. బడ్జెట్‌ను బేరీజు వేసుకుని అన్ని పోలీస్ స్టేషన్లకు ఒకేసారి కాకపోయిన కీలకమైన స్టేషన్లకు మొదటి దఫాలో డ్రోన్లను సమకూర్చాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఖాళీ ప్రదేశాలు, తోటలు, చెట్లచాటున గంజాయి తాగే వారిని డ్రోన్ల ద్వారా సులువుగా గుర్తించే అవకాశం ఉంటుందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

డీఎస్సీకి వేళాయె!

(3వ పేజీ తరువాయి)

సమాయత్తమయ్యేందుకు సమయం చాలదని, వివిధ కారణాలతో ఈ డీఎస్సీ నోటిఫికేషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు పచ్చజెండా ఊపింది. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచరు ఉండేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. ఇందుకు అనుగుణంగా టీచర్ పోస్టులను భర్తీ చేయనుంది. 2025 ఏప్రిల్ 30వ తేదీ నాటికి ఏర్పడే ఖాళీలను బట్టి జిల్లాలో టీచర్ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు టీచర్ పోస్టులు కొట్టేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు.

మున్సిపల్ పాఠశాలల్లో టీచర్ పదోన్నతులు ఇచ్చేనా!

ఇటీవల ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే టీచర్‌లకు పదోన్నతులు ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చింది. నూతనంగా టీచర్ పోస్టుల భర్తీ జరగనున్న నేపథ్యంలో మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు పదోన్నతులు నిలిచిపోతాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూచనప్రాయంగా చెబుతున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులకు మాత్రం పదోన్నతులు ఇచ్చే అంశంలో ఎలాంటి అభ్యంతరాలు ఉండవని పేర్కొంటున్నారు.

వైద్యాధికారి వేధింపులకు గురిచేస్తున్నారు!

» డీఎం అండ్ హెచ్‌వోకు ఏఎన్‌ఎంలు, ఆశాల ఫిర్యాదు

కూచిపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమను ఉద్యోగులుగా గుర్తించటం లేదని, రోగుల ఎదుట అవమానిస్తున్నారని, అత్యవసర సమయాల్లోనూ సెలవులు మంజూరు చేయటం లేదని మొవ్వ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేదరాజు ప్రవర్తనను నిరసిస్తూ ఏఎన్‌ఎంలు, ఆశాలు, సిబ్బంది మంగళవారం మూకుమ్మడిగా పీహెచ్‌సీ ప్రాంగ



మొవ్వ పీహెచ్‌సీ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు, సిబ్బంది, ఆశాలు

ణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఎం అండ్ హెచ్‌ఎం గీతాభాయికి 53 మంది సంతకాలతో కూడిన ఫిర్యాదును అందజేశారు. అనారోగ్య సమస్యలు, ఇతర ముఖ్యమైన పనులు ఉన్నప్పుడు సెలవులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. స్టాఫ్ అటెండెన్స్ వేసినా కావాలని రిజెక్ట్ చేసి గైర్హాజరు వేస్తున్నారని, దీనివల్ల నెలలుగా జీతంలో కోత విధించబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులకు, స్టాఫ్‌కు అందుబాటులో ఉండటం లేదని, సూపర్‌వైజర్లను స్టాఫ్‌ని రూమ్‌కి పిలిపించి గంటల తరబడి మాట్లాడుతున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. సీహెచ్‌వో శంకరరావు, సూపర్‌వైజర్ విజయకుమార్, ఆయుష్ వైద్యులు డాక్టర్ భగవాన్, విజయకుమారి, శ్రీ లక్ష్మి, సమిత, పలువురు ఏఎన్ఎంలు, ఆశాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎం అండ్ హెచ్‌వో విచారణ..

సెలవుపై వెళ్లాలని డాక్టర్ వేదరాజ్‌కు సూచన



మొవ్వ పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు డాక్టర్ వేదరాజ్‌పై ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా వైద్యాదాకారిణి డాక్టర్ గీతాబాయి మంగళవారం సాయంత్రం విచారణ చేపట్టారు. వేదరాజ్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మొదటి తప్పుగా మన్నించి ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని ఉద్యోగులకు ఆమె సూచించారు. అవమానాలు ఎదుర్కొంటూ ఉద్యోగాలు చేయటం తమవల్ల కాదని వారు తేగేసి చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సెలవులోకి వెళ్లాలని డాక్టర్ వేదరాజ్‌కు సూచించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడిపై వేటు

» కేసు నమోదు.. అరెస్టు, రిమాండ్

కోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోడూరు శివారు నరసింహాపురం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు కటికల వేణుగోపాలరావును విధుల నుంచి తొలగిస్తు డీఈవో పీవీజే రామారావు ఉత్తర్వులు జారీ చేసినట్టు కోడూరు ఎంఈవో టి.వి.ఎం.రామదాసు తెలిపారు. కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తించి తొడపై కొరికాడని బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం మంగళవారం మొవ్వ కోర్టుకు పరచగా, జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కె.చాణిక్య తెలిపారు.

టచ్‌లో తేడా వస్తే తాట తీయండి : ఎస్ఐ జాస్మిన్

గుడివాడ : సురక్షితమైన స్పర్శలు ఆరోగ్యంగా ఉంచుతాయి.. టచ్లో తేడా వస్తే తాట తీయాలని టూటౌన్ ఎస్ఐ జాస్మిన్ విద్యార్థినులకు హితబోధ చేశారు. మంగళవారం స్థానిక స్కూల్‌లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పలు విషయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలను తీసుకోవద్దని, ఎక్కడ పట్టుకోవాలి, ఎక్కడ ముట్టుకోవాలనే అంశంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఈవ్‌టీజింగ్‌కు వ్యతిరేకంగా ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశామని జాస్మిన్ తెలిపారు. పాఠశాల డైరెక్టర్ కాళ్లకూరి హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడే పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఆఖరు

» శిబిరాలు ఏర్పాటు చేసి దగ్గరుండి నమోదు చేయిస్తున్న పార్టీల నేతలు



కంప్యూటర్ల వద్ద పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు బుధవారం ఆఖరి రోజు కావడంతో టీడీపీ నాయకులు శిబిరాలు నిర్వహించి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. నగరంలోని వివిధ డివిజన్లలో టీడీపీ, జనసేన నాయకులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం చంద్రబాబు ఓటర్ల నమోదుపై సీరియస్‌గా తెలుగుదేశం నాయకులకు ఆదేశాలు జారీ చేయడంతో టీడీపీ నాయకులు అలర్ట్ అయ్యారు. డివిజన్లలో ఫారాలు పట్టుకుని ఏ ఇంట్లో గ్రాడ్యుయేట్లు ఉన్నారో వెతుకులాట ప్రారంభించారు. కార్యాలయాలు, పాఠశాలల వద్దకు వెళ్లి గ్రాడ్యుయేట్ల ఫారాలు నింపే కార్యక్రమం జరిపారు. నిరుద్యోగులైన గ్రాడ్యుయేట్లు సైతం కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో పాటు వాడవాడలా పర్యటిస్తూ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ శిడింటి అగ్రహారంలో ఆరు కంప్యూటర్లను ఉంచి ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేస్తున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్‌ల వద్దకు వెళ్లి గెజిటెడ్ సంతకం కోసం గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో మంగళవారం తరలివెళ్లారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తన కార్యాలయం వద్ద ఓటర్ల నమోదుకు ఫారాలు పూర్తి చేయించారు.

సెస్ తగ్గింపు.. ధాన్యం రైతుకు ఊరట

ధాన్యం కొనుగోళ్లపై మార్కెట్ రుసుం తగ్గించేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యంపై గతంలో ఉన్న ఒకశాతం మార్కెట్ రుసుంను వైసీపీ ప్రభుత్వం రెండు శాతానికి పెంచింది. దీనివల్ల రైతులు నష్టపోయారు. రెండేళ్లుగా సరిహద్దుల్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల రాబడికి గండిపడింది. కూటమి ప్రభుత్వ నిర్ణయంవల్ల ధాన్యం రైతులకు ఊరట కలగనున్నది.



(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

రెండేళ్లకు ముందు ధాన్యంతో పాటుగా ఇతర వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి విలువలో ఒక శాతం వంతున మార్కెట్ రుసుం (సెస్) ఉండేది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానమైన రాబడి సెస్ ద్వారా వస్తుంది. వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసమని మౌలిక వసతుల కల్పన పేరుతో 2022 ఏప్రిల్ నెల చివరి వారంలో ధాన్యం కొనుగోళ్లపై ఒక శాతం సెస్సును రెండు శాతానికి పెంచింది. వాస్తవంగా సెస్సును, వ్యాపారులు మార్కెట్ కమిటీలకు చెల్లిస్తుంటారు. అయితే ఈ మేరకు వ్యాపారులు, ధరలో కోత విధిస్తుండటంతో రైతులకు నష్టం కలుగుతున్నది. దీనికితోడు తెలంగాణా రాష్ట్రం సరిహద్దుల్లో ఉన్న జగ్గయ్యపేట, నందిగామ, కంచికచర్ల, తిరువూరు, మైలవరం ఏఎంసీల ఆదాయానికి గండి పడింది. ఆయా కమిటీలకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రావల్సినంత రాబడి రెండేళ్ల నుంచి రావటం లేదు. తెలంగాణాలో ధాన్యంపై కొనుగోళ్లపై మార్కెట్ సెస్సు పెరగలేదు. అక్కడ ఒక శాతం మాత్రమే వసూలు చేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న పలు గ్రామాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి వ్యాపారులు, తెలంగాణాలో ఒక శాతం సెస్సు చెల్లించి మిల్లులకు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దేశంలో ఎక్కడైన ఒక ప్రాంతంలో సెస్సు చెల్లిస్తే మిగతా ప్రాంతాల్లో వసూలు చేయకూడదు. ఇక్కడ రెండు శాతం ఉండటం వల్ల అసలుకే మోసం వచ్చింది. తెలంగాణాలో ఒక శాతం చెల్లించి, దర్జాగా ధాన్యం తీసుకువెళుతుండటంతో ఏఎంసీల రాబడి బాగా తగ్గిపోయింది. జరుగుతున్న మోసాన్ని అరికట్టేందుకు ఏఎంసీల ఆధ్వర్యంలో దాడులు చేస్తున్నప్పటికీ ఆశించిన ప్రయోజనం దక్కటం లేదు. రెండు శాతం సెస్సు వల్ల జరుగుతున్న నష్టం గురించి ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం అమలు చేస్తున్న రెండు శాతం సెస్సును గతంలో వసూలు చేసినట్టుగా ఒక శాతానికి తగ్గించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రెండుశాతం సెస్సును తగ్గించి, మరల ఒక శాతం వంతునే వసూలు చేయాలని ధరల పర్యవేక్షణ కమిటీ సూచించింది. ఈ మేరకు సోమవారం జరిగిన కమిటీ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, కె. అచ్చెన్నాయుడు నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వ బాదుడు నుంచి ఉపశమనం కలగనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ ప్రయోజనం

- కోట వీరబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్



వైసీపీ పాలనలో ఏకపక్షంగా ధాన్యంపై మార్కెట్ సెస్సును రెండు శాతానికి పెంచారు. తెలంగాణాలో ఒక శాతమే ఉండటంతో ఇక్కడ అన్ని విధాలుగా నష్టం జరుగుతున్నది. రెండుశాతం సెస్సును ఒకశాతానికి తగ్గించాలని మంత్రుల కమిటీ నిర్ణయించటం వల్ల రైతులతో పాటుగా అందరికీ ఎంతో ప్రయోజనం కలుగుతుంది. బియ్యం ధర కూడా తగ్గనున్నది. మార్కెట్ కమిటీల రాబడి పెరుగుతుంది.



భవదీప్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

బాలుడి వైద్యానికి మరో రూ.5లక్షలు

» ఎల్వోసీ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరదనీటి వల్ల బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌తో కాలు కోల్పోయి రెండో కాలుకు చికిత్స పొందుతున్న జగ్గయ్యపేటకు చెందిన కొత్తా భవదీప్‌కు మరో రూ.5లక్షలు ఎల్వోసీని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య మంజూరు చేయించారు. గత సెప్టెంబరులో వరదలకు ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న కొత్తా నాగార్జున కుమారుడు భవదీప్ (12)కు ఇన్‌ఫెక్షన్ సోకి ఒకకాలు పూర్తిగా తొలగించారు. బాలుడు ప్రస్తుతం విజయవాడలోని అంకుర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. తొలుత రూ.10లక్షలు ఎల్వోసీ ఇప్పించిన తాతయ్య, ఆ సమయంలో బాలుడు పూర్తిగా కోలుకునే వరకు ఖర్చును ప్రభుత్వం నుంచి ఇప్పిస్తానని ఇచ్చిన హామీమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మరల రూ.5లక్షలు మంజూరు చేయించారు. ఎల్వోసీ పత్రాలను మంగళవారం తాతయ్య బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. తాతయ్య ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



క్వారీలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా పెట్టిన బోర్డు

కళ్లంవారిపాలెం క్వారీ నిలిపివేత

తోట్లవల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కళ్లంవారిపాలెం ఇసుక క్వారీని మంగళవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. క్వారీలో ట్రాక్టర్ల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేయటం, లారీల్లోకి ఇసుకను నింపటం తదితర ఆరోపణలతో తవ్వకాలను నిలిపివేశారు. ఇటీవల 'వైసీపీ దోపిడీ పర్వం' శీర్షికన కళ్లంవారిపాలెం క్వారీపై 'ఆంధ్రజ్యోతి'లో వార్తా కథనం రావడంతో ఒకరోజు తాత్కాలికంగా క్వారీని నిలిపివేసిన అధికారులు మళ్లీ తెరిచారు. అయితే దోపిడీ మాత్రం ఆగటం లేదు. వైసీపీ నేత క్వారీలో తెరవెనుక లోకల్ కార్మికులతో దందా నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోకపోవటం వల్లే ట్రాక్టర్ల నుంచి రూ 1,200 వసూలు చేస్తున్నారని విమర్శలున్నాయి. ప్రభుత్వ లక్ష్యం నీరుగారకుండా క్వారీలో అక్రమ వసూళ్ల కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

రెండువేల వ్యాసాల క్లబ్‌లో ఉపాధ్యాయుడు రాంప్రదీప్



తిరువూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి ఎం.రాంప్రదీప్ రెండువేల వ్యాసాలు రచించి క్లబ్‌లో స్థానం సాధించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో సమరయోధుడు, చిత్తరంజన్‌దాస్‌పై రాసిన వ్యాసంతో ఆయన రెండువేల వ్యాసాల జాబితాలో చేరారు. ఇప్పటి వరకు రాంప్రదీప్ 6 పుస్తకాలు, వందకుపైగా పుస్తక సమీక్షలు, మరికొన్ని కథలు రచించారు. ఆయన రచించిన వ్యాసాల్లో ప్రతిజ్ఞా చేద్దాం, మతం మతానికి ప్రత్యామ్నాయం కాదు, అంబేద్కరిజం, నాస్తికత్వం, మత స్వేచ్ఛ వంటి వ్యాసాలు ప్రజాదరణ పొందాయి.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

నూతన క్రీడాపాలసీతో పేద క్రీడాకారులకు మేలు : శాప్ చైర్మన్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, రమణరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ నూతన క్రీడాపాలసీతో పేదింటి క్రీడాకారులకు నైపుణ్యాలను మెరుగుపర్చి, వారు ఉన్నతంగా ఎదగడానికి ఉపకరిస్తుందన్నారు, సీఎం చంద్రబాబు, మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి వలన నూతన పాలసీ వేగంగా తీసుకువచ్చామన్నారు.



శాప్ చైర్మన్ రవినాయుడుతో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, రమణరావు

అదుపు తప్పితే అంతే సంగతులు

● కృష్ణలంక సర్వీసు రోడ్డులో యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు
● ఎం హోటల్ సెంటర్‌లో భారీ లోడుతో ఆగిపోయిన లారీతో స్థానికుల బెంబేలు

కృష్ణలంక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక సర్వీసు రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటి రాకపోకలు నియంత్రించేందుకు అటు ట్రాఫిక్, ఇటు సివిల్ పోలీసులు కూడా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, సిబ్బంది వచ్చినా వారు మామూళ్లు దండుకొని వెళ్లిపోతుండటంతో భారీ లోడుతో వచ్చే 10 టైర్ల లారీలు రాకపోకలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రమాద వశాత్తు అవి అదుపుతప్పి ఎవరి ఇళ్లు, షాపుల వైపు దూసుకొస్తాయో అని భీతిల్లిపోతున్నారు. సరిగ్గా ఇలాంటి సంఘటనే ఎం హోటల్ సెంటర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఇదే ప్రాంతంలో కొద్ది నెలల క్రితం ఫ్లైయిడ్ లోడుతో వున్న భారీ వాహనం సర్వీసురోడ్డు నుంచి జాతీయ రహదారి ఎక్కలేక బోల్తా పడింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సర్వీసురోడ్డు నుంచి జాతీయ రహదారి పైకి వెళ్లే సమయంలో భారీ వాహనాలు ఎత్తు ఎక్కలేక వెనక్కి వచ్చి ఎక్కడ తమ షాపులు, ఇళ్లల్లోకి వస్తాయో అని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని ఉంటున్నారు. మంగళవారం రాత్రి మొక్కజొన్న విత్తనాల భారీ లోడుతో వున్న 10 టైర్ల లారీ సర్వీసురోడ్డు నుంచి జాతీయ రహదారి ఎక్కలేక యాక్సిల్ విరిగిపోయి లారీ చక్రం ఊడిపడిపోయింది.

అక్కడే వున్న కొంతమంది స్థానిక యువకులు లారీ వెనక్కి రాకుండా టైర్ల కింద రాళ్లు పెట్టి ప్రమాదాన్ని నివారించగలిగారు. అదే సమయంలో వారు లేకపోతే లారీ వెనక్కి వచ్చి పల్లంగా వున్న షాపులు, ఇళ్లల్లోకి దూసుకు పోయేది. ఇప్పటికైనా ట్రాఫిక్, సివిల్ పోలీసులు భారీ లోడుతో వున్న పెద్ద పెద్ద వాహనాలను సర్వీసు రోడ్డులోకి, కృష్ణలంక అంతర్గత రోడ్లలోకి రాకుండా నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



కృష్ణలంక ఎం హోటల్ సెంటర్‌లో ఆగిపోయిన లోడు లారీ



యూజీడీ పైపు లైన్లను పరిశీలిస్తున్న ఏఈ జస్వంత్, సచివాలయ అధికారులు



కాల్వలో ఉన్న యూజీడీ పైపు మార్చడం కోసం పగులగొట్టిన మెట్లు



యూజీడీలో పారుదల కోసం జెట్‌తో క్లీనింగ్ చేస్తున్న సిబ్బంది

మెట్లు పగులగొట్టారు...పూడిక తీయించారు

పొంచి ఉన్న ప్రమాదం... స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొగల్రాజపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పటమట దానయ్య వీధిలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనంతో వీఎంసీ అధికారులు కదిలారు. ఏఈ జస్వంత్, సచివాలయం ఎవి ఎనిటీస్ సెక్రటరీ శేఖర్, శానిటరీ సెక్రటరీ ఉమ తదితరులు దానయ్య వీధిలో సమస్య ఉన్న చోటకు వచ్చి పరిశీలించారు. ప్రైవేటు ఉమెన్స్ హాస్టల్ ముందు డ్రెయిన్‌లో అడ్డుగా ఉన్న యూజీడీ కనెక్షన్ పైపు పైన ఉన్న మెట్లను ఇంజనీరింగ్ సిబ్బందిని పిలిపించి పగులగొట్టించారు. డ్రెయిన్‌లో నీరు పారుదలకు అడ్డు లేకుండా పైపులైను సరి చేయించమని చెప్పారు. ఆ పక్కనే రోడ్డు మధ్యలో యూజీడీ పైపులైనులో పూడిక చేరి నీరు రోడ్డు పక్కనే ఉన్న సైడు కాల్వలోకి రావడం చూశారు. జెట్ మెషిన్ తెప్పించి మూతలు తెరిచి పూడిక తీయించారు. ఆ పక్కనే మంచినీటి నీటి పైపు తుప్పు పట్టి లీకవుతున్న విషయం గుర్తించారు. ఒక్కో ఇంటికి రెండు కనెక్షన్‌లు ఉన్నట్లు గుర్తించి పాత కనెక్షన్‌ను తొలగించి డమ్మీ చేశారు. కొంతమంది కొత్త కనెక్షన్‌తో పాటు పాత కనెక్షన్ కూడా వాడుతుండటం గుర్తించి వాటిని కూడ డమ్మీ చేస్తామన్నారు.





రాణిగారితోటలోని నాగేంద్ర స్వామి వద్ద, నిమ్మతోట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

రాణిగారితోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పండుగ సందర్భంగా రాణిగారితోట ప్రాంతంలోని నాగేంద్రస్వామి పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. రాణిగారితోటలో నాగేంద్ర స్వామి ఆలయం వద్ద, కృష్ణలంకలోని నిమ్మతోటలో ఉన్న పుట్టలలో భక్తులు పాలు, నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు.

భారతీనగర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, గురునానక్ కాలనీలోని రామమందిరం సమీపంలో ఉన్న నాగేంద్రస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులచవితి సందర్భంగా మహిళలు తెల్లవారు జాము నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి నాగేంద్రుని పుట్టలలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

కృష్ణలంక : నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని తాడేపల్లి, విజయవాడ క్లబ్ సమీపంలోని కొండపావులూరు గార్డెన్స్‌లో సహజంగా ఏర్పడిన నాగేంద్రుని పుట్టలో పాలు పోసి నాగేంద్ర స్వామి అనుగ్రహం పొందేందుకు భక్తులు తరలి వచ్చారు. పెద్దసంఖ్యలో వస్తున్న భక్తుల కోసం గార్డెన్ నిర్వాహకులు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడం విశేషం. ఏటా భక్తులు నాగేంద్ర స్వామి అనుగ్రహం పొందేందుకు వస్తుంటారని గార్డెన్ నిర్వాహకులు వెంకటేశ్వరరావు చెప్పారు. సమీప ప్రాంతాల్లో భక్తుల రాకతో పుట్ట చుట్టుపక్కల ప్రాంతంలో సందడి వాతావరణం కనిపించింది.



కొండపావులూరు గార్డెన్స్‌లో పూజలు చేస్తున్న భక్తులు



పలు వేషధారణలతో ఉన్న పిల్లలతో పాఠశాల ప్రిన్సిపాల్ సుధ

సంప్రదాయాలపై ఆసక్తి పెంచడమే లక్ష్యం

● నెక్ట్స్‌జెన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధ

ఆటోనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేటి తరం పిల్లలకు విద్యతోపాటు సాంస్కృతిక సంప్రదాయలపై ఆసక్తి పెంచేలా విద్యనందించాలనేదే తమ పాఠశాల లక్ష్యమని నెక్ట్స్‌జెన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధ తెలిపారు. గురునానక్ కాలనీలోని నెక్ట్స్‌జెన్ స్కూల్ లో యూకేజీ పిల్లలకు పలు సంప్రదాయ వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలకు చదువులోనే కాకుండా వివిధ రకాల ఆటల్లోనూ, మన సంప్రదాయ స్థితిగతులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జడ్జిగా కె.రాణి వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ కీర్తి, యూకేజీ క్లాస్ టీచర్ గీత పాల్గొన్నారు.

అవగాహన, అప్రమత్తతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

క్రైం ఏడీసీపీ రాజారావు



మాట్లాడుతున్న సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ, చిత్రంలో ఏడీసీపీ రాజారావు, ఏసీపీ దామోదర్, సీఐలు

ఆటోనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, దొంగతనాలు, ఇతర నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే అవగాహన, అప్రమత్తతతో వ్యవహరించాలని క్రైం ఏడీసీపీ రాజారావు అన్నారు. మంగళవారం పటమటలోని ఫన్ టైమ్స్ క్లబ్‌లో లా అండ్ ఆర్డర్ ట్రాఫిక్ , సైబర్ పోలీసు అధికారులు కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కాలనీ వాసులకు, ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉపయోగాలు, నేరాలు నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీసీపీ రాజారావు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సైబర్ నేరాల నియంత్రణ, సోషల్ మీడియాపై సైబర్ క్రైమ్ సీఐ జానకీ రామయ్యలు అవగాహన కల్పించారు. సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ వి.పవన్ కిషోర్, సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, వాకర్స్ పాల్గొన్నారు.



వివేకానంద కాలనీలో స్పెషల్ డ్రైవ్

పటమట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పటమట 4వ డివిజన్‌లోని వివేకానంద కాలనీలో టీడీపీ నాయకులు, యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ సమక్షంలో మంగళవారం అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫాగింగ్ చేసి, సైడ్ కాల్వల్లో ఆయిల్‌బాల్స్ వదిలారు. ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే గద్దెకు ఎవరూ సాటిరారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మలేరియా-4,5 శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హెచ్ శ్రీనివాసరావు, కె. కోటేశ్వరరావు, సూపర్‌వైజర్లు వీ భీమయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో విద్యుత్‌లైన్లు మరమ్మతుల వల్ల బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామచంద్రనగర్ కాలనీ, గణేష్‌నగర్, కనకదుర్గా నగర్, కరెన్సీనగర్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

భారతీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఉపాధి కల్పన శాఖ అధికారి డి.విక్టర్ బాబు తెలిపారు.

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో ముత్తూట్ ఫిన్‌కార్ప్, ఎస్‌బీఐ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తు ఫైనాన్షియల్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కల్పన శాఖ అధికారి డి.విక్టర్ బాబు మాట్లాడుతూ ఈ మేళాకు జిల్లా నుంచి 127 మంది అభ్యర్థులు హాజరు కాగా 46 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు.

రాళ్లు లేచి రోడ్డు అధ్వానం

● డ్రెయినేజీ కోసం తవ్వి..గ్రావెల్ పోసి వదిలేశారు
● రాకపోకలకు తీవ్ర అంతరాయం

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)

యూజీడీ కోసం తవ్విన రోడ్డుని నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయకపోవటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 16వ డివిజన్ బాలాజీనగర్‌లోని తోటా జానకిరామయ్య వీధి అడ్డ రోడ్డును రెండు నెలల క్రితం డ్రెయినేజీ కోసం తవ్వారు. యూజీడీ పనుల అనంతరం గ్రావెల్ పోసి వదిలివేయటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోంది. పోసిన గ్రావెల్‌లోని రాళ్లు రోడ్డుపై విస్తరించి వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్నాయి. ఈ రాళ్ల కారణంగా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయపడుతున్నారని స్థానికులు తెలిపారు. నెలలు గడుస్తున్నా రోడ్డు మరమ్మతులు చేయటం లేదని దీని గురించి అడుగుతుంటే తవ్విన చోట వేసిన గ్రావెల్ అణగాలని చెబుతున్నారని, వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఆవులతో భిక్షాటన చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

సామాజిక కార్యకర్త అరుణ్‌కుమార్

పటమట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల ముందు, బహిరంగ ప్రదేశాల్లో ఆవులను ఉంచి భిక్షాటన చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయ కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణ్‌కుమార్ తెలిపారు. కార్తీకమాసంలో నగరంలోని ప్రముఖ ఆలయాలకు భక్తులు, అయ్యప్పలు వెళుతుంటారని, వారి భక్తి, విశ్వాసాలను ఆసరాగా చేసుకుని ఆవులను తీసుకువచ్చి భిక్షాటన చేస్తారని చెప్పారు. ఈ క్రమంలో పటమట సర్కిల్-3 పరిధిలోని ఎస్ఎస్ఎం స్కూల్ వద్ద రోడ్డు మలుపులో చిన్నగుడి వద్ద ఇలాంటి సమస్యలు తరచూ తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యలపై శాఖాపరమైన పరిష్కారం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు, వెటర్నరీ విభాగం అధికారులకు, సీపీకి ఫిర్యాదు చేసినట్లు అరుణ్‌కుమార్ తెలిపారు.



గొల్లపూడిలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గొల్లపూడిలో ఇక రైట్ రైట్..!

● వన్ సెంటర్‌లో డివైడర్ ఏర్పాటు.. ట్రాఫిక్ ప్రక్షాళన

గొల్లపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడిలో నెలకొంటున్న ట్రాఫిక్‌ను సరి చేసేందుకు పోలీస్ వ్యవస్థ ఎట్టకేలకు కళ్లు తెరిసింది. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన చక్రవ్యూహం కథనానికి పోలీసులు స్పందించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గొల్లపూడి మైలురాయి సెంటర్ నుంచి వన్ సెంటర్ వరకు ఏర్పడుతున్న ట్రాఫిక్‌ను కళ్లకు కట్టినట్టు ఆ కథనంలో ఫొటోలతో సహా ప్రచురించడంతో పోలీసులు ట్రాఫిక్‌ను చక్కదిద్దే పనిలో పడ్డారు. సాయిపురం కాలనీ నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలు అటు ఇటు వెళ్లకుండా రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం వైపు వెళ్లే వాహనాలు వన్ సెంటర్ క్రాస్‌రోడ్స్ హోటల్ వద్ద ఆగడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతుండటంతో వన్ సెంటర్ వద్ద ఆగేలా చర్యలు చేపట్టారు.

మరో జత్వానీ ఉదాంతానికి తెరలేపిన

వైసీపీ నేతను శిక్షించాలి: జైరాజ్

ధర్నాచౌక్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన మరో జత్వానీ ఉదాంతానికి తెరలేపిన వైసీపీ నేతనుర కఠినంగా శిక్షించాలని జై ఆంధ్ర ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు జైరాజ్ సంగెపు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. బాపులపాడు మండలం మర్రిభద్రంకు చెందిన దావులూరి ప్రభావతి బ్యాంకు మేనేజర్‌గా ఉన్న మహిళపై స్థానిక మండల వైసీపీ నేత, సర్పంచ్ యోగీశ్వర్‌రావు లైంగిక వేధింపులకు పాల్పడటం, పైగా బాధితురాలిపైనే తప్పుడు కేసులు బనాయించి రౌడీషీట్ ఓపెన్ చేయించడంతో పాటు అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో విచారించి బాధిత మహిళకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీ సాధికార సమాఖ్య అధ్యక్షుడు పామర్తి జయప్రకాష్ నారాయణ, బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పయార్ధ చర్చిల్ పాల్గొన్నారు.



మాకు ఉద్యోగ భద్రత కల్పించండి

● గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్లు

ధర్నాచౌక్, నవంబర్ 5:(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా చేపట్టారు. ఇతర గురుకులాల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ టీచర్లకు చెల్లించేలా అదే పీఆర్సీ ప్రకారం తమకు .జీతాలు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్ట్ విధానానికి మార్చాలన్నారు. 2024 మెగా డీఎస్సీలో గిరిజన గురుకుల ఉపాధ్యాయుల పోస్టులు చూపకుండా గిరిజన గురుకులాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనేక ఏళ్లుగా కేవలం రూ.9వేలకే ఎటువంటి సెలవులు లేకుండా ఉద్యోగాలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ ప్రభుత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. మల్లిర్జున్ నాయక్, పరమేష్, విజయ్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

అమ్మా.. నాగమ్మ!



పోలీస్ కంట్రోల్ రూం వద్ద..



యనమలకుదురు లాకుల వద్ద,..

దుర్గగుడిలో ఘనంగా నాగుల చవిటి పూజలు

వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ చవితి తిథిని పురస్కరించుకుని మంగళవారం నాగుల చవితి పూజలు ఘనంగా సాగాయి. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఉపాలయం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడిలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అర్చకులు శాస్త్రోక్త అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో కొలువైన నాగదేవత విగ్రహాలకు భక్తులు పాలు సమర్పించి పూజలు చేశారు. నువ్వుల పిండితో చేసిన పదార్థాలు, చలిమిడి నాగదేవతకు నైవేద్యంగా సమర్పించారు. నాగదేవతలకు సంబంధించిన స్తోత్రాలను, నామాలను చదివారు. మంగళవారం కావటంతో వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అర్చనకు ప్రత్యేకత ఏర్పడింది. చవితి మంగళవారం కలిసి రావటంతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అర్చనలు చేసేందుకు భక్తులు భారీగా వచ్చారు.

అన్న వితరణకు విరాళం

విజయవాడ జయప్రకాష్ నగర్‌కు చెందిన నువ్వుల దుర్గ చంద్ర కౌశిక్, రవళి పేరిట అన్నవితరణ చేసేందుకు నువ్వుల భాస్కరరావు, విజయలక్ష్మి మంగళవారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,116 చెక్కును ఈవో రామారావును కలిసి అందించారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ఆశీర్వచనం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, పుస్తకాలను అందజేశారు.



గవర్నమెంట్ బంగ్లా వద్ద..

కృష్ణలంకలో..

చోడవరంలో మహిళల కోలాటం



దుర్గమ్మ పంచహారతుల్లో పాల్గొన్న మంత్రి కొల్లు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి పంచహారతులు సేవ, స్వామివారి సహస్రలింగార్చన, సహస్రదీపాలంకరణ సేవల్లోనూ ఆయన పాల్గొన్నారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు తదితరులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



చోడవరంలో భక్తుల క్యూ..

ఎన్టీఆర్ జిల్లాలో లక్ష ఉద్యోగాలు

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాం

- ఎన్ఐఆర్‌డీతో యువకులు, రైతులకు శిక్షణ
- తిరువూరులో క్లస్టర్ ఏర్పాటు
- జేజేఎం పనులపై ఎంపీ తీవ్ర అసంతృప్తి
- వ్యవసాయరంగంలో డ్రోన్ విప్లవం
- జీజీహెచ్‌కు రూ.110 కోట్ల కేంద్ర నిధులు
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చిత్రంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్, తదితరులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి అవకాశాలను మరింత విస్తృతంగా కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలతో పాటు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పారిశ్రామిక రంగాల్లో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందుకోసం యువత, రైతులకు పెద్ద ఎత్తున శిక్షణా కార్యక్రమాలతో పాటు, సాంకేతిక ఆవిష్కరణల ద్వారా మరింత ఊతం ఇవ్వనున్నట్టు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, కేంద్ర సబ్సిడీ పథకాలను ఎక్కువగా తెచ్చి జిల్లాను మరింత పటిష్టంగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. హైదరాబాద్‌లో 256 ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ) సెంటర్ ఉందని, అక్కడ ఎంతో మంది యువకులు, రైతులకు శిక్షణతో పాటు సర్టిఫికెట్లను అందజేసి మంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఈ సంస్థ సహకారంతో జిల్లాలో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆ సంస్థ సాయంతో తిరువూరులో వారం రోజుల్లో క్లస్టర్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో డ్రోన్ సమ్మిట్ తర్వాత అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని తేచ్చి మరింత మందికి శిక్షణ కల్పించి ఉపాధి కల్పిస్తాన్నారు. జిల్లాలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా నీటి వనరులను సంగ్రహణ నుంచి ట్యాప్ కనెక్షన్ల వరకు నూరు శాతం పనులు జరిగేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలను అత్యాధునికంగా తీర్చిదిద్ది మరిన్ని వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెస్తామన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను రూ.130 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరానన్నారు. జిల్లాలో 857 అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, కొన్నింటికి ఉన్నా ప్రహరీలు లేవన్నారు. ప్రతి స్కూల్‌లో క్రీడా మైదానాలుండాలని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కోరుకుంటున్నారని దీనిపై సమగ్ర నివేదికను రూపొందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల కనెక్టివిటీని పెంచటానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా 20 వేల టాయిలెట్స్ కట్టాలని నిర్ణయించామన్నారు. వచ్చే మార్చి, ఏప్రిల్ నాటికి టాయ్‌లెట్స్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

అధికారులపై ఎంపీ ప్రశ్నల వర్షం

విజయవాడ: కేంద్ర పథకాలను నూరు శాతం ముందుకు తీసుకు వెళదామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. మంగళవారం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ శివనాథ్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సమావేశంలో ప్రధానంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై ఎంపీ సమీక్ష చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్ర పథకాలతో పాటు, ఆయా శాఖల్లో ఉపయోగించుకోవటానికి అవకాశమున్న కేంద్ర పథకాలపై చర్చ జరిగింది. ప్రధానంగా ఆరోగ్యశాఖపై తొలుత ఎంపీ సమీక్షించారు. జిల్లాలోని 27 పీహెచ్‌సీ కేంద్రాల్లో సదుపాయాల గురించి డీఎంవోహెచ్ సుహాసిని అడగ్గా జిల్లాలో పూర్తిస్థాయిలో మెడికల్ ఆఫీసర్లు ఉన్నారని, గైనకాలజిస్టుల కొరత ఉందన్నారు. క్రిటికల్ కేసులు పీహెచ్‌సీల్లో చేయటం లేదని, ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేస్తున్నామన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ జోక్యం చేసుకుని నెలకు ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని ప్రశ్నించారు సగటున 5 నుంచి 10 వరకు జరుగుతున్నాయన్నారు. పీహెచ్‌సీలో శానిటేషన్‌పై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. జన ఔషధి కేంద్రాల గురించి ప్రశ్నించగా డీఎంహెచ్‌వో చెప్పలేకపోయారు. అనంతరం డీఆర్‌డీఏపై సమీక్ష చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలను సృష్టించాలనుకుందని, అందుకనుగుణంగా ఎన్టీఆర్ జిల్లాలో లక్ష ఉద్యోగాలు సృష్టించాలన్న లక్ష్యంతో ముందుకు వెళదామన్నారు. తర్వాత పంచాయితీ రాజ్ శాఖ సమీక్షలో జిల్లాలో పరిమితంగానే రోడ్ల పనులకు ప్రతిపాదనలు ఉండటాన్ని ప్రశ్నించారు. పంచాయితీరాజ్ ఎస్ఈ స్పందిస్తూ ఫేజ్-4లో ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ శాఖ సమీక్షలో పీఎం సూర్యఘర్ పథకం గురించి ఎంపీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. జిల్లాకు 4 వేలు లక్ష్యంగా నిర్దేశించగా 2094 దరఖాస్తులు వచ్చాయని, 418 దరఖాస్తులకు సూర్యఘర్ అమలు చేస్తున్నట్టు సీపీడీసీఎల్ అధికారి చెప్పారు. విద్యుత్ కార్యాలయాలకు సోలార్ ఏర్పాటు చేశారా అని ప్రశ్నించగా, లేదని సమాధానం ఇవ్వడంతో పోనీ ప్రభుత్వ కార్యాలయాలకైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. దానికి కూడా లేదని సమాధానం ఇచ్చారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలను పూర్తిగా సోలార్ దిశగా నడిపించి తర్వాత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తర్వాత గ్రామీణ నీటి సరఫరాపై సమీక్షలో ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. జల్‌జీవన్ మిషన్ పనుల్లో రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా దారుణమైన స్థానంలో ఉందన్నారు. త్వరగా సమగ్ర డీపీఆర్ తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. డీఆర్‌వో లక్ష్మీనరసింహం, జడ్పీ సీఈవో కన్నమ్మ నాయుడు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎమ్మెల్యేల గైర్హాజరు

జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశానికి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాత్రమే హాజరయ్యారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరు కాలేదు.

అధికార భాష హిందీని వినియోగించండి: సాహూ

వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ సమావేశపు హాల్‌లో మంగళవారం జరిగిన అధికార భాష అమలు కమిటీ 68వ సమావేశంలో రైల్వే డివిజన్‌లోని ప్రతి కార్యాలయంలోను హిందీని ఇంకా బాగా వినియోగించాలని అధికార భాష హెడ్ క్వార్టర్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ చరణ్ సుందర్ సాహూ కోరారు. డీఆర్ఎం పాటిల్ అధ్యక్షతన డిప్యూటీ డైరెక్టర్ ఎ.కుమార్ విశ్వాస్, సభ్య కార్యదర్శి ఎం.కె. నాగరాజు పాల్గొన్నారు. హిందీ తెలుసుకోవటం, ఉపయోగించటం సులభమని వివరించారు. వివిధ కార్యాలయాల అధికారులు హిందీ భాషా వినియోగంపై అర్ధ సంవత్సర నివేదికలను సమర్పించారు. హిందీ అమలు ప్రగతిని నివేదికల్లో వివరించారు. విమానయాన విభాగం డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ ప్రాంతీయ కార్యాలయం అధికారి ఎస్.శ్రీనివాస్, డివిజనల్ ఆఫీసుకు చెందిన అధికారులు, పాస్ పోర్టు ఆఫీసు నుంచి శివహర్ష, కస్టమ్స్ ఆఫీసు నుంచి అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు.

మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం

● పీడీఎస్‌యూ ఆవిర్భావ సభలో వక్తలు

గవర్నర్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తామని భగత్‌సింగ్ మేనల్లుడు, అఖిల భారత విద్యా హక్కుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ తెలిపారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఏర్పడి 50ఏళ్లు నిండుతున్న సందర్భంగా అర్ధ శతాబ్దోత్సవ సభ మంగళవారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో జరిగింది. సభ ప్రారంభంలో పీడీఎస్‌యూ పూర్వ అధ్యక్షుడు పి.ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. సభకు రాష్ట్ర అధ్యక్షుడు ఈ భూషణం రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఏర్పరచిన విద్యార్థి సంఘం నవ జవాన్ భారత్ సభకు 100 ఏళ్లు, పీడీఎస్‌యూకు 50 ఏళ్లు నిండటం చరిత్రాత్మకమన్నారు. మోదీ ప్రభుత్వం ఫాసిస్ట్ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, వినోద్‌కుమార్, సహాయ కార్యదర్శులు రాజేష్, నాని, సునీల్, ఉపాధ్యక్షులు అంకన్న, మహర్షి, రాష్ట్ర నేతలు రాంబాబు, అభిశ్రీ, నాగేశ్వరరావు, అఖండ పాల్గొన్నారు.

7న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం

బస్టేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఈనెల 7న జరగనున్న ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో సమస్యలపై చర్చించి అవసరమైన కార్యాచరణను రూపొందిస్తామని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన సెంట్రల్ కమిటీ సమావేశంలో వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని సమస్యలను పరిష్కరించాలని, ఎండీ అందుబాటులో లేనందున పరిపాలనా విభాగం ఈడీ జీవీ రవివర్మకు మెమోరాండం ఇచ్చామన్నారు. మెమోరాండంలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 7న సిద్ధార్థ ఆడిటోరియంలో జరగనున్న యూనియన్ రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించి కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

'అస్త్రం'లో అప్‌డేట్ అవ్వండి

● ట్రాఫిక్ సిబ్బందికి సీపీ ఆదేశాలు

విజయవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ జామ్‌లను గుర్తించడానికి కొత్తగా తెచ్చిన అస్త్రం యాప్‌లో ట్రాఫిక్ పోలీసులు అప్‌డేట్ అవ్వాలని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశించారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ట్రాఫిక్ విభాగ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, యాప్ నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అస్త్రం యాప్‌లో ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ నిలిచినప్పుడు తక్షణమే గుర్తించి అక్కడున్న సిబ్బందికి కమాండ్ కంట్రోల్ రూం నుంచి అలర్ట్ ఇస్తున్నామన్నారు. అక్కడ ట్రాఫిక్ ఏ కారణంగా నిలిచింది.. సమస్యను పరిష్కారానికి ఎంత సమయం పట్టిందన్న వివరాలను సిబ్బంది యాప్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. దీంతో ఏ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయో తెలుసుకునే వీలుంటుందన్నారు. ట్రాఫిక్ విభాగ ఏడీసీపీ ప్రసన్నకుమార్, నగరంలో వివిధ ట్రాఫిక్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానానికి శ్రీకారం

● మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి



బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభోత్సవంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే గద్దె

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి శ్రీకారం చుట్టామని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ వెల్లడించారు. నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి కృష్ణా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ (కాసా) అండర్-13 బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌కృష్ణ చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి బ్యాడ్మింటన్‌ను ఆడి పోటీలను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ క్రీడా సంఘాల తోడ్పాటుతో రాబోయే కాలంలో ఇలాంటి క్రీడా పోటీల నిర్వహణ చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని, దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్‌ను అమరావతిలో నిర్మించడానికి సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నారు. ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముక్కాల ద్వారకానాథ్, పోలినేని అంకమ్మ చౌదరి మంత్రి, ఎమ్మెల్యేలను సత్కరించారు. ఈ నెల 7 వరకు అండర్-13 బాలబాలికల సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌ల్లో తలపడనున్నారు. ఇందులో సత్తా చాటిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు.

ఈ టీమ్ జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 27నుంచి 30వరకు జరిగే 36వ జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది.

9న పున్నమీఘాట్ వద్ద సీ ప్లేన్ వేడుక

వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నగరంలో మొట్టమొదటిసారిగా సీ ప్లేన్ ప్రారంభోత్సవం జరగనుంది. బబ్బూరి గ్రౌండ్స్ పున్నమీఘాట్ వద్ద మంగళవారం సీ ప్లేన్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై మ్యారీ టైం బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్య, సబ్ కలెక్టర్ కె. చైతన్య, ఈవెంట్ ఆర్గనైజర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వీవీపీలకు, ఇతరులకు ఈవెంట్‌ను వీక్షించేందుకు మౌలిక సదుపాయాలు కల్పించటానికి సీటింగ్, తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రవేశద్వారాల ఏర్పాటు, ఎల్‌సీడీల ద్వారా సీ ప్లేన్‌ల ప్రత్యక్ష ప్రసారం వంటి వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీఎంసీ ప్రాజెక్టుల విభాగం అదనపు కమిషనర్ డాక్టర్ బి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ బి.వి.వి.ఎస్.వి. ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఈఈ వెంకటేశ్వరరెడ్డి, జాయింట్ డైరెక్టర్ అమృత్, పీవో (యూసీడీ) ఇన్‌చార్జి డాక్టర్ లత పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

విజయవాడ: పున్నమిఘాట్‌లో నిర్వహించే స్కై మీట్స్ సీ (సీప్లేన్ సర్వీసు) బందోబస్తు ఏర్పాట్లను పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు మంగళవారం పరిశీలించారు. వీఎంసీ, రెవెన్యూ, పర్యాటక శాఖ సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నందున బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో పులివెందులలోనూ ఓటమే

- సొంత జిల్లా అభివృద్ధిలో జగన్ విఫలం
- దోచుకోవడం.. దాచుకోవడమే వైసీపీ నైజం
- గత ప్రభుత్వ అభివృద్ధిపై చర్చకు సిద్ధం: సవిత



కడప కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాను కూడా అభివృద్ధి చేసుకోలేని చేతకాని మాజీ ముఖ్యమంత్రి జగన్. నీ అరాచక పాలనను ప్రజలు చూశారు. వచ్చే ఎన్నికల్లో పులివెందుల సీటు కూడా గెలవలేవు' అని కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మండిపడ్డారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అధ్యక్షతన జిల్లా అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడారు. కడప జిల్లా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని మాజీ సీఎం జగన్‌కు మంత్రి సవాలు విసిరారు. అధికారులపై గన్‌లు పెట్టి బెదిరించడం, దోచుకోవడం, దాచుకోవడమే వైసీపీ పాలన అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని గొప్పలు చెప్పుకున్న జగన్.. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 74 మందిపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరిగాయని దుష్ప్రచారం చేశాడని, వాటికి ఆధారాలు చూపమని హోంమంత్రి అడిగితే చూపలేదన్నారు. జగన్ భూహక్కు చట్టంతో రైతులు భయపడ్డారని, అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు దానిని రద్దుచేసి మాట నిలుపుకొన్నారని తెలిపారు. రోడ్లపై గుంతలు మేమే తీశామని, ఇప్పుడు వాటినే మేము పూడ్చుతున్నామని ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి విమర్శించడం హాస్యాస్పదమన్నారు. సొంత కడప జిల్లా రోడ్లపై తట్టెడు మన్ను కూడా వేయలేని పాలన సాగించారని మండిపడ్డారు. నీవు సీఎంగా ఉన్నప్పుడు 3 సార్లు టెంకాయ కొట్టి ఉక్కు ఫ్యాక్టరీని స్థాపించలేక పోయావని మండిపడ్డారు. పల్లె పండుగ పేరుతో పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయిస్తున్నామని.. జగన్ సర్పంచ్‌ల నిధులు కూడా దోచుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నా పులివెందుల అని చెప్పే జగన్ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేని చేతకాని వాడన్నారు.

పిడుగుపాటు ఘటనలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య

ఉండ్రాజవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగుపడిన సంఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. గత నెల 30న జరిగిన ఈ ఘటనలో ఆ రోజు ఇద్దరు మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం కావలిపురానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు(50), తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన కడియం కుమారి(48), పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన శీలం లక్ష్మి(47), మందలంక కమలరత్నం(47) మృతి చెందారు.

డ్రోన్ హబ్‌గా ఏపీ

కర్నూలులో డ్రోన్ డెవలప్‌మెంట్ సెంటర్

- రాష్ట్రంలో వందకుపైగా డ్రోన్ తయారీ కంపెనీలు
- డ్రోన్ పాలసీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం



ఐటీ, డ్రోన్, సెమీకండక్టర్స్ పాలసీపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన ఉన్నతాధికారులు

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన డ్రోన్ షో విజయవంతం కావడంతో.. రాష్ట్రాన్ని డ్రోన్ హబ్‌గా మార్చే దిశగా కూటమి సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. దీనికోసం కర్నూలులో డ్రోన్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సచివాలయంలో డ్రోన్ పాలసీపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్లగ్ అండ్ ప్లే విధానంలో డ్రోన్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్, తయారీ కేంద్రాన్ని కర్నూలులో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కర్నూలులో దీన్ని ఏర్పాటు చేయడం వల్ల.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు ఇది కేంద్రంగా ఉంటుందన్నారు. డ్రోన్ వినియోగాభిరుచిని పెంచేలా.. అత్యవసర, ఇతర సేవలను వేగవంతం చేసేలా రాష్ట్ర డ్రోన్ కార్పొరేషన్ రూపొందించిన ఈ పాలసీకి సీఎం సూత్రప్రాయంగా సమ్మతించారు. వందకుపైగా వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకున్నాక, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని డ్రోన్ పాలసీని రూపొందించామని అధికారులు సీఎంకు వివరించారు. ఈ పాలసీతో రాష్ట్రంలో వందకుపైగా డ్రోన్ తయారీ కంపెనీలు ఏర్పాటవుతాయని చెప్పారు. దాదాపు 20 డ్రోన్ పైలట్ శిక్షణ కేంద్రాలు, 50 నైపుణ్యాభివృద్ధి సంస్థలను స్థాపించే అవకాశం ఉంటుందని అన్నారు. డ్రోన్ రంగంలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని, రూ.3,000 కోట్ల రాబడి వస్తుందని, రూ.1,000 కోట్ల ఎగుమతులు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రోన్ పాలసీతో ప్రత్యక్షంగా 15 వేల మందికి, పరోక్షంగా 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించిన సీఎం చంద్రబాబు డ్రోన్ పాలసీకి సూత్రప్రాయ ఆమోదం తెలిపారు.

ప్రోత్సాహకాలు ఇవే...

- రూ.5 కోట్ల దాకా 20 శాతం పెట్టుబడి రాయితీ.
- 100 శాతం జీఎస్టీ మినహాయింపు.. పీఎల్ఐ స్కీమ్ కింద మరిన్ని రాయితీలు ప్రకటించే వీలు.
- ప్రాజెక్టు వ్యయంలో రూ.5 లక్షల దాకా ఇన్సెంటివ్‌లు అందజేత. ఇంటెలెక్చువల్ ప్రాపర్టీపై రూ.5 లక్షల వరకు రీయింబర్స్‌మెంట్.
- భూ బదలాయింపులో స్టాంప్ డ్యూటీ ఫీజు పూర్తిగా మినహాయింపు. మూడేళ్లపాటు లీజు ధరల్లో 50 శాతం రాయితీ.

కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం: సీఎం

డ్రోన్ వినియోగంలో నియంత్రణ అథారిటీతోనూ, పారిశ్రామిక వేత్తలతోనూ, లబ్ధిదారులతోనూ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా వెల్లడించారు. డ్రోన్ రంగంలో పరిశోధనలు, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. అమరావతిని డ్రోన్ హబ్‌గా మారుస్తామని, కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తామని అన్నారు. డ్రోన్ వినియోగంలో స్వేచ్ఛనిస్తూనే.. పరిధి దాటకుండా నిరంతర పోలీసింగ్ పర్యవేక్షణ ఉంటుందని కూడా చంద్రబాబు స్పష్టం చేశారు. డ్రోన్ల వల్ల వ్యక్తి స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపడతామన్నారు. డ్రోన్ వినియోగానికి సంబంధించి ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. డ్రోన్ వినియోగంలో పోలీసింగ్, చట్టాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

దేశంలోనే అత్యుత్తమ డ్రోన్ పాలసీ

దేశంలోనే అత్యుత్తమ డ్రోన్ పాలసీని రూపొందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. డ్రోన్ పరిశ్రమకు ఏపీ కేంద్రంగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో డ్రోన్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పెట్టుబడిదారులకు మంచి ప్రోత్సాహకాలు అందించేలా పాలసీ ఉందన్నారు. దేశంలోనే డ్రోన్ క్యాపిటల్ సిటీగా అమరావతిని అభివృద్ధి చేసేలా పాలసీని అమలు చేయాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రా, మౌలిక సదుపాయల కల్పనా మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఐ అండ్ ఐ కార్యదర్శి సురేశ్ కుమార్, డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పాలసీలపై సీఎం దిశానిర్దేశం

ఏపీ సెమీ కండక్టర్ పాలసీ (2024-29), ఏపీ డేటా సెంటర్ పాలసీ (2024-29), ఏపీ డ్రోన్ పాలసీ (2024-29)ల రూపకల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. స్వీయ ఆర్థిక విధానానికి సెమీ కండక్టర్ పాలసీ దోహదపడుతుందని, డేటా సెంటర్ పాలసీ రాష్ట్రాన్ని ఏఐ డేటా హబ్‌గా మారుస్తుందని పేర్కొన్నారు. ఈ పాలసీలు రాష్ట్ర ఆర్థిక పటిష్ఠతకు దోహదపడతాయని చంద్రబాబు తెలిపారు.

రేపు 5 సబ్‌స్టేషన్లు ప్రారంభం

- 14 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన
- చంద్రబాబు చేతులమీదుగా కార్యక్రమం
- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 5 సబ్‌స్టేషన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ప్రారంభించనున్నారు. వాటితో పాటు మరో 14 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేయనున్నారని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ మంగళవారం ప్రకటించారు. రాజధాని ప్రాంతంలోని తాళ్లాయపాలెంలో ఏర్పాటు చేసిన 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను సీఎం చంద్రబాబు స్వయంగా, మిగిలిన చోట్ల వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని తెలిపారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెంలో రూ.505 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయగా.. నంద్యాలలో రూ.98 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.75 కోట్లు, చిత్తూరులో రూ.38 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాలో రూ.21 కోట్లతో వీటిని నిర్మించారు. ఇవికాకుండా.. శ్రీకాకుళం, అప్పర్ సీలేరు, అనకాపల్లి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల్లో మొత్తం 14 సబ్‌స్టేషన్లకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో తాళాయపాలెంలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్న సబ్‌స్టేషన్ తుది పనులను మంగళవారం విజయానంద్ పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ.5,407 కోట్లతో ఈ ప్రాజెక్టులు చేపట్టినట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెన్కో ఎండీ చక్రధరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ పాలకమండలి ప్రమాణ స్వీకారం



తిరుమలలో బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. మంగళవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆయనకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, రిసెప్షన్ అధికారులు స్వాగతం పలికారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణస్వీకారం చేశాక బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎస్ రాజు, నర్సిరెడ్డి, జాస్తి సాంబశివరావు, రాజశేఖర గౌడ్, జంగా కృష్ణమూర్తి, దర్శన్, శాంతారాం, రామ్మూర్తి, జానకీదేవి, మహేందర్‌రెడ్డి, రంగశ్రీ, ఆనంద్‌సాయి, నరేష్‌కుమార్, అదిత్ దేశాయ్, సౌరబ్ బోరా, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

పనితీరు మెరుగుపరుచుకుంటా

- మందలించే హక్కు చంద్రబాబుకు ఉంది: మంత్రి సుభాశ్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 'నేను వార్డు మెంబరు కూడా కాదు. అయినా ఎమ్మెల్యే సీటు ఇచ్చారు. మంత్రి పదవి ఇచ్చి గౌరవించారు. తండ్రి లాంటి సీఎం చంద్రబాబుకు నన్ను మందలించే హక్కు ఉంది' అని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదులో తన అలసత్వం ఉన్న కారణంగా చంద్రబాబు మందలించారని, దానిని వేరే కోణంలో చూడాల్సిన పనిలేదన్నారు. జరిగిన దాంట్లో నేర్చుకోవాల్సింది చాలా ఉన్నట్లు గ్రహించానన్నారు. ఇక మీదట అలసత్వం ఉండదని, పని తీరు మెరుగుపరుచుకుంటానని చెప్పారు. సీఎం చంద్రబాబు తమ పని తీరును నిత్యం గమనిస్తుంటారని, పార్టీకి కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోకపోతే ఉపేక్షించరని అన్నారు. సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన విషయాల్ని వక్రీకరించి వైసీపీ మీడియా, సోషల్ మీడియా, పేటీఎం బ్యాచ్ విష ప్రచారం చేసిందన్నారు. వైసీపీ ట్రోలింగ్‌తో రామచంద్రపురంలో 26శాతం ఉన్న ఎమ్మెల్సీ ఓటింగ్ నమోదు 41శాతానికి పెరిగిందన్నారు. మంగళవారం కూడా చాలా పెద్ద సంఖ్యలో ఓటర్ల నమోదు జరుగుతోందన్నారు. అందుకు వైసీపీ మీడియాకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీకి బుద్ధిరాలేదని విమర్శించారు.

ఐదేళ్ల చీకటి పాలనతో రాష్ట్రం నష్టపోయింది

- జనవరిలో కొత్త అక్రిడిటేషన్లు ఇస్తాం: మంత్రి కొలుసు

బాపట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ ఐదేళ్ల చీకటి పాలనతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. డీఆర్సీ సమావేశంలో పాల్గొనడానికి మంగళవారం బాపట్ల వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రాణ సమానమైన పోలవరం, చింతలపూడితోపాటు వంశధార ప్రాజెక్టులను పడకేయించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదన్నారు. పదిన్నర లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వ పటిమతో గట్టెక్కించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేవిధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, నిరుద్యోగ యువతీయువకుల ఆకాంక్షలను తీర్చే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వం వివిధ కారణాలతో కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో పెట్టిన రూ.800 కోట్ల బకాయిలు తీర్చడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు.

గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవరిస్తాం

రాష్ట్రంలోని జర్నలిస్టులకు వచ్చే జనవరిలో కొత్త అక్రిడిటేషన్లు ఇస్తామని సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, యూనియన్ ప్రతినిధులతో కలిసి మంగళవారం మంత్రిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఐజేయూ అధ్యక్షుడు, తెలంగాణ ప్రెస్అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం యూనియన్ నాయకులతో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను మార్పు చేసి, అర్హులందరికీ అక్రిడిటేషన్లు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టులకు ఇంటిస్థలంతోపాటు ఇల్లు నిర్మించి ఇచ్చే అవకాశాలను సీఎం చంద్రబాబు పరిశీలిస్తున్నారని తెలిపారు. ప్రమాద భీమా పథకాన్ని కూడా పునరుద్ధరిస్తామని చెప్పారు.

రీల్స్ పేరుతో బాలికపై అఘాయిత్యం

- పలుమార్లు లైంగిక దాడి.. నెల్లూరులో ఆలస్యంగా వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిందితుడు.. పోక్సో కేసు నమోదు



మహమ్మద్ అలీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయమాటలు చెప్పి, సెల్‌ఫోన్ ఇచ్చి రీల్స్ చేయమని ప్రోత్సహిస్తున్నట్టు దగ్గరై లైంగిక దాడికి పాల్పడ్డాడు. నెల్లూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. నగరంలోని వెంకటేశ్వరపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ మహిళ ముగ్గురు కుమార్తెలతో ఉంటోంది. పిల్లలను చదివించే స్తోమత లేక వారిని పాఠశాలకు పంపట్లేదు. భార్య, పిల్లలను వదిలేసిన మహ్మద్ అలీ అదే అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉంటున్నాడు. మహిళ రెండవ కుమార్తెపై (14) కన్నేసిన అతను.. ఆమెతో పరిచయం పెంచుకొని మాయమాటలు చెప్పడం ప్రారంభించాడు. బాలికకు ఫోన్ ఇచ్చి రీల్స్ చేయమని ప్రోత్సహిస్తున్నట్టు దగ్గరై తన అపార్ట్‌మెంట్‌కు తీసుకెళ్లి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాలిక ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లి, బంధువులు సోమవారం గట్టిగా నిలదీయగా అసలు విషయం వెలుగు చూసింది. వెంటనే బాలిక తల్లి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ అన్వర్‌బాషా పోక్సో కేసు నమోదుచేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు మహ్మద్ అలీని అదుపులోకి తీసుకున్నారు.

అప్పన్న ఆలయంలో పోలీసు అధికారిణి హల్‌చల్

- నీలాద్రి గుమ్మం వద్ద తెర తొలగించి మరీ స్వామి దర్శనం
- అభ్యంతరం తెలిపిన ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు
- ఆగ్రహంతో ఇద్దరినీ బదిలీ చేయించిన అధికారి

సింహాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఓ మహిళా పోలీస్ అధికారి తన దర్పాన్ని ప్రదర్శిస్తూ హల్‌చల్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమయింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో అప్పన్న దర్శనానికి పోలీస్ శాఖలో ఎస్పీ స్థాయిలో పనిచేస్తున్న ఓ మహిళా అధికారి వచ్చారు. అప్పటికే రాత్రి ఆరాధనలో భాగంగా దివిటీ సలామ్ జరిపి, ప్రధాన గుమ్మం నీలాద్రి ద్వారం వద్ద తెరను వేశారు. నిబంధనల ప్రకారం వైదికులు తెర వేసిన తరువాత ఎంతటి అధికారి నైనా దర్శనానికి అనుమతించకూడదు. ఇదే విషయాన్ని సీనియర్ అర్చకుడొకరు పోలీసు అధికారిణికి చెప్పగా, మరో అర్చకుడు తెరను తొలగించి మరీ ఆమెను లోపలకు తీసుకువెళ్లి పూజలు నిర్వహించడంపై ఆలయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా ఆ అధికారి ఆలయ ప్రాంగణంలో ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఆలయ పర్యవేక్షణాధికారి సూచనల మేరకు ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు అభ్యంతరం తెలిపారు. దీంతో ఆమె వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎస్పీఎఫ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి హడావుడి చేయగా ఇద్దరు ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లకు స్థాన చలనం కలిగిస్తూ ఆగమేఘాలపై ఆదేశాలు వెలువడ్డాయి. ఈ విషయమై ఆలయ ఏఈఓ ఆనందకుమార్‌ను వివరణ కోరగా పోలీసు అధికారి హడావుడి చేయడం వాస్తవమేననే, విషయం తన దృష్టికి వచ్చిందని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్పీఎఫ్ సీఐను వివరణ కోరగా పోలీసు అధికారి ఆలయ ప్రాంగణంలో ఫోన్ మాట్లాడటం సాధారణ అంశమేనని, అప్పన్న ఆలయంలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లను తాత్కాలికంగా క్యాష్ డ్యూటీకి పంపామన్నారు.

భూమి ఇచ్చినా బాధ్యతేదీ?

- రైల్వే జోన్‌పై నాన్చుడు ధోరణి
- 2 నెలల కిందటే 52.22 ఎకరాలు
- ఆగస్టు 30నే రైల్వే శాఖకు మ్యుటేషన్
- డిసెంబరులో శంకుస్థాపన చేస్తామన్న కేంద్ర మంత్రి
- 4 నెలలు ఆగమంటున్న బీజేపీ నేతలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం ఏర్పాటు ప్రక్రియ ఒక అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టు సాగుతోంది. సాక్షాత్తూ ప్రధాని మోదీ హామీ ఇచ్చి ఆరేళ్లు అవుతున్నా జోన్ కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం. కేంద్రం, గత వైసీపీ ప్రభుత్వం ఆది నుంచి దీనిని మైలేజీ కోసం ఉపయోగించుకోవాలని యత్నించాయి. 2022, నవంబరులో డీఆర్ఎం కార్యాలయం వెనుక ఉన్న వైర్‌లెస్ కాలనీలో జోన్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లుచేశారు. ఆ రోజు రాత్రికి రాత్రి ఏమైందో తెలియదు గానీ రైల్వే మంత్రి ఆ స్థలాన్ని పరిశీలించి వెళ్లాక కార్యక్రమం వాయిదా పడింది. ఆ తర్వాత జోన్‌కు ముడసర్లోవలో భూములే కావాలని రైల్వే శాఖ పట్టుబట్టింది. ఒకానొక దశలో భూమి ఇస్తే వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.

2 నెలల క్రితమే భూమి అప్పగింత

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం.. రైల్వే జోన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ముడసర్లోవలో భూమి కేటాయింపునకు తక్షణం చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో చినగదిలి మండలం ముడసర్లోవ గ్రామం సర్వే నంబర్లు 57, 58, 59/1, 61/1, 62, 63, 64, 65(పాత సర్వే నంబర్ 26)లలో 52.22 ఎకరాల భూమిని ఆగస్టు నెలాఖరున రైల్వే అధికారులకు ఇచ్చారు. ఆ భూమిని మ్యుటేషన్ ద్వారా రెవెన్యూ రికార్డుల్లో రైల్వే శాఖకు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. దీనికోసం కలెక్టర్ 542/2024 నంబరుతో ఆగస్టు 30న ప్రొసీడింగ్స్ కూడా జారీచేశారు. ఇప్పుడు ఆ భూములు పూర్తిగా రైల్వే అధికారుల ఆధీనంలోనే ఉన్నాయి.

మారిన టోన్!

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, కూటమి నాయకులు డిసెంబరులో రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. అంటే వచ్చే నెలలోనే ముహూర్తం ఖరారు కావలసి ఉంది. అయితే, ఇటీవల విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో రైల్వే జోన్ అంశం ప్రస్తావనకు వచ్చింది. నాలుగు నెలలు ఆగి.. 2025లో శంకుస్థాపన చేస్తే బాగుంటుందని ఆ సమావేశంలో నాయకులు అభిప్రాయపడినట్టు తెలిసింది. దీనిని బట్టి డిసెంబరులో జోన్‌కు శంకుస్థాపన జరిగే అవకాశం లేదని తెలుస్తోంది.

జోన్ ప్రారంభిస్తే సరిపోదా?

గత ఐదేళ్లుగా అటు కేంద్రం, ఇటు రాష్ట్రం విశాఖ రైల్వేజోన్ విషయాన్ని పూర్తిగా రాజకీయం చేశాయనే ఆరోపణలు ఉన్నాయి. జోన్ మంజూరు చేశారు కాబట్టి డివిజన్లను విడదీసి, ఉద్యోగులను కేటాయించి, ఏదో ఒక భవనంలో ముందు కార్యకలాపాలు ప్రారంభించాలని విశాఖ వాసులు డిమాండ్ చేస్తున్నారు. తొలుత జోన్ కార్యకలాపాలు మొదలుపెడితే ఆ తర్వాత సొంత భవన నిర్మాణం చేసుకోవచ్చని, దానికి ఎలాగూ రెండు నుంచి మూడేళ్ల పడుతుంది కాబట్టి అంతవరకు కార్యకలాపాలు ఆపడం తగదని సూచిస్తున్నారు. విశాఖ కేంద్రంగా కొత్త రైళ్ల ప్రారంభం, ఇక్కడి పారిశ్రామిక అవసరాలకు తగినట్టు ర్యాక్‌ల కేటాయింపు, ఈ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా విశాఖ కేంద్రంగా రైల్వే బోర్డు ఏర్పాటు అనేవి ప్రధానం. కాబట్టి వాటిని సాకారం చేసే దిశగా తక్షణమే(డిసెంబరులో) కార్యకలాపాలు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

శ్రీశైలం, సాగర్‌ను ఖాళీ చెయ్యకండి

- తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖ

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని తాగు, సాగు నీటి అవసరాలకు మాత్రమే వాడాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) తెలుగు రాష్ట్రాలను కోరింది. 2025 వానాకాలం దాకా రిజర్వాయర్లలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జలవిద్యుత్ ఉత్పాదన చివరి ప్రాధాన్యంగా ఉండాలని సూచించింది. కేఆర్ఎంబీ సభ్యుడు డాక్టర్ ఆర్.ఎస్.శంకువ ఈ మేరకు తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలకు వేర్వేరుగా లేఖలు పంపారు. శ్రీశైలం ప్రాజెక్టు వద్ద అవసరమున్నా లేకున్నా పోతిరెడ్డిపాడు నుంచి ఇరువైపులా జలవిద్యుత్ ఉత్పాదనతో నీటిని దిగువకు వదులుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, సాగర్‌లో ప్రధాన కేంద్రంతో పాటు కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో జల విద్యుత్ ఉత్పాదన చేస్తున్నారని తెలిపారు. ఇలా పోటీ పడి తెలుగు రాష్ట్రాలు నీటి నిల్వలను దిగువకు వదులుతుండడంపై కేఆర్ఎంబీ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే జలవిద్యుత్ ఉత్పాదనను నిలిపివేయాలని, అవసరం లేకుండా ఇతర కాంపోనెంట్ల ద్వారా నీటి తరలింపును ఆపాలని కోరింది. నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు ఉండడంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని అలాగే దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీలోనూ పూర్తి స్థాయి నిల్వలు ఉండడంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఇలా నీరు వృథా అవుతున్న నేపథ్యంలో కేఆర్ఎంబీ తెలుగు రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

టీడీపీలో చేరిన కుప్పం మున్సిపల్ ఛైర్మన్

- పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించిన సుధీర్



టీడీపీలో చేరిన కుప్పం మునిసిపాలిటీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్‌కు కండువా కప్పుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సుధీర్ టీడీపీలో చేరారు. మంగళవారం ఉండవల్లి నివాసంలో సీఎంను ఆయన కలిశారు. చంద్రబాబు ఆయనకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీకి, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్ పదవులకు సుధీర్ రాజీనామా చేశారు. చంద్రబాబుతోనే కుప్పం అభివృద్ధి సాధ్యమని, ఆయనతో కలిసి నడిచేందుకే అన్ని పదవులకూ రాజీనామా చేశానని సుధీర్ తెలిపారు.

ఏసీబీకి పట్టుబడిన వీఆర్వో

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన భర్త పేరుతో ఉన్న పొలాన్ని ఆన్‌లైన్‌లో భార్య పేరిట మార్చడానికి రూ.రెండు లక్షలు లంచం తీసుకుంటూ గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం వీఆర్వో షేక్ హసీనా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర కథనం మేరకు.. గుంటూరు రూరల్ మండలం వెంగళయపాలేనికి చెందిన చెరుకూరి సత్యనారాయణ గతేడాది డిసెంబర్‌లో మృతి చెందారు. ఆయన పేరిట ఉన్న 1.25 ఎకరం వ్యవసాయ భూమిని తన పేరిట మార్చుకునేందుకు సత్యనారాయణ భార్య ప్రమీల దరఖాస్తు చేసుకోగా ఇన్‌చార్జి వీఆర్ఓ హసీనా రూ.రెండు లక్షలు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు మంగళవారం రాత్రి వెంగళాయపాలెం సచివాలయంలో ప్రమీల నుంచి వీఆర్వో రూ.రెండు లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్నారు.

ఫ్యాషన్

అందంగా.. హుందాగా..



ఈ మధ్యకాలంలో పెళ్లి వేడుకల్లో చీరలతో పాటుగా లెహంగాలు మెరవాల్సిందే! చీరలు సంప్రదాయాలకు ప్రతీక అయితే.. లెహంగాలు ఆధునికతకు చిహ్నాలు. అంతే కాదు. లెహంగాలలో చీరల్లో ఉన్న అందం.. హుందాతనం కూడా ఉంది!

- లెహంగాను ఎంచుకొనేటపుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లెహంగా ధరించినప్పుడు కొందరు సన్నగా కనిపిస్తారు. కొందరు బొద్దుగా కనిపిస్తారు. అందువల్ల శరీరాకృతి ఆధారంగా ఎలాంటి లెహంగా సరిపోతుందనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. షిఫాన్, జార్జెట్, క్రేప్, రా సిల్క్ లెహంగాలు ధరించినప్పుడు సన్నగా కనిపిస్తారు. ఆర్గంజా, బ్రోకేడ్ ఫ్యాబ్రిక్‌లను ఎంచుకుంటే బొద్దుగా కనిపిస్తారు.
- నీలం, ఎరుపు, గులాబీ, ఆకుపచ్చ వంటి ముదురు రంగుల లెహంగాలు ఆకర్షణీయంగా ఉంటాయి. వీటికి ఎంబ్రాయిడరీ వర్క్‌లు చేయిస్తే మరింత ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ ఏడాది మస్టర్డ్ ఎల్లో (ఆవ పూల రంగు), ముదురు పింక్, బీజ్ వంటి రంగులు ట్రెండింగ్‌లో ఉన్నాయి.
- లెహంగాపై ధరించే చోళీ సరైన కొలతలతో ఫిట్‌గా ఉండేలా చూసుకోవాలి. చోళీ సరిగా కుదరకపోతే లెహంగా అందం మొత్తం పోతుంది. శరీరాకృతికి తగ్గట్టు హై నెక్ లేదా వీ నెక్ ఎంచుకోవాలి. చోళీకి పొడవైన చేతులు పెట్టించుకున్నా బాగుంటుంది.
- లెహంగాపై దుపట్టా వేసుకునే తీరు కూడా ఆకర్షణీయంగా ఉండేలా చూసుకోవాలి. భుజం మీద ఒక వైపు వేసుకోవటం ఇప్పుడు ఫ్యాషన్.
- లెహంగాకు తగినట్టుగా హెయిర్ స్టయిల్ ఉండాలి. జుట్టును వదిలేస్తే ఒక అందం. చిన్న పోనీటైల్స్ కూడా ఈ మధ్యకాలంలో ట్రెండింగ్‌లో ఉన్నాయి.
- హైహీల్స్ వేసుకుంటే మంచిది. దీని వల్ల పొడవుగా కనిపిస్తారు.

> ప్యూర్ సిల్క్, రా సిల్క్, బెనారస్ సిల్క్ ఫ్యాబ్రిక్‌లకు మెరిసే పూసలు, జరీ దారాల ఎంబ్రాయిడరీ వర్క్‌ను జోడించి రూపొందిస్తున్న లెహంగాలకు మంచి డిమాండ్ ఉంది. షిఫాన్ లెహంగాలపై ఈ మధ్య కాలంలో జర్దోసీ వర్క్, సీక్వెన్స్ వర్క్ వంటి అదనపు హంగులను చేరుస్తున్నారు.



స్ఫూర్తి

మేం ఎవరికీ తీసిపోం

ఆమెది పుట్టుకతో వెంట తెచ్చుకున్న అంధత్వం కాదు. బడి ఈడు వరకూ మెరుగ్గా ఉన్న కంటిచూపు క్రమేపీ తగ్గుతూ, అంతిమంగా అంధత్వానికి దారి తీసింది. కానీ ఆ పరిస్థితికి కుంగిపోకుండా గాయనిగా ఎదుగుతూనే, సివిల్ సర్వెంట్‌గా ప్రజలకు సేవలందించాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకుంది హైదరాబాద్‌కు చెందిన 23 ఏళ్ల పారాల మౌనిక. ఆమె 'నవ్య'తో పంచుకున్న ఆసక్తికరమైన విశేషాలు...



"భగవంతుడు మన దగ్గరి నుంచి దేన్నైనా తీసేస్తే, అంతకు మించిన ఉత్తమమైనదేదో తిరిగిస్తాడని అర్థం. కాబట్టి ఆ బెస్ట్ కోసమే మనం ప్రయత్నించాలి. దాన్నే మన లక్ష్యం చేసుకోవాలి. పుట్టుకతోనే అంధత్వాన్ని వెంటబెట్టుకు రావడం వేరు. క్రమేపీ చూపు కోల్పోయి అంధత్వానికి చేరుకోవడం వేరు. నా విషయంలో అదే జరిగింది. అయినా నేనెప్పుడూ కుంగిపోలేదు. మరింత మెరుగ్గా, చూపున్న పిల్లల కంటే సమర్థంగా, ఉన్నతంగా ఎదగడం కోసం నాలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవడం చిన్నప్పటి నుంచే మొదలుపెట్టాను. పుట్టుకతో నా కంటి చూపు అందరు పిల్లల్లాగే మెరుగ్గానే ఉండేది. బడికి కూడా వెళ్తూ ఉండేదాన్ని. కానీ క్రమేపీ చూపు తగ్గుతూ ఉండడంతో, అమ్మా నాన్నా నన్ను స్థానికంగా కంటి వైద్యులకు చూపించారు. ఎల్వీ ప్రసాద్, సరోజినీ దేవి కంటి ఆస్పత్రులకు కూడా తీసుకువెళ్లారు. చూపు మెరుగు కోసం చేసిన మొదటి సర్జరీ విఫలమైపోయింది. విదేశీ వైద్యులు చేసిన రెండో సర్జరీ ఫలితాన్నిచ్చి పదో తరగతి వరకూ కొంతమేరకు చూడగలుగుతూ, నా పనులు నేను చేసుకోగలిగేదాన్ని. అలాగని నేను సాధారణ బడుల్లో చదువుకోలేదు. యుకెజి వరకూ సాధారణ బడిలో చదివినా, పుస్తకాలు చదవడం వల్ల, కంటిచూపు ఇంకా వేగంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పడంతో ఒకటో తరగతి నుంచి బ్రెయిలీలో చదువు కొనసాగించాను. పదో తరగతి నుంచి చూపు మరింత దిగజారుతూ, అంతిమంగా అంధత్వానికి దారి తీసింది. నాకున్నది గ్లాకోమా సమస్య కాబట్టి పెరిగే వయసుతో పాటు చూపు తగ్గి అంతిమంగా అంధత్వం వచ్చేస్తుందనే విషయాన్ని నేను అర్థం చేసుకుని మానసికంగా సిద్ధపడిపోయాను. అలా ఇంటర్ వరకూ బ్రెయిలీలోనే చదివి, డిగ్రీలో అడుగు పెట్టిన తర్వాత ఉస్మానియా వెబ్‌సైట్ ఆధారంగా చదువును కొనసాగించాను. ప్రస్తుతం ఎమ్‌బిఎ సెకండ్ ఇయర్ చదువుతున్నాను.

అమ్మానాన్నల ప్రోత్సాహంతో...

ఒకటో తరగతిలో మొదటిసారిగా బ్లైండ్ స్కూల్‌కు వెళ్తున్నప్పుడు, అమ్మ నన్ను చూసి విపరీతంగా ఏడ్చింది. అప్పటివరకూ సాధారణ బడికి వెళ్లిన నేను అంధులైన పిల్లలతో కలిసి అంధ పాఠశాలకు వెళ్లడం అమ్మ తట్టుకోలేకపోయింది. నేను కూడా అంధ పిల్లల్లా ఉన్న చోటికే పరిమితమైపోతానేమోనని అమ్మ భయపడింది.

> పాటలు పాడే అభిరుచి చిన్నతనంలోనే ఏర్పడింది. నా ఆసక్తిని గ్రహించిన అమ్మ నన్ను వెంటబెట్టుకుని మ్యూజిక్ క్లాస్‌లకు తీసుకువెళ్తూ ఉండేది. ప్రతిమ శశిధర్, కొమండూరి రామాచారి గారి దగ్గర సంగీతం నేర్చుకున్నాను. 2022లో తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ వన్‌లో పాల్గొని, థియేటర్ లెవల్ వరకూ చేరుకోగలిగాను. ప్రస్తుతం ప్రతి రోజూ సంగీతం సాధన చేస్తూ ఉంటాను. పాటలు వింటూ, పాడుతూ వేర్వేరు జోనర్స్ ప్రయత్నిస్తూ ఉంటాను.



కానీ ఎదుగుతున్నకొద్దీ అవన్నీ అర్థం లేని భయాలని ఆమె గ్రహించింది. ఒకవేళ ఎప్పుడైనా కాస్త వెనకబడినట్టు కనిపిస్తే, 'సాధారణ పిల్లల్లాగే నువ్వు కూడా అన్నీ చేయగలుగుతావు' అంటూ అమ్మానాన్నలు నన్ను ప్రోత్సహిస్తూ ఉండేవారు. వాళ్లు నన్నెప్పుడూ ఒక అంధురాలిగా పరిగణించలేదు.

> యువతకు చదువుతో పాటు వినోదం కూడా తప్పనిసరి. అయితే ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం వినోదాన్ని ఎంచుకున్నా, దానికీ పరిమితి ఉండాలి. ఎంత చదివినా, ఎంత ఎదిగినా వినోదం పరిమితంగానే ఉండాలి. అప్పుడే అనుకున్నది సాధించగలుగుతాం!

క్రికెటర్‌గా, కబడ్డీ ప్లేయర్‌గా...

అంధత్వం ఉంది కాబట్టి నేను నా బాల్యాన్ని ఎంజాయ్ చేయలేకపోయానని అనుకుంటే పొరపాటు. నేను అంధులైన పిల్లలతోనే కలిసి పెరిగాను. మేమందరం సాధారణ పిల్లలతో సమానంగా చురుగ్గా అన్ని క్రీడల్లో పాల్గొనేవాళ్లం. ప్రత్యేకించి నేను క్రికెట్ బాగా ఆడేదాన్ని. తెలంగాణా బ్లైండ్ విమెన్ టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఉండేదాన్ని. నేను జాతీయ కబడ్డీ ప్లేయర్‌ను కూడా! అంధులమైనంత మాత్రాన మేం సాధారణ పిల్లలకు ఏమాత్రం తీసిపోము. నిజానికి వాళ్లకంటే ఇంకాస్త మెరుగ్గా ఆడతామనే అనుకోవచ్చు. ఎందుకంటే చూపున్న వాళ్లు చెవులను అంతగా ఉపయోగించరు. అంధులు విషయాలను త్వరగా గ్రహిస్తారు అని అంటూ ఉంటారు. కానీ నిజానికి ఐక్యూ అందరికీ సమానంగానే ఉంటుంది. అయితే మాకు కళ్లు కనిపించవు కాబట్టి వినికిడి శక్తి మీద ఎక్కువగా ఆధారపడతాం. వినికిడి పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుంటాం! వినికిడి శక్తితో పరిసరాలు, పనులు, నైపుణ్యాల మీద పట్టు పెంచుకోగలుగుతాం!"

> "మాది ఖమ్మం. నా చదువు కోసం చిన్నప్పుడే హైదరాబాద్ వచ్చేసి, ఇక్కడే స్థిరపడిపోయాం. నాన్న కొండలరావు, కారు నడుపుతారు. అమ్మ మాధవి, గృహిణి. సంగీతంలో అమ్మ నన్ను ప్రోత్సహిస్తే, నాన్న నన్ను చదువులో ప్రోత్సహించారు. నా కాళ్ల మీద నేను నిలబడి, ఎవరి మీదా ఆధారపడకుండా స్వతంత్రంగా బతకాలన్నది అమ్మానాన్నల ఆకాంక్ష. ఎదుటివాళ్లకు సహాయపడేలా ఎదగాలనీ, చేయి చాపే పరిస్థితి ఉండకూడదనీ నాన్న అంటూ ఉంటారు. ప్రస్తుతం నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎదగాలన్నది నా లక్ష్యం."

• గోగుమళ్ల కవిత

పోషకాహారం

గుడ్లు తింటున్నారా...



కోడి గుడ్డు మంచి మంచి పోషకాహారం. రోజుకు ఒకటైనా తినాలని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని విటమిన్లు, మినరల్స్ శరీరాన్ని దృఢంగా ఉంచుతాయి. ఉదయం అల్పాహారంలో ఉడికించిన గుడ్లను చేర్చుకోవడం వల్ల రోజంతా అలసట లేకుండా ఉంటుంది. ఆర్నెల్ల పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ గుడ్లను ఆహారంగా తీసుకోవచ్చు.

- గుడ్డు తెల్లసొనలో అత్యధికంగా ప్రోటీన్లు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన తొమ్మిది రకాల అమినో యాసిడ్లను అందిస్తాయి. పచ్చసొనలో ఎ, డి, ఇ, బి 6, బి 12 విటమిన్లతోపాటు ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, అయోడిన్, కెరోటిన్లు ఉంటాయి. ఇవి శరీరానికి పోషణనివ్వడంతోపాటు వ్యాధులు రాకుండా కాపాడతాయి.
- ఉదయాన్నే గుడ్లు తింటే వాటిలోని పిండిపదార్థాలు కడుపు నిండిన భావనను కల్గిస్తాయి. తొందరగా ఆకలి అనిపించదు. దీనివల్ల మనం తీసుకునే క్యాలరీలు తగ్గి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. రాత్రిపూట తింటే హార్మోన్లు సక్రమంగా పనిచేస్తాయి.
- గుడ్లను తినడం వల్ల బీటైన్, కోలిన్ అనే అరుదైన పోషకాలు లభిస్తాయి. ఇవి గర్భిణులకు, బాలింతలకు అత్యవసరం. మెదడు పనితీరుని మెరుగుపరచి జ్ఞాపక శక్తిని పెంచుతాయి. గుండె వ్యాధులు, పక్షవాతం, థైరాయిడ్ రాకుండా చేస్తాయి.
- మధుమేహం, బీపీ, కాలేయ సమస్యలు, కిడ్నీ వ్యాధులు, అనారోగ్యంతో మంచాన ఉన్నవారు ఉడికించిన గుడ్లను మితంగా తీసుకోవచ్చు. గుడ్లు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికి రోజుకి మూడు కంటే ఎక్కువ తినకూడదు.

సౌందర్యం

పెదాలు పగులుతున్నాయా..!


చలికాలంలో పెదాలు పొడిగామారి పగిలి రక్తమోడుతూ ఇబ్బంది పెడుతుంటాయి. ఒక్కోసారి లిప్‌బామ్ కూడా పని చేయదు. ఇలా కాకుండా ఇంట్లో ఉండేవాటితోనే పెదాలను మృదువుగా ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

- చలికాలంలో దాహమనిపించదు కాబట్టి నీళ్లు తక్కువగా తాగుతారు. దీనివల్ల శరీరంలో నీటిశాతం తగ్గి పెదాలకు తేమ అందదు. అందుకే పెదాల మీద చర్మం నల్లగా పెళుసుగామారి పగులుతుంది. దాహంగా లేకపోయినా రెండు గంటలకోసారి కనీసం గ్లాసు నీళ్లు తప్పకుండా తాగాలి. తరచూ పేరిన నెయ్యి, వెన్న, కొబ్బరినూనె రాస్తుంటే పొడిబారకుండా ఉంటాయి.
- ఒక గిన్నెలో చెంచా చొప్పున పంచదార, తేనె, బాదం నూనె వేసి, బాగా కలిపి ఆ మిశ్రమాన్ని పెదాలపై మృదువుగా రుద్దాలి. పెదాలపై మృత కణాలన్నీ తొలగిపోయి రక్త ప్రసరణ జరిగి పగుళ్లు పోతాయి.
- పొడిబారిన పెదాలను నాలుకతో మాటిమాటికి తడపకూడదు. దీనివల్ల సమస్య మరింత పెరుగుతుంది. గులాబీ రేకులను పాలలో నానబెట్టి, మెత్తగా నూరి, ఆ మిశ్రమాన్ని పెదాలకు పట్టిస్తే వాటికి తగినంత తేమ లభిస్తుంది.
- చలికాలంలో రసాయనాలతో కూడిన లిప్‌స్టిక్‌లను వాడకూడదు. తప్పనిసరిగా వాడాల్సివస్తే ముందుగా పెదాలపై వేసలిన్ లేదా కొబ్బరినూనె రాసి ఆ తరవాతనే లిప్‌స్టిక్ వేసుకోవాలి. తరచూ కొత్తిమీర రసం లేదా బీట్‌రూట్ రసం రాస్తుంటే పెదాలు సహజసిద్ధంగానే ఎరుపు రంగులోకి మారతాయి.



- ఒక బౌల్‌లో రెండు చెంచాల తేనె, ఒక చెంచా దానిమ్మ రసం కలిపి ఫ్రిజ్‌లో అరగంట ఉంచాలి. తరవాత ఆ మిశ్రమాన్ని పెదాలమీద మెల్లగా రుద్దాలి. అరగంట తరవాత మంచి నీళ్లతో కడగాలి. ఇలా తరచూ చేస్తుంటే పెదాలు మృదువుగా మారతాయి.
- పెదాలు పగిలి నల్లగా మారినపుడు గ్లిజరిన్ మంచి మందులా పని చేస్తుంది. అయిదు చెంచాల నిమ్మ రసానికి ఒక చెంచా గ్లిజరిన్ కలిపి దాన్ని రాత్రి పడుకునే ముందు పెదాలకు రాయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడగాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తే పెదాలు ఆరోగ్యంగా ఉంటాయి.

నవ్య | చిత్రజ్యోతి



లక్నోలో గేమ్‌ఛేంజర్ ఈవెంట్

చెన్నైకు చెందిన ఆదిత్యరామ్ గ్రూపు అధినేత, సినీ నిర్మాత ఆదిత్యరామ్‌తో కలిసి భవిష్యత్‌లో స్ట్రెయిట్ తమిళ చిత్రాలను నిర్మిస్తానని నిర్మాత దిల్ రాజు ప్రకటించారు. శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'గేమ్ ఛేంజర్' చిత్రం తమిళ వెర్షన్‌ను ఆదిత్యరామ్‌తో కలిసి దిల్ రాజు ఎస్‌వీసీ ఆదిత్యరామ్ మూవీస్ పతాకంపై నిర్మించారు. ఈ చిత్రం వివరాలను మంగళవారం ఆదిత్యరామ్ స్టూడియోలో జరిగిన విలేకరుల సమావేశంలో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. 'ఈ నెల 9వ తేదీన లక్నో వేదికగా 'గేమ్ ఛేంజర్' టీజర్‌ను రిలీజ్ చేస్తున్నాం. ఆ తర్వాత అమెరికాలోని డల్లాస్, చెన్నై, జనవరి మొదటి వారంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించి, జనవరి 10న చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం. 'ఆర్ఆర్ఆర్' మూవీతో రామ్ చరణ్ గ్లోబెల్ స్టార్‌గా మారిపోయారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంలో ఒక మంచి సామాజిక అంశంతో పాటు భారీ కమర్షియల్ హంగులు కూడా ఉన్నాయి' అని తెలిపారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

పాట్నాతో ప్రమోషన్స్‌కు శ్రీకారం



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప.. ద రూలర్'. రష్మిక హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా ఐటెమ్ సాంగ్ మినహా పూర్తయిన సంగతి విదితమే. 'పుష్ప' పార్ట్ వన్‌లో 'ఊ అంటావా మావ' అనే ఐటెమ్ సాంగ్ అందరినీ ఓ ఊపు ఊపేసింది. ఇప్పుడు 'పుష్ప 2' కోసం దానిని మించేలా ఓ సాంగ్ సిద్ధం చేశారు. అల్లు అర్జున్, శ్రీలీలపై బుధవారం నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. గణేశ్ ఆచార్య నృత్య దర్శకుడు. సినిమా ప్రమోషన్స్ ఈ నెల 16 నుంచి పాట్నాతో ప్రారంభిస్తున్నట్లు చిత్ర నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ చిత్రజ్యోతికి చెప్పారు. కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు కూడా ఆయన చెప్పారు. విడుదలకు ఇంకా నెల రోజుల వ్యవధే ఉండడంతో ప్రచార కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు రవిశంకర్ చెప్పారు. డిసెంబర్ 5న విడుదల కానున్న 'పుష్ప ద రూల్' చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు.

నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా



తెలుగు ప్రజలను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను.. ప్రతి ఒక్కరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉపసంహరించుకుంటున్నట్టు సినీనటి కస్తూరి తెలిపారు. 'ఈ నెల 3న తెలుగు ప్రజలను ఉద్దేశించి నేను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాను. ఆ రోజున నేను మాట్లాడిన ముఖ్యమైన అంశం ఈ వివాదంతో మరుగునపడిపోయింది. రెండు రోజులుగా నాకు అనేక బెదిరింపులు వస్తున్నాయి. ఇవి సమస్యను మరింత తీవ్రతరం చేసేలా ఉన్నాయి. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న మనదేశంలో నేను నిజమైన జాతీయవాదిని. కులమత, ప్రాంతీయభేదాలకు దూరంగా ఉండే నేను తెలుగు ప్రజలతో సత్సంబంధాలను కలిగి ఉన్నాను. ఇది నాకు లభించిన మహాభాగ్యంగా భావిస్తాను. నాయకర్‌లు, కట్టబొమ్మన్‌ల పేరు ప్రఖ్యాతులు, త్యాగరాజ కీర్తనలను వింటూ పెరిగాను. నా తెలుగు సినీ ప్రయాణాన్ని ఎంతగానో గౌరవిస్తాను. తెలుగు ప్రజలు నాకు పేరు ప్రఖ్యాతులతోపాటు మంచి ప్రేమాభిమానాలను కూడా పంచారు' అని మంగళవారం 'ఎక్స్'లో ఆమె పేర్కొన్నారు. కాగా, చెన్నై ఎగ్మోర్ పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

అందుకే వేడుకలా నిర్వహిస్తున్నాం

అల్లు అరవింద్



'వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తండేల్ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించడం మాకు ఎంతో ప్రత్యేకమైన విషయం. అందుకే రిలీజ్ ప్రకటించే కార్యక్రమాన్ని ఒక వేడుకలా నిర్వహిస్తున్నాం' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ఆయన సమర్పణలో చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. బన్నీవాస్ నిర్మాత. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ 'సినిమా అంటే ఇలానే తీయాలి అనేలా 'తండేల్' ఉండబోతోంది. ఇది మామూలు సినిమా కాదు. శ్రీకాకుళంలోని కొందరు మత్స్యకారుల జీవితం, వారి కష్టం మొత్తం దేశం దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేసినా పండగే అవుతుంది. మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. బన్నీ వాస్‌తో మరోసారి పనిచేయడం ఆనందాన్నిచ్చింది. నన్ను తెరపైన బాగా చూపించేందుకు చందు చాలా కష్టపడ్డాడు. సాయిపల్లవి సినిమాలోని అన్ని పాత్రల గురించి ఆలోచించి బాగా సపోర్ట్ చేశారు' అని చెప్పారు. సాయిపల్లవి మాట్లాడుతూ 'అల్లు అరవింద్‌గారు నన్ను సొంత కూతురిలా చూసుకుంటారు. నా సినిమా హిట్టయినా, నాకు ఏదైనా అవార్డు వచ్చినా ఆయన ఎంతో సంతోషిస్తారు. 'తండేల్' కోసం మేమంతా చాలా కష్టపడ్డాం. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు. 'అక్కినేని అభిమానులందరూ కాలర్ ఎగురవేసే సినిమా ఇది. సాయిపల్లవి క్వీన్ ఆఫ్ ద బాక్సాఫీస్. ఈ చిత్రం తప్పకుండా వంద కోట్ల క్లబ్‌లో చేరుతుంది' అని బన్నీవాస్ చెప్పారు. 'తండేల్' మంచి వసూళ్లను సాధించడంతో పాటు ప్రేక్షక హృదయాలను కొల్లగొడుతుందనే నమ్మకం ఉందని చందు మొండేటి తెలిపారు.



గాయం ఇబ్బంది పెడుతోంది

టాలీవుడ్ హీరోయిన్ చాందిని చౌదరి కొన్ని రోజులుగా గాయంతో బాధపడుతున్నారు. దాంతో కొన్నాళ్లు షూటింగులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని చాందిని స్వయంగా తన ఇన్‌స్టా అకౌంట్‌లో పోస్ట్ చేశారు. 'కొన్నాళ్ల క్రితం నాకు ఓ గాయమైంది. దాన్ని పెద్దగా పట్టించుకోకుండా షూటింగ్స్‌లో పాల్గొన్నాను. ఇప్పుడు ఆ గాయం తిరగబెట్టింది. షూట్ కోసం వెళ్తుంటే మరింత నొప్పిగా అనిపిస్తోంది. దీంతో అన్నింటికీ కొన్నాళ్లు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను' అని ఆ పోస్టులో చాందిని పేర్కొన్నారు. 'కలర్ ఫొటో' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న చాందిని.. గామి, మ్యూజిక్ షాప్ మూర్తి, యేవమ్ చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం బాలకృష్ణ కొత్త సినిమాలో నటిస్తున్నారు.



కెనడాలో హిందువుల భారీ ర్యాలీ

న్యూఢిల్లీ, నవంబరు 5: హిందూ ఆలయాలపై పదేపదే జరుగుతున్న దాడులకు నిరసనగా కెనడాలోని బ్రాంప్టన్ నగరంలోని హిందూ సభా మందిర్ దగ్గర వేలాది మంది హిందువులు సోమవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. కెనడా ప్రజా ప్రతినిధులు, దర్యాప్తు సంస్థలు ఖలిస్థానీలకు మద్దతు ఇవ్వవద్దని కోరారు. ఇదిలా ఉండగా, కెనడాలో హిందూ ఆలయంపై దాడికి నిరసనగా ఢిల్లీలో యునైటెడ్ హిందూ ఫ్రంట్, రాష్ట్రవాదీ శివసేన మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించాయి. కెనడాలో హిందూ దేవాలయాలపై ఇటీవల జరిగిన దాడులపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆ దేశ రాజకీయాల్లో అతివాద శక్తులకు స్థానం ఇస్తున్నారనడానికి ఈ ఘటనలే నిదర్శనమన్నారు.

రాజకీయాలకు పవార్ గుడ్‌బై!

- బారామతిలో 'రిటైర్మెంట్' సంకేతాలు
- ఇక ఏ ఎన్నికల్లో పోటీచేయను.. రాజ్యసభకు వెళ్లడంపైనా పునరాలోచిస్తానని వ్యాఖ్యలు



బారామతి, నవంబరు 5: ఆరు దశాబ్దాలకు పైగా మహారాష్ట్రలో, జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న మరాఠా యోధుడు, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ (84) పార్లమెంటరీ రాజకీయాలకు గుడ్‌బై చెప్పనున్నారా..? తిరిగి రాజ్యసభకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారా..? గత కొద్ది రోజులుగా ఆయన ప్రసంగాలు విన్న వారంతా ఇదే చర్చించుకుంటున్నారు. మంగళవారం బారామతిలో ప్రచారం సందర్భంగా స్వయంగా రిటైర్మెంట్ సంకేతాలు ఇచ్చారు. తన రాజకీయ జీవితానికి ఎక్కడో ఒక చోట ముగింపు పలకాల్సిందేనని వ్యాఖ్యానించారు. మరో ఏడాదిన్నరలో రాజ్యసభ ఎంపీగా తన పదవీకాలం ముగియనుందని.. ఆ తర్వాత మళ్లీ పెద్దల సభలో అడుగుపెట్టాలా వద్దా అనేదానిపై ఆలోచన చేయాల్సి ఉందని, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఆ దిశగా ఆలోచిస్తానని తెలిపారు. 'మీరు (ప్రజలు) నన్ను ఒకసారి కాదు.. రెండు సార్లు కాదు.. నాలుగు సార్లు సీఎంను చేశారు. 1967లో తొలిసారి నన్ను ఎన్నుకున్నారు. 14 సార్లు పోటీచేశాను. మీరు ఏనాడూ నన్ను ఇంటికి పంపించలేదు. ప్రతిసారీ గెలిపించారు. ఇక నేను ఎక్కడో ఒక చోట ఆగిపోవాలి. కొత్త తరాన్ని ముందుకు తీసుకురావాలి. మహారాష్ట్ర కోసం పనిచేయడానికి ముందు బారామతిలో 25 ఏళ్లు ఉన్నాను. తర్వాత స్థానిక అధికారాలన్నీ అజిత్ దాదా(అజిత్ పవార్)కు అప్పగించాను. ఆయన కూడా 25-30 ఏళ్లు ఈ ప్రాంతంలో బాగా పనిచేశారనడంలో సందేహం లేదు. నేనెవరినీ తొక్కివేయలేదు' అని పవార్ అన్నారు.

ఆదివాసీల కోటలో హోరాహోరీ!



ఈ నెల 13, 20 తేదీల్లో ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు

- తలపడుతున్న జేఎంఎం, బీజేపీ కూటములు

న్యూఢిల్లీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13, 20 తేదీల్లో.. రెండు దశల్లో జరగనున్న ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివాసీ, మహిళా ఓటర్లే ఫలితాల్ని నిర్ణయించనున్నారు. ఝార్ఖండ్ జనాభాలో 26.21% మంది ఆదివాసీలు కాగా రాష్ట్రంలోని మొత్తం 81 సీట్లలో 28 సీట్లు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఝార్ఖండ్‌లో ఇప్పటి వరకు 13 మంది ముఖ్యమంత్రులు సీఎం పదవిని చేపట్టగా, వారిలో బీజేపీ నేత రఘుబర్‌దాస్ తప్ప మిగతా వారందరూ ఆదివాసీలే కావడం విశేషం. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 28 ఎస్టీ స్థానాల్లో బీజేపీకి రెండు సీట్లే దక్కగా, జేఎంఎం, కాంగ్రెస్ కలిసి 25 సీట్లు గెలుచుకున్నాయి. ఒక స్థానాన్ని బాబులాల్ మరాండీ నేతృత్వంలోని జేవీఎం దక్కించుకుంది. అనంతర రాజకీయ పరిణామాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్టు చేయడంతో ఆదివాసీ ప్రాంతాల్లో ఆయన పట్ల సానుభూతి పెరిగింది. ఫలితంగా ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎస్టీలకు రిజర్వు అయిన మొత్తం 5 స్థానాల్లో జేఎంఎం, కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. మొత్తమ్మీద ఆదివాసీ ప్రాంతాల్లో జేఎంఎం కూటమి, ఆదివాసీయేతర ప్రాంతాల్లో బీజేపీ కూటమి పట్టు పెంచుకున్నట్లు కనపడుతోంది. ఇది ఝార్ఖండ్‌లో ఆదివాసీ, ఆదివాసీయేతర విభజనకు దారితీసిందని భావిస్తున్నారు.

ఝార్ఖండ్ రాష్ట్రం కోసం ఉద్యమించి, దానిని సాకారం చేసిన శిబు సోరెన్ వారసుడిగా ఆదివాసీల్లో హేమంత్ సోరెన్‌కు గట్టి పట్టుంది. ప్రస్తుత ఎన్నికలను మూలవాసీయులకూ బయటి వారికీ మధ్య పోటీగా హేమంత్ సోరెన్ అభివర్ణిస్తున్నారు. సీఎంగా తాను చేపట్టిన పలు పథకాలను, తీసుకున్న నిర్ణయాలను ఆయన ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. విద్యుత్ బకాయిల రద్దు, ఉచిత విద్యుత్ పంపిణీ, వ్యవసాయ రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను గుర్తు చేస్తున్నారు. మరోవైపు, ప్రకృతిని ఆరాధించే ఆదివాసీలమైన తాము హిందూ మతంలో భాగం కాదని, తాము ఆచరించే సర్నా మతాన్ని ప్రత్యేకంగా గుర్తించాలని హేమంత్ కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులకు వ్యక్తిగత చట్టాలు (పర్సనల్ లా) ఉన్నట్లుగా ఆదివాసీలకు ప్రత్యేకంగా సర్నా కోడ్‌ను తీసుకురావాలని పేర్కొంటున్నారు. ఇక, ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివాసీ ఓటర్లను తన వైపునకు తిప్పుకొనేందుకు బీజేపీ అన్ని రకాలుగా పావులు కదుపుతోంది. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాటుదారుల సమస్యను ప్రధానంగా ప్రస్తావిస్తూ.. ఆదివాసీలకు దక్కాల్సిన ప్రయోజనాలను ముస్లింలు ఎక్కువగా పొందుతున్నారని ఉధృతంగా ప్రచారం చేస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో ఇప్పటికే నాలుగైదుసార్లు పర్యటించిన ప్రధాని మోదీ.. ఆదివాసీలకోసం రూ.79,150 కోట్ల పథకాన్ని ప్రారంభించారు.

బజార్లో చిన్నపిల్లాడిలా మాట్లాడితే ఎలా?

- హోం మంత్రి అనితపై పవన్ వ్యాఖ్యలు దురదృష్టకరం
- దళిత బిడ్డను అవమానించడమే: మంద కృష్ణ మాదిగ

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ తీవ్రంగా స్పందించారు. హోంమంత్రి అనిత విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. ఏమైనా ఉంటే సీఎం వద్ద మాట్లాడుకోవచ్చని.. బజార్లో చిన్నపిల్లాడిలా మాట్లాడితే ఎలాగని ప్రశ్నించారు. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ఆయన సీఎం చంద్రబాబును కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'పవన్ అభిప్రాయం ఎలా ఉన్నా.. ఫలానా శాఖలో సమర్థంగా



సీఎం చంద్రబాబును సత్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ, ఎంఆర్‌పీఎస్ నేతలు

పనిచేయడం లేదంటే అర్థమేంటి? ఇలా మాట్లాడడం ఆ శాఖకు నాయకత్వం వహిస్తున్న దళిత బిడ్డను అవమానించినట్లే! మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రిని అవమానించినట్లే! దీనిని మనసులో పెట్టుకుంటాం' అని తెలిపారు. కేబినెట్ అంటే కుటుంబమని.. ఏవైనా భిన్నాభిప్రాయాలుంటే అక్కడే మాట్లాడుకోవాలన్నారు. 'పవన్ వ్యాఖ్యలు హోం మంత్రిపైనే చేసినట్లు కాదు.. చంద్రబాబు పరిపాలనపైనే చేసినట్లు!. అది ప్రభుత్వానికి నష్టం. మా కులానికి అవమానం. పవన్ శాఖలో రేపు ఏదైనా లోపం జరుగుతుంది.. దానిపై ఇంకో మంత్రి మాట్లాడవచ్చా?' అని ప్రశ్నించారు. ఎన్నికల పొత్తులో టీడీపీ నుంచి మూడు ఎస్సీ సీట్లు తీసుకున్నారని.. వాటిలో ఒక్కటైనా మాదిగలకు ఇవ్వాలని కోరామన్నారు. 'కానీ మూడూ మాలలకు ఇచ్చారు. సామాజిక న్యాయం గురించిమాట్లాడే పవన్ మాదిగలకు ఎక్కడ న్యాయం చేశారు? దీనిపై అసంతృప్తి వ్యక్తం చేశాం. మంత్రివర్గంలో జనసేన మూడు మంత్రిపదవులు తీసుకుంది. అందులో ఒక్కటి కూడా బీసీకి, ఎస్టీకి, ఎస్సీలకు ఎందుకివ్వలేదు? ఇదేం సామాజిక న్యాయం?' అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ అమలు ప్రక్రియ త్వరగా మొదలుపెట్టి వేగంగా పూర్తి చేయాలని సీఎంను కోరినట్లు మంద కృష్ణ మాదిగ చెప్పారు.

కేన్సర్, గుండె సమస్యలకు చెక్

- ఇంటింటికీ వెళ్లి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు
- నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభం

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కేన్సర్, గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అందుకే మొదట్లోనే వాటిని గుర్తించి చికిత్స అందిస్తే.. ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సార్వత్రిక కేన్సర్ పరీక్ష, స్టెమీ (ఎస్టీ-సెగ్మెంట్ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫాక్షన్) కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు బుధవారం ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక కేన్సర్ పరీక్ష, స్టెమీ కార్యక్రమాలపై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. 'సార్వత్రిక కేన్సర్ పరీక్ష కార్యక్రమంలో భాగంగా.. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ పరీక్షల్ని రాష్ట్రవ్యాప్తంగా చేపడతారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఈ పరీక్ష చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు ప్రతి ఇంటికీ వెళ్లి ఈ మూడు కేన్సర్ పరీక్షలు చేస్తారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ సాయంతో కేన్సర్ పరీక్షల ఫలితాల్ని ప్రభుత్వ బోధనాస్పత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవలో భాగస్వాములైన ఆస్పత్రులకు పంపి అక్కడ చికిత్స పొందే ఏర్పాట్లు చేస్తారు.

పల్లె జనాలతో మమేకం కండి

- ట్రైనీ ఏఐఎస్, సీసీఎస్ అధికారులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కాగితాల్లో దొరకవని, క్షేత్రస్థాయిలోనే దొరుకుతాయని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయు డు అన్నారు. మంగళవారం హైదరా బాద్‌లో ప్రత్యేక ఫౌండేషన్ కోర్సుకు హాజరైన ట్రైనీ అఖిల భారత సర్వీసుల అధికారులు, ట్రైనీ కేంద్ర సర్వీసుల అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. 'విధుల నిర్వహణలో నీతి, నిజాయతీ, క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావం అనేవి ముఖ్యం. ఈ ఐదు లక్షణాలను జీవితంలో భాగం చేసుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. ఎంత ఒత్తిడి ఎదురైనా నిజాయతీగానే వ్యవహరించాలని సూచించారు. రాజకీయ బాసులు వారి మాట వినకపోతే మహా అయితే బదిలీ చేస్తారని, అంతకన్నా ఏమీ చేయలేరన్నారు. అధికారిక విధులంటే కార్యాలయాల్లో కూర్చొని కాగితాలపై ఉత్తర్వులివ్వడం కాదని, ప్రజల వద్ద కు వెళ్లి వారి కష్టనష్టాలు చూసి తెలుసుకోవాలని చెప్పారు. అప్పుడే సమస్యలకు తగిన పరిష్కారాలు సాధ్యమని, పరిపాలన కూడా సజావుగా జరుగుతుందని వివరించారు.

మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాకు హైకోర్టు షాక్

- ఆంధ్రజ్యోతి విలేకరి హత్య కేసులో ముందస్తు బెయిల్‌కు నో

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ తుని మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రామలింగేశ్వరరావు(రాజా)కు హైకోర్టు షాక్ ఇచ్చింది. 'ఆంధ్రజ్యోతి' విలేకరి సత్యనారాయణ హత్య కేసులో ముందస్తు బెయిల్‌కు నిరాకరించింది. ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. 'హత్య కేసు దర్యాప్తును పూర్తి చేసి పోలీసులు వేసిన చార్జ్‌షీట్‌ను ట్రయల్ కోర్టు కాగ్నిజెన్స్‌లోకి తీసుకోలేదు. నిందితులకు ఎలాంటి సమన్లూ జారీ చేయలేదు. సంబంధిత చార్జ్‌షీట్ నుంచి పిటిషనర్ పేరును పోలీసులు తొలగించారు. కేవలం అరెస్ట్ చేస్తారనే భయంతో ముందస్తు బెయిల్ పొందలేరు. భయాందోళనతో వేసే ముందస్తు బెయిల్ పిటిషన్‌ను చట్టం అనుమతించదు. హత్య కేసుకి సంబంధించి పోలీసులు కొందరిని పిలుస్తున్నారని పిటిషనర్ చెబుతున్నారు. కానీ, తననే పిలిస్తున్నారని ఆయన చెప్పడం లేదు. తన సోదరుడి హత్య కేసు దర్యాప్తు సక్రమంగా సాగడంలేదని ఫిర్యాదుదారుడు వ్యక్తం చేస్తున్న ఆందోళన.. ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్‌కు కారణం కాకూడదు. హత్య ఘటనకు ముందు.. తనకు ప్రాణహాని ఉందని మృతుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాని ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. అంతిమంగా నేరగాళ్ల చేతుల్లో అతను మరణించారు. ఇలాంటి తీవ్రమైన నేరాల్లో యావజ్జీవం లేదా మరణశిక్ష పడుతుంది. ఎవరినో పోలీసులు స్టేషన్‌కు పిలుస్తున్నారని, ప్రతిపక్షపార్టీ నేతలను అధికారపార్టీ కేసులలో ఇరికించే అవకాశం ఉందనే నిరాధార ఆరోపణలతో పిటిషర్ ముందస్తు బెయిల్ పొందలేరు. ఏ కోణం నుంచి చూసినా ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడు. పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. కాగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, తునిలో 2019 అక్టోబర్‌లో 'ఆంధ్రజ్యోతి' విలేకరి సత్యనారాయణ హత్యకు గురయ్యారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దాడిశెట్టి రాజా, మరో ఐదుగురిని నిందితులుగా చేర్చారు. కానీ, చార్జ్‌షీట్‌లో రాజా పేరు తొలగించారు. మృతుడి సోదరుడు గోపాలకృష్ణ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు.

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ కన్నుమూత

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం

అమరావతి, చీడికాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు... రెడ్డి సత్యం మాస్టారుగా సుపరిచితులైన రెడ్డి సత్యనారాయణ(99) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం పెదగోగాడ గ్రామానికి చెందిన రెడ్డి సత్యనారాయణ ఎస్ఎస్ఎల్సీ చదువుకుని, 1952 నుంచి 1983 వరకూ ఉపాధ్యాయునిగా పనిచేశారు. 1983లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 1983 నుంచి 1999 వరకూ జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో(వరుసగా ఐదుసార్లు) గెలుపొంది రికార్డు సృష్టించారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర హస్త కళల బోర్డు చైర్మన్‌గా కూడా పనిచేశారు. ఆయన సతీమణి నారాయణమ్మ గతంలోనే చనిపోయారు. సత్యనారాయణ మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపం వెలిబుచ్చారు. ఆయన అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, రెడ్డి సత్యనారాయణ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.



కలచివేసింది: చంద్రబాబు

రెడ్డి సత్యనారాయణ మృతి పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం తెలిపారు. 'ఐదుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పని చేసిన సత్యనారాయణ... నిరాడంబరత్వానికి నిలువెత్తు నిదర్శనం. ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన సత్యనారాయణ మృతి తీవ్ర విచారాన్ని కలిగించింది. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' అని చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ ఓ ప్రకటనలో.. 'మంత్రిగా ప్రజలకు చిరస్మరణీయ సేవలు అందించిన సత్యనారాయణ మృతితో నిరాడంబర ప్రజాసేవకుడిని టీడీపీ కోల్పోయింది' అని పేర్కొన్నారు.

సత్యం మాస్టారు నిరాడంబరతకు నిలువుటద్దం

ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఆర్టీసీ బస్సు, రైలులోనే ప్రయాణం

విశాఖపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రెడ్డి సత్యనారాయణ మాస్టారుది విభిన్నమైన జీవన శైలి. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాయకుడు ఆయన. అయినా ఊళ్లో ఎక్కడికి వెళ్లాలన్నా సైకిలే ప్రయాణ సాధనం. జిల్లాలో కార్యక్రమాలకు హాజరవ్వాలంటే ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించేవారు. హైదరాబాద్‌లో జరిగే అసెంబ్లీ సమావేశాలకు వెళ్లడానికి అనకాపల్లి వరకు బస్సులో వచ్చి, అక్కడి నుంచి రైలులో వెళ్లేవారు. కాలికి కిర్రు చెప్పులు, భుజానికి గుడ్డ సంచి, తెల్లటి లాల్చీ పైజామా.. ఇదీ ఆయన ఆహార్యం. అల్లంత దూరం నుంచే ఎవరైనా ఇట్టే గుర్తు పట్టేస్తారు. ఇంకో ఏడాదిలో శత వసంతాలు పూర్తిచేసుకోనున్న ఆయన ఆకస్మికంగా 99వ ఏట మంగళవారం కన్నుమూశారు.

వేర్వేరు జిల్లాల్లో ప్రస్థానం: రెడ్డి రామస్వామినాయుడు, అచ్చాలమ్మ దంపతులకు 1925లో సత్యనారాయణ రెండో సంతానంగా జన్మించారు. కాగా ఎస్ఎస్ఎల్సీ వరకు చదివిన సత్యనారాయణ 1952లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. పెదగోగాడకు చెందిన నారాయణమ్మతో వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. సత్యనారాయణ 1982 వరకు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అదే ఏడాది ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు. 1983లో ఎన్నికల్లో మాడుగుల టీడీపీ అభ్యర్థినిగా అల్లు భానుమతిని ఎంపిక చేశారు. పార్టీలో ఉత్సాహంగా తిరిగే రెడ్డి సత్యనారాయణతో డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేయించారు. ఊహించని విధంగా భానుమతి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో ఆయనే అభ్యర్థి అయ్యారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించాక వెనక్కి తిరిగి చూసుకోలేదు. 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లోనూ గెలిచి 2004 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో ఆయన 1987-89 మధ్య కాలంలో మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రిగా కూడా పనిచేశారు. మూడుసార్లు టీటీడీ బోర్డు సభ్యునిగా చేశారు. ఒకసారి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా పనిచేశా రు. దాదాపు 2 దశాబ్దాలకు పైగా ఎమ్మెల్యేగా పనిచేసినా ఏనాడూ ఆ దర్పం చూపించలేదు. సుదీర్ఘకాలం టీడీపీలో ఉన్న ఆయన... చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు అందులో చేరారు. తరువాత కాంగ్రెస్‌లో చేరి మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి చేశారు.



ఎన్.టి.రామారావుతో రెడ్డి సత్యనారాయణ (ఫైల్)

మేజిస్ట్రేట్ కోర్టులో తేల్చుకోండి

- విదేశాలకు వెళ్లేందుకు అనుమతివ్వాలన్న పిన్నెల్లి పిటిషన్‌పై హైకోర్టు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లేందుకు అనుమతించే వ్యవహారంపై మేజిస్ట్రేట్ కోర్టులోనే తేల్చుకోవాలని వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు స్పష్టం చేసింది. పిన్నెల్లి పిటిషన్‌పై ఈ నెల 30 లోగా నిర్ణయం తీసుకోవాలని మేజిస్ట్రేట్ కోర్టును ఆదేశించింది. ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుల్లో బెయిల్ మంజూరు సందర్భంగా ఆయన పై విధించిన షరతులను మంగళవారం సడలించింది. వారంలో ఓ రోజు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని గతంలో విధించిన షరతును సడలించింది. దర్యాప్తు అధికారికి అందుబాటులో ఉండాలని, ఎప్పుడు కోరితే అప్పుడు హాజరు కావాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. సరెండర్ చేసిన పాస్‌పోర్టును తిరిగి పిటిషనర్‌కు అప్పగించాలని సంబంధిత మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. మేజిస్ట్రేట్ కోర్టు కోరినప్పుడు పాస్‌పోర్టును తిరిగి డిపాజిట్ చేస్తామని హామీ ఇస్తూ రూ.10వేల బాండ్‌తో వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్వాష్ పిటిషన్లు ఉపసంహరించుకున్న వాసంశెట్టి

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం మేజిస్ట్రేట్ కోర్టులో తనపై పెండింగ్‌లో ఉన్న కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో వేసిన క్వాష్ పిటిషన్‌ను కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఉపసంహరించుకున్నారు. మంగళవారం పిటిషన్ విచారణకు రాగా చట్టప్రకారం ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించేందుకు వీలు కల్పిస్తూ వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతివ్వాలని మంత్రి సుభాష్ తరఫున సీనియర్ న్యాయవాది హైకోర్టును అభ్యర్థించారు. న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ పిటిషనర్ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించారు.

ఏబీవీపై ప్రభుత్వ వ్యాజ్యం నిరర్థకం

- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ న్యాయవాది

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌ను తప్పుబడుతూ, ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి వేసిన పిటిషన్ నిరర్థకమైందని ప్రభుత్వ న్యాయవాది మంగళవారం హైకోర్టుకు నివేదించారు. క్యాట్ ఉత్తర్వులకు అనుగుణంగా ఏబీ వెంకటేశ్వరరావు ఈ ఏడాది మే 31న బాధ్యతలు చేపట్టి, అదే రోజు పదవీ విరమణ చేశారని వివరించారు. పిటిషన్‌పై విచారణను మూసివేయాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. అధికారిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ పెండింగ్‌లో ఉన్నాయి కదా? అని ప్రశ్నించింది. ప్రస్తుత పిటిషన్‌కు, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు సంబంధం లేదని న్యాయవాది వివరించారు. దీంతో న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం వ్యాజ్యాన్ని డిస్పోజ్ చేశారు.

మూడు వారాల్లో నిర్ణయం తీసుకోండి

- కుక్కల విద్యాసాగర్ పిటిషన్‌పై కింది కోర్టుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, విజయవాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీపై వేధింపుల కేసులో ప్రధాన నిందితుడు కేవీఆర్ విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌పై 3 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని కింది కోర్టును సుప్రీం కోర్టు ఆదేశించింది. వైసీపీ నేత విద్యాసాగర్, అప్పటి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా, డీసీసీ విశాల్‌గున్నీతోపాటు మరికొందరు తనను వేధింపులకు గురిచేశారని నటి కాదంబరి జెత్వానీ పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో ఇబ్రహీంపట్నం పోలీసులు విద్యాసాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబరు 26న విజయవాడ కోర్టు ఆయన్ను రిమాండ్‌కు తరలించింది. అయితే.. తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ విద్యాసాగర్ హైకోర్టును ఆశ్రయించగా ఈ విషయంలో కలుగజేసుకోబోమని కోర్టు స్పష్టం చేసింది. దీంతో సెప్టెంబరు 28న విద్యాసాగర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ మంగళవారం ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు రాగా.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఇదిలావుంటే, కుక్కల విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు బుధవారానికి వాయిదా వేసింది.

ప్రభుత్వం తరఫున వాదించేందుకు హైకోర్టులో న్యాయవాదుల నియామకాలు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు ఒక ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది, ఇద్దరు ప్రభుత్వ న్యాయవాదులు, 11మంది సహాయ న్యాయవాదులను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) వి.సునీత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాది దొడ్డల యతీంద్రదేవ్ ప్రత్యేక న్యాయవాదిగా నియమితులయ్యారు. కొచ్చర్లకోట రామలింగేశ్వరరావు, ఆర్.కల్యాణ్ చక్రవర్తి జీపీలుగా నియమితులయ్యారు. ఆకుమర్తి పుష్పలీల, రెడ్డి మైత్రేయి, కె.శివ జ్యోతి, పంచాడి అఖిలనాయుడు, యర్రంశెట్టి హరిస్వప్న, రత్న ముదావతు, ఉయ్యూరు రామ్‌మనోహర్, తాడిశెట్టి ఆనందరావు, సోమరాజుపట్నం, పత్సవ లలితాదిత్య, చక్కిలం స్వప్నప్రియ ఏజీపీలుగా నియమితులయ్యారు.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి ఫరూక్, టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, బుచ్చి రాంప్రసాద్‌లు

నా కార్లు అవినాశ్‌రెడ్డి కాన్వాయ్‌లో ఉన్నాయి!

- ఆయన అనుచరులు నన్ను బంధించి చిత్రహింసలు పెట్టారు
- టీడీపీ గ్రీవెన్స్‌లో వైసీపీ బాధితుల మొర

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తన కార్లు వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి కాన్వాయ్‌లో ఉన్నాయని, వాటిని తనకు తిరిగి ఇప్పించాలని తెలంగాణలోని సంగారెడ్డికి చెందిన టి.సతీశ్‌కుమార్ ఆరోపించారు. ఈమేరకు మంగళవారం టీడీపీ ఆఫీసులో నిర్వహించిన ప్రజావేదికలో అర్జీ ఇచ్చారు. 'కడప జిల్లా వేంపల్లి మెడికల్ కాలేజీ ఉద్యోగులకు నా ఐదు కార్లను బాడుగకు పెట్టగా, శ్రీనివాస్ అనే వ్యక్తి మోసం చేశారు. నేను కేసు పెట్టగా, పోలీసులు అతడిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. తీరా కార్లను అప్పగించాలని పోలీసులను కోరితే వైసీపీ నేతలతో మాట్లాడమన్నారు. ఈ విషయంలో వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు తనను బంధించి, చిత్రహింసలు పెట్టారు. వాటిలో రెండు కార్లు అవినాశ్‌రెడ్డి కాన్వాయ్‌లో పెట్టారు. వాటిని ఇప్పించాలి' అని కోరారు. పని చూపిస్తానని తన భార్యను మస్కట్ తీసుకెళ్లి మోసం చేశారని పాలకొల్లుకు చెందిన రాజశేఖర్ వాపోయారు. ప్రజావేదికలో మంత్రి ఫరూక్, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బుచ్చిరాంప్రసాద్ అర్జీలు స్వీకరించారు.



సుహాస్ రాజా కృష్ణమూర్తి ప్రమీల రో ఖన్నా

అమెరికా ఎన్నికల బరిలో 'భారతపౌరులు'

9 మంది భారతీయ అమెరికన్లు పోటీ

వాషింగ్టన్, నవంబరు 5: అమెరికా ప్రతినిధులసభ ఎన్నికల్లో భారత సంతతి పౌరులు తమ సత్తా చాటుతున్నారు. మొత్తం 9 మంది భారతీయ అమెరికన్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరిలో ఐదుగురు సీనియర్ నాయకులు మరోసారి బరిలో నిలిచారు.

సుహాస్ సుబ్రమణ్యన్(38): డెమొక్రాటిక్ అభ్యర్థిగా వర్జీనియా(10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి బరిలో ఉన్నారు. ప్రస్తుతం వర్జీనియా రాష్ట్ర సెనేటర్‌గా వ్యవహరిస్తున్నారు. డెమొక్రాట్లకు బలమైన రాష్ట్రంగా పేరున్న వర్జీనియా నుంచి విజయం దక్కించుకుంటే ఇక్కడి నుంచి గెలిచిన తొలి ఇండియన్ అమెరికన్‌గా సుబ్రమణ్యన్ రికార్డు సృష్టిస్తారు. గతంలో అధ్యక్షుడు ఒబామాకు వైట్ హౌస్ సలహాదారుగా కూడా సుహాస్ ఉన్నారు.

డాక్టర్ అమిబెరా(59): వైద్య వృత్తిలో ఉన్న అమిబెరా సీనియర్ మోస్ట్ ఇండియన్ అమెరికన్ చట్టసభ సభ్యుడు. కాలిఫోర్నియా(6వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. 2013 నుంచి ఆయన విజయం సాధిస్తున్నారు. ఈసారి డెమొక్రాట్లు ప్రతినిధుల సభలో మెజారిటీ దక్కించుకుంటే డాక్టర్ బెరాకు కీలక పదవి దక్కనుంది.

ప్రమీలా జయపాల్(59): డెమొక్రాటిక్ పార్టీలో బలమైన నాయకురాలు. వాషింగ్టన్(7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి మరోసారి ఆమె అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆమె విజయం ఖాయమనే చర్చసాగుతోంది.

రాజా కృష్ణమూర్తి(51): డెమొక్రాటిక్ పార్టీకి చెందిన బలమైన నాయకుడు. 2017 నుంచి ఆయన చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇల్లినాయిస్(8వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి మరోసారి పోటీ చేస్తున్నారు.

రో ఖన్నా(48): 2017 నుంచి కాలిఫోర్నియా(17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడు కూడా ఇక్కడే బరిలో ఉన్నారు.

శ్రీథానేదార్(69): మిచిగాన్(13వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి పోటీ చేస్తున్నారు. ఈయన 2023 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా, ఈ ఆరుగురి గెలుపు ఖాయమని, వారి విజయం నల్లేరుపైనడకేనని పరిశీలకులు చెబుతున్నారు. మరోవైపు, అరిజోనా రాష్ట్ర అసెంబ్లీకి వరుసగా మూడు సార్లు(2018, 2020, 2022) ఎన్నికైన డాక్టర్ అమిష్ షా ప్రస్తుతం అరిజోనా(1వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి ప్రతినిధుల సభకు డెమొక్రాటిక్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. ఇక్కడ నుంచి వరుసగా ఏడుసార్లు విజయం దక్కించుకున్న రిపబ్లికన్ అభ్యర్థి డేవిడ్ ష్వీకెర్ట్‌తో అమిష్ తలపడుతుండడం గమనార్హం. రిపబ్లికన్ పార్టీకి చెందిన డాక్టర్ ప్రశాంత్ రెడ్డి కాన్సాస్(3వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి బరిలో ఉన్నారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన డాక్టర్ రాకేశ్ మోహన్ న్యూజెర్సీ(3వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి బరిలో నిలిచారు. కాగా, డాక్టర్ ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ రాకేశ్ మోహన్‌లకు గెలుపు అవకాశాలు స్వల్పంగా ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

స్థానిక సంస్థల్లోనూ భారత సంతతి!

అమెరికాలోని స్థానిక సంస్థలు, రాష్ట్రాల చట్టసభల ఎన్నికల్లోనూ భారత సంతతి పౌరులు తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. దాదాపు 36 మందికిపైగా ఈ ఎన్నికల్లో తలపడుతున్నారు. అమెరికాల్లో అత్యంత స్వల్పంగా ఉన్న భారత సంతతి పౌరులు ఇలా కీలక ఎన్నికల్లో తలపడుతున్న పరిస్థితి.. వారికి అగ్రరాజ్యం ఎన్నికలపై ఉన్న ఆసక్తిని చాటి చెబుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. కాలిఫోర్నియా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎక్కువ మంది భారత సంతతి పౌరులు పోటీ పడుతున్నారని తెలిపారు. కాలిఫోర్నియాలో దాదాపు 9 లక్షల మంది భారతీయ అమెరికన్లు నివసిస్తున్నారు.

కమల గెలిస్తే చరిత్రే!

(మొదటి పేజీ తరువాయి)



పూర్తవ్వగానే కౌంటింగ్ ప్రారంభమవుతుంది. అయితే.. ముందెన్నడూ లేనివిధంగా సర్వేల అంచనాల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కంటే.. డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్ మధ్య 'నువ్వా-నేనా' అన్నట్లుగా పోటీ కొనసాగింది. తుది సర్వేల్లో మాత్రం కమల స్వల్పంగా ముందంజలో ఉన్నారు. అమెరికా ఎన్నికల్లో అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించే స్వింగ్ రాష్ట్రాల్లో గత నెలాఖరు వరకు కమల వైపు.. ఆ తర్వాత ట్రంప్ వైపు ఓటర్లు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్న సర్వేలు.. ఆదివారం అర్ధరాత్రి విడుదల చేసిన తాజా నివేదికల్లో కమల స్వల్ప ఆధిక్యాన్ని సాధిస్తారని తేల్చేశాయి. ఇక అమెరికా ఎన్నికల విషయంలో అభినవ నాస్ట్రడమస్‌గా పేరున్న అలన్ లిచ్‌మన్ కూడా.. ఈసారి కమలాహ్యారిస్ విజయం తథ్యమని జోస్యం చెప్పారు. 1984 నుంచి ఆయన అంచనాలు 100% నిజమవుతూ వస్తుండడం గమనార్హం..!

తొలి మహిళగా..

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమల ఘనవిజయం సాధించి.. వైట్‌హౌస్‌కు వెళ్తే.. అదో చరిత్ర అని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా చరిత్రలోనే తొలి మహిళా అధ్యక్షురాలిగా ఆమె నిలిచిపోతారంటున్నారు. అంతేకాదు.. ఆఫ్రికా-ఆసియా సంతతికి చెందిన తొలి మహిళా అధ్యక్షురాలు కూడా ఆమేనని వివరిస్తున్నారు. గత నెలాఖరు వరకు సింహభాగం సర్వేలు కమల వైపే ఉండగా.. ఈనెల 1-3 తేదీల్లో మాత్రం స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్ గాలి వీస్తోందని వెల్లడించాయి. సోమవారం అర్ధరాత్రి విడుదలైన తాజా సర్వేల్లో కమల అనూహ్యంగా పుంజుకున్నారు. పోలింగ్ గురు నేట్ సిల్వర్‌కు చెందిన ఫైవ్‌థర్టీఎయిట్ తుది సర్వే ఫలితాల్లో స్వింగ్ రాష్ట్రాల్లో కమల పుంజుకున్నారని, అయితే.. అంచనాలు క్లిష్టంగా ఉన్నాయని వెల్లడైంది. అయితే.. కమల విజయావకాశాలు 50.015శాతంగా ఉన్నట్లు ఈ సర్వే స్పష్టం చేసింది. అదే సమయంలో ట్రంప్ విజయావకాశాలు 49.985శాతానికి దిగజారాయని.. పోటీ మాత్రం హోరాహోరీగా ఉందని పేర్కొంది. తటస్థ ఓటర్లే విజేతల నిర్ణేతలని అభిప్రాయపడింది. పీబీఎస్ న్యూస్-ఎన్‌పీఆర్-మారిస్ట్ సర్వే కూడా కమల 51% విజయావకాశాలతో ముందంజలో ఉన్నట్లు తెలిపింది. ది హ్యారిస్ ఎక్స్-ఫోర్బ్స్ నిర్వహించిన సర్వేలో కమల ముందంజలో ఉన్నట్లు తేలింది. ఆమెకు 49%, ట్రంప్‌నకు 48% మంది మద్దతు తెలిపినట్లు వివరించింది. యాహూ న్యూస్-యూగావ్ కూడా ఇరువురికి చెరో 47% చొప్పున విజయావకాశాలివ్వగా.. మార్నింగ్ కన్సల్ట్, ఎకానమిస్ట్-యూగావ్ సర్వేలు కమలకు 49%, ట్రంప్‌నకు 46% మంది మద్దతున్నట్లు వెల్లడించాయి. రియల్‌క్లియర్ పోలింగ్ సర్వే మాత్రం ట్రంప్ 219 స్థానాల్లో.. కమల 211 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారని పేర్కొంది.

ట్రంప్ న్యాయపోరాటానికి.. 5 వేల మంది లాయర్లు

2020 మాదిరిగా ఫలితాలు తనకు ప్రతికూలంగా వస్తే.. న్యాయపోరాటం చేయాలని ట్రంప్ నిర్ణయించారు. అప్పట్లో ఆయన బైడెన్ ఎన్నిక చెల్లదని, తాను అధికార పీఠం నుంచి దిగేది లేదని భీష్మించుకున్నారు. అయితే.. న్యాయస్థానంలో సరైన ఆధారాలు లేనందున.. జడ్జి ఆయన వ్యాజ్యాన్ని కొట్టివేశారు. ఈసారి అలా జరగకుండా ఉండేందుకు 5 వేల మంది న్యాయవాదులను ట్రంప్ నియమించుకున్నారు.


తెల్లవారుజామునే పోలింగ్ షురూ

అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ మంగళవారం ఆయా రాష్ట్రాల నైసర్గిక స్వరూపం, ఆరు కాలమానాల ఆధారంగా వేర్వేరు సమయాల్లో ప్రారంభమైంది. అమెరికాలో హవాయి, అలస్కా, పసిఫిక్, మౌంటైన్, సెంట్రల్, ఈస్టర్న్ అనే ఆరు కాలమానాలున్నాయి. వీటిల్లో హవాయి-ఈస్టర్న్ కాలమానాల మధ్య వ్యత్యాసం 5 గంటలు. కొన్ని రాష్ట్రాల్లో తెల్లవారుజామున 5 గంటలకు పోలింగ్ ప్రారంభమవ్వగా.. అక్కడి ఓటర్లు 4 గంటల నుంచే క్యూలైన్లలో నిలబడ్డారు. మరికొన్ని రాష్ట్రాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల మధ్యలో పోలింగ్ మొదలైంది. ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనగా.. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఫలితాలు ఎప్పుడు?

అమెరికాలో పోలింగ్ సమయం పూర్తయిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. భారత్ మాదిరిగా అమెరికాలో ఏకకేంద్ర ఎన్నికల కమిషన్ ఉండదు. రాష్ట్రాల వారీగా వేర్వేరుగా ఎన్నికల ఏజెన్సీలుంటాయి. దీంతో.. లెక్కింపులో కొన్ని చోట్ల ఆలస్యం జరగడం సాధారణమే. మంగళవారం అర్ధరాత్రికి సింహభాగం రాష్ట్రాల్లో ఫలితాలు తేలిపోతాయి. అయితే.. కొన్ని రాష్ట్రాల ఫలితాలకు బుధవారం మధ్యాహ్నం వరకు సమయం పడుతుందని అంచనా. అంతేకాదు.. బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక.. మెయిల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాతే మిలటరీ బ్యాలెట్ల లెక్కింపు ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రక్రియలో ఆలస్యం జరిగే అవకాశాలున్నాయి. దాంతో.. ఈ నెల 7 వరకు ఫలితాల కోసం ఉత్కంఠ కొనసాగవచ్చనే అంచనాలున్నాయి. అమెరికాలో 24.5 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. ముందస్తు ఓటింగ్‌లో 8.2 కోట్ల మంది వినియోగించుకున్నారు.

కమలా హ్యారిస్ గెలుపుకోసం తమిళనాట పూజలు



చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కమలాహ్యారిస్ ఘనవిజయం సాధించాలని కోరుకుంటూ ఆమె పూర్వీకుల స్వస్థలమైన తమిళనాడులోని తిరువారూరు జిల్లా తులసేంద్రపురం ఆలయంలో స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరిలోని వారందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కమలాహ్యారిస్ ఫోటోలు ముద్రించిన పోస్టర్లను ఊరంతా అతికించి సందడి చేశారు. కమల తల్లి వైపు తాతముత్తాతలంతా తులసేంద్రపురానికి చెందినవారు. ఈ కారణంగానే అక్కడి ధర్మశాస్తా ఆలయంలో గత రెండు రోజులుగా కమలా హ్యారిస్ అమెరికా అధ్యక్షపీఠాన్ని అధిరోహించాలని కోరుకుంటూ గ్రామస్థులు ప్రత్యేక ప్రార్థనలు కూడా జరిపారు. మదురై జిల్లాలోని పలు ప్రాంతాల్లో కమల గెలుపును కాంక్షిస్తూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోకం తీరు



తొలి ఫలితం 50:50

కేవలం ఆరుగురు ఓటర్లున్న న్యూహ్యాంప్‌షైర్ రాష్ట్రంలోని డిక్స్‌విల్లే నాచ్‌లో మంగళవారం ఉదయమే ఫలితం విడుదలైంది. అమెరికా-కెనడా సరిహద్దుల్లోని ఈ ప్రాంతంలో.. అర్ధరాత్రి దాటగానే పోలింగ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ ఓటర్లలో ముగ్గురు కమలకు.. మరో ముగ్గురు ట్రంప్‌నకు జైకొట్టారు. 2020లో మాత్రం వీరంతా డెమొక్రటిక్ అభ్యర్థి జోబైడెన్‌కు ఓటేశారు. నిజానికి ఈ ప్రాంతంలో ఉన్న ఆరుగురు ఓటర్లలో నలుగురు రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులుగా నమోదు చేసుకున్నారు. మరో ఇద్దరు ఏ పార్టీ తరఫున లేనట్లు చెప్పారు. అయితే.. ట్రంప్ మద్దతున్న నలుగురిలో ఒకరు క్రాస్ ఓటింగ్ వేసినట్లు ఇక్కడి ఫలితాలను బట్టి అర్థమవుతోంది. ఇలా చివరి నిమిషంలో మనసు మార్చుకునే ఓటర్ల వల్ల తమకే లబ్ధి చెందుతుందని కమల మద్దతుదారులు భావిస్తున్నారు.

మంగళవారమే ఎందుకు?

అమెరికా అధ్యక్ష ఎన్నికలు గడిచిన 170 సంవత్సరాలుగా మంగళవారాల్లోనే జరుగుతుంటాయి. ఇందుకు కారణాలున్నాయి. 1845కు ముందు వరకు కూడా రాష్ట్రాలు వేర్వేరుగా.. వేర్వేరు రోజుల్లో ఎన్నికలను నిర్వహించేవి. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతుండడంతో.. 1845 నుంచి నవంబరు నెలలో మొదటి మంగళవారం(ఒకటో తేదీ అయ్యి ఉండకూడదు. ఒకవేళ ఒకటో తేదీ మంగళవారం అయితే.. మొదటి సోమవారం తర్వాతి రోజు నిర్వహిస్తారు) దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం 1792 నాటి ఫెడరల్ చట్టాన్ని సవరించారు. 1845లో చట్టసవరణ జరిగిన నాటికి అమెరికా ఓ వ్యవసాయ దేశం. నవంబరు కల్లా పంటచేతికి వచ్చి, రైతులు ఖాళీగా ఉండే సమయం కావడంతో.. ఈ నెలలో పోలింగ్‌ను నిర్వహించాలనే సంప్రదాయాన్ని పరిచయం చేశారు. అయితే.. ఇటీవలి కాలంలో మంగళవారాల్లో కాకుండా.. వారాంతాల్లో ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ పెరుగుతోంది.

అన్నీ కుదరదు

ప్రైవేటు ఆస్తులన్నింటిపై ప్రభుత్వానికి హక్కు లేదు!

న్యూఢిల్లీ, నవంబరు 5: ప్రభుత్వం ప్రైవేటు ఆస్తుల్ని స్వాధీనం చేసుకునే విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న అన్ని ఆస్తులనూ ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం 8:1 మెజారిటీతో ఈ మేరకు తీర్పు ఇచ్చింది. గతంలో దేశంలో ఆర్థిక పిడివాద సిద్ధాంతాలు ఉండేవని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కానీ, దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే చాలా పరివర్తన చెందిందని గుర్తుచేసింది. 1977లో రంగనాథరెడ్డి వర్సెస్ కర్ణాటక కేసులో ఆర్టికల్ 39(బి) ప్రకారం ప్రైవేటు యాజమాన్యంలోని ఆస్తులన్నీ సామాజిక ఆస్తుల కింద సేకరించే అధికారం ప్రభుత్వాలకు లేదంటూ 4:3 మెజారిటీతో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అయితే నాటి ధర్మాసనంలో సభ్యుడైన జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్ మాత్రం వ్యతిరేక తీర్పు సభ్యుడైన జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్ మాత్రం వ్యతిరేక తీర్పు ఇచ్చారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులన్నింటినీ ప్రజల సంక్షేమం, ప్రయోజనాల కోసం స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. అయితే 1982, 1997ల్లో సంజీవ్ కోక్, మఫత్‌లాల్ ఇండస్ట్రీస్ కేసులను విచారించిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనాలు జస్టిస్ అయ్యర్ అభిప్రాయాలపై ఆధారపడి తీర్పులు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో అన్ని ప్రైవేటు ఆస్తులను ఉమ్మడి ప్రయోజనాల కోసం స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంటుందా? అనే అంశంపై 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. తాజా ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు న్యాయమూర్తులు హృషికేశ్ రాయ్, బీవీ నాగరత్న, సుధాన్షు ధులియా, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రా, రాజేశ్ బిందాల్, సతీశ్‌చంద్ర శర్మ, ఏజీ మాసిహ్‌లు ఉన్నారు. జస్టిస్ సుధాన్షు ధులియా మాత్రం ఈ తీర్పును వ్యతిరేకించారు. జస్టిస్ బీవీ నాగరత్న మెజారిటీ సభ్యుల తీర్పును పాక్షికంగా వ్యతిరేకించారు. అదేసమయంలో జస్టిస్ కృష్ణ అయ్యర్‌పై సీజేఐ చేసిన వ్యాఖ్యల పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. జస్టిస్ ధులియా కూడా సీజేఐ వ్యాఖ్యలు సరికాదని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బి) ప్రకారం.. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను సమాజ వనరులుగా పరిగణించవచ్చా? అన్న కీలక కేసుపై కొద్ది నెలల క్రితం సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఈ వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసు ఆర్టికల్ 31(సి)కి సంబంధించినదని.. ప్రభుత్వ విధానాల అమలు కోసం చేసే చట్టాలకు ఇది రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 31(సి) రక్షణ పరిధిలోకి ఆర్టికల్ 39(బి) కూడా వస్తుందని తెలిపింది. సామాజిక ఆస్తులను ఉమ్మడి ప్రయోజనాల కోసం అత్యుత్తమ రీతిలో వినియోగించేలా ప్రభుత్వం తన విధానాలను రూపకల్పన చేయాలని ఆర్టికల్ 39(బి) నిర్దేశిస్తోంది. అయితే ఆర్టికల్ 39(బి)లో పేర్కొన్నట్లుగా సామాజిక ఆస్తులంటే ప్రైవేటు యాజమాన్యంలోనివి కూడానా? అంటే.. సిద్ధాంతపరంగా అవుననే సమాధానమే వస్తుందని సీజేఐ పేర్కొన్నారు. కానీ, ఈ విషయాన్ని వివరించడంలో జస్టిస్ అయ్యర్ విఫలమయ్యారన్నారు. ప్రైవేటు ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని చెప్పే మొండి ఆర్థిక సిద్ధాంతమే రాజ్యాంగబద్ధ ప్రభుత్వానికి ఆధారమని జస్టిస్ కృష్ణ అయ్యర్ పేర్కొనడం సరికాదని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. ఆయన సిద్ధాంతం రాజ్యాంగ విశాల స్ఫూర్తికి విరుద్ధం, హానికరమని వ్యాఖ్యానించారు. వ్యక్తులకు చెందిన ప్రతి ఆస్తినీ సామాజిక ఆస్తిగా పరిగణించకూడదని.. ప్రజాప్రయోజనాలకు అవసరమైన దాన్ని మాత్రమే సేకరించాలని స్పష్టం చేశారు.

సీజేఐ వ్యాఖ్యలు అవాంఛనీయం

ప్రైవేటు ఆస్తుల విషయంలో సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తీర్పుతో జస్టిస్ బీవీ నాగరత్న పాక్షికంగా విభేదించారు. అయితే జస్టిస్ అయ్యర్‌పై సీజేఐ వ్యాఖ్యలు సరికాదన్నారు. ఈ మేరకు ఆమె విడిగా రాసిన 130 పేజీల తీర్పులో పలు వ్యాఖ్యలు చేశారు.
నాటి(1977లో) పరిస్థితులకు అనుగుణంగా జస్టిస్ అయ్యర్ ప్రభుత్వ విధానాలకు విస్తృత ప్రాధాన్యమిచ్చి, ప్రైవేటు ఆస్తుల సేకరణపై ప్రభుత్వానికి హక్కు ఉంటుందని తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన మానవతావాది అని, క్రిమినల్ జస్టిస్‌లో చేపట్టిన సంస్కరణలు ఎనలేనివని తెలిపారు. 'బెయిల్ అనేది నిబంధన.. జైలు అనేది మినహాయింపు' అనేది జస్టిస్ అయ్యర్ చేసిన వ్యాఖ్య అని.. దాన్ని ఇప్పటికీ సుప్రీంకోర్టు జడ్జిలు అనుసరిస్తున్నారని గుర్తుచేశారు. ఆయన ఆర్థిక సిద్ధాంతం రాజ్యాంగ విశాల స్ఫూర్తికి హానికరమన్న సీజేఐ వ్యాఖ్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.



మదర్సాలకు ఊరట

యూపీ మదర్సా చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, నవంబరు 5: మదర్సాల్లో నాణ్యమైన విద్యను బోధించేలా, అర్హులైన ఉపాధ్యాయులను నియమించేలా, పరీక్షలు నిర్వహించేలా చూసేందుకు యూపీ సర్కారు 2004లో రూపొందించిన 'ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్ 2004' రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని 14, 21ఏ అధికరణలకు, లౌకిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టేస్తూ ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. విద్య నాణ్యతను నియంత్రించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని.. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాతో కూడిన ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ చట్టం రాష్ట్రప్రభుత్వ శాసనాధికార పరిధిలోనే ఉందని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉమ్మడి జాబితాలోని అంశాల్లో 25వది విద్య అని గుర్తుచేసింది. అయితే.. మదర్సాల్లో ఉన్నతవిద్యకు సంబంధించి ఇచ్చే 'ఫాజిల్(డిగ్రీతో సమానం)', 'కామిల్ (పీజీతో సమానం)' మాత్రం యూజీసీ చట్టానికి, కేంద్ర జాబితాలోని 66వ అంశానికి విరుద్ధమని, కాబట్టి వాటిని రాజ్యాంగ విరుద్ధంగా పరిగణించవచ్చని వ్యాఖ్యానించింది. 2004లో యూపీ సర్కారు చేసిన ఈ చట్టం కింద.. ఉత్తరప్రదేశ్‌లోని ఒక మదర్సాలో పార్ట్‌టైమ్ అసిస్టెంట్ టీచర్‌గా చేరిన మహ్మద్ జావేద్ అనే వ్యక్తి.. తన సర్వీసును క్రమబద్ధీకరించాలంటూ 2019లో అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. అతడి పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి.. లౌకిక రాజ్యాంగాన్ని అనుసరిస్తున్న దేశంలో, విద్య కోసం ఏర్పాటు చేసిన బోర్డులో ఒక నిర్దిష్ట మతానికి చెందిన వ్యక్తులను మాత్రమే నియమించడమేమిటనే ప్రశ్న లేవనెత్తి, ఈ పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేశారు. దీనిపై అలహాబాద్ హైకోర్టు సీజే ఇద్దరు సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలోనే.. అసలు ఈ మదర్సా చట్టమే రాజ్యాంగ విరుద్ధమంటూ అన్షుమాన్ సింగ్ రాథోడ్ అనే అడ్వొకేట్ హైకోర్టులో ఒక పిటిషన్ వేశారు. ఆ పిటిషన్లన్నింటినీ కలిపి విచారించిన ద్విసభ్య ధర్మాసనం.. మదర్సా చట్టం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ దాన్ని కొట్టేసింది. "మతపరమైన విద్య కోసం (లేదా) ఒక ప్రత్యేకమైన మతం/విధానానికి సంబంధించిన పాఠశాల విద్య కోసం బోర్డును ఏర్పాటు చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదు" అని తీర్పులో పేర్కొంది. రాష్ట్రంలోని 16 వేలకు పైగా మదర్సాల్లో విద్యాభ్యాసం చేస్తున్న 17 లక్షల మంది విద్యార్థులను సాధారణ పాఠశాలల్లో చేర్చాలని సూచించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ పలువురు వ్యక్తులు, పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కాగా.. మదర్సా చట్టాన్ని వ్యతిరేకిస్తూ 'జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్)' కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యింది. నాణ్యమైన విద్యను మదర్సా ఎడ్యుకేషన్ తిరస్కరిస్తోందని వాదించింది. మతపరమైన విద్యను అభ్యసించే హక్కు ఎవరికైనా ఉందని.. కానీ, ఆ విద్యను ప్రధాన స్రవంతి విద్యకు ప్రత్యామ్నాయంగా మాత్రం అంగీకరించకూడదని పేర్కొంది. ఇక.. సుప్రీం తీర్పును ముస్లిం మత సంస్థలకు చెందిన పెద్దలు, బీఎస్పీ అధినేత్రి మాయావతి, సమాజ్‌వాదీ పార్టీ నేతలు స్వాగతించారు.

25 నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబరు 25 నుంచి డిసెంబరు 20 వరకు జరగనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ సమావేశాల్లో భాగంగా రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సంవిధాన్ సదన్(పార్లమెంట్ పాత భవనం) సెంట్రల్ హాల్ ఇందుకు వేదిక కానుందని వెల్లడించారు. ఈ సమావేశాల్లోనే కేంద్రం ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. గత సమావేశాల్లోనే కేంద్రం వక్ఫ్ బిల్లును తీసుకువచ్చింది. అయితే.. భాగస్వామ్య పక్షాలు, విపక్ష పార్టీల డిమాండ్ల మేరకు సమగ్ర చర్చకుగాను బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. కాగా, ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయాలని, దేశ వ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని ఈ సమావేశాల్లో ప్రతిపక్షాలు డిమాండ్ చేసే అవకాశం ఉంది.

మళ్లీ 'భారత్' బ్రాండ్ అమ్మకాలు

- గోధుమ పిండి కేజీ రూ.30, బియ్యం కేజీ రూ.34

న్యూఢిల్లీ, నవంబరు 5: భారత్ బ్రాండ్ కింద రెండో దశ సరుకుల విక్రయాలను కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. ఇందులో భాగంగా నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్, ఈ కామర్స్ సంస్థల ద్వారా గోధుమ పిండిని, బియ్యాన్ని సబ్సిడీ ధరలకు ప్రజలకు అందిస్తారు. కేజీ గోధుమ పిండి రూ.30లు, కేజీ బియ్యం రూ.34ల చొప్పున 5 కేజీలు, 10 కేజీల ప్యాకెట్ల రూపంలో వాటిని విక్రయిస్తారు. రెండో దశ విక్రయాల కోసం 3,69,000 టన్నుల గోధుమలను, 2,91,000 టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐ సేకరించిందని, అవసరమైతే సరుకులను మళ్లీ సేకరిస్తామని కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.

మొరాయించిన ఈసీ వెబ్‌సైట్

- ఆన్‌లైన్‌లో నిలిచిన పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ
- నేటితో ముగియనున్న గడువు... పొడిగించాలని డిమాండ్

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ వేళ ఎన్నికల సంఘం వెబ్‌సైట్ మొరాయించింది. దీంతో ఓటు నమోదు చేసుకోలేక పలువురు గ్రాడ్యుయేట్లు ఇబ్బంది పడ్డారు. ఆరంభం నుంచీ అడపాదడపా ఈ సమస్య తలెత్తుతూనే ఉంది. ఆదివారం నుంచి మంగళవారం వరకూ వెబ్‌సైట్ పూర్తి స్థాయిలో పనిచేయలేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం ఆఖరి రోజు కావడంతో నమోదు గడువును పొడిగించాలని డిమాండ్లు వస్తున్నాయి. పట్టభద్ర ఓటర్ల నమోదు ప్రక్రియపై ఎన్నికల అధికారులు ఏ మాత్రం దృష్టి పెట్టలేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వెబ్‌సైట్ సమస్య తెలియకపోవడంతో పలువురు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రయత్నించారు. అన్ని వివరాలనూ పూర్తి చేసిన తరువాత వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. కొద్ది మంది మాత్రం ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసి ఆయా జిల్లాల్లోని ఎన్నికల అధికారులకు, బీఎల్‌ఓలకు అందజేశారు. మరోవైపు దిగువ స్థాయి అధికారులకు స్పష్టత లేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనేక మందికి ఫోన్లలో సంక్షిప్త సమాచారం రాలేదు. దీంతో దరఖాస్తు ఆమోదించారో లేదో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. బుధవారంతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ గడువు ముగియనుంది. పై సమస్యల నేపథ్యంలో గడువును పొడిగించాలని.. కింది స్థాయిలో అధికారులు ఓటర్ల నమోదు ప్రక్రియపై పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, ఓటర్ల నమోదు చురుకుగా జరగడానికి ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టభద్రులు డిమాండ్ చేస్తున్నారు.

గడువు పెంచాలి: మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ

పట్టభద్రుల ఓటర్ల నమోదు గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ కోరారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కృష్ణా - గుంటూరు, తూర్పు - పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గాల్లో పట్టభద్రుల ఓటర్ల నమోదుకు బుధవారం చివరి రోజుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. అయితే నమోదు మెల్లగా సాగుతోంది. అందువల్ల ఈ గడువును పెంచాలి' అని ఆయన కోరారు.

స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే.. ఎల్లప్పుడూ ప్రభుత్వ వ్యతిరేక తీర్పులని కాదు



న్యూఢిల్లీ, నవంబరు 5: స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే అర్థం.. ఎల్లప్పుడూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులివ్వాలని కాదని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఒక ఆంగ్ల పత్రిక ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియాను ఉపయోగించుకొని కోర్టులపై ఒత్తిడి తేవడం ద్వారా అనుకూలమైన తీర్పులు పొందేందుకు 'ప్రెజర్ గ్రూపులు' ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. 'సంప్రదాయకంగా స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే కార్యనిర్వాహక వ్యవస్థ నుంచి స్వతంత్రంగా ఉండడమనే నిర్వచనం ఉంది. ఇప్పుడు స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే ప్రభుత్వం నుంచి కూడా స్వతంత్రత అని అర్థం. అయితే, చాలా ప్రెజర్ గ్రూపులు జడ్జిల నిర్ణయం తమకు అనుకూలంగా వచ్చినప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉందని అభివర్ణిస్తుంటాయి. అనుకూలంగా రాకపోతే స్వతంత్రత లేదంటున్నాయి. నా అభ్యంతరం ఇదే. స్వతంత్రంగా ఉండటం అంటే.. తన మనస్సాక్షి ఏమి చెబుతోందో ఆ ప్రకారమే జడ్జి స్వతంత్రంగా నిర్ణయించాలి. ఆ మనస్సాక్షి కూడా చట్టం, రాజ్యాంగం మార్గదర్శకంలో ఉండాలి' అని తేల్చిచెప్పారు.

నేరం ఎంతో అంతే శిక్ష పడుతోందా?

ఏకపక్ష తీర్పులను సమీక్షించే యోచనలో కేంద్రం

- విధాన రూపకల్పనలో న్యాయశాఖ
- డిసెంబరులో సుప్రీంకోర్టుకు నివేదన

న్యూఢిల్లీ, నవంబరు 5: న్యాయ సంస్కరణలను చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం... నేరం- శిక్ష విషయంలో హేతుబద్ధత లోపించిన తీర్పులను పునఃసమీక్షించాలని యోచిస్తోంది.. చేసిన నేరం తీవ్రతతో సంబంధం లేకుండా న్యాయమూర్తులు అప్పుడప్పుడు ఏకపక్షంగా ఇస్తున్న తీర్పులు న్యాయవర్గాలనే విస్మయానికి గురిచేస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో ఆ తరహా తీర్పులను అవసరమైతే నిలుపుదల చేసేందుకు ఉన్న మార్గాలను కేంద్రం అన్వేషిస్తోంది. దీనిపై వచ్చే డిసెంబరులో ఒక విస్పష్ట విధానాన్ని సుప్రీంకోర్టు ఎదుట కేంద్ర న్యాయశాఖ ప్రతిపాదించనుంది. బిహార్‌లో ఓ కోర్టు బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని కేవలం 30 నిమిషాలు విచారించి మరణశిక్ష విధించింది. ఈ వ్యవహారం 2022లో తీవ్ర కలకలం రేపింది. ప్రజాగ్రహానికి కారణమైన ఈ కేసులో ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని ఆ తీర్పును సవరించింది. న్యాయమూర్తిని ట్రైనింగ్‌కు పంపాలని అప్పట్లో ఆదేశాలు కూడా జారీచేసింది. ఇదే అంశాన్ని విచారిస్తున్న సుప్రీంకోర్టు.. దీనిపై తన నిర్ణయం తెలియజేయాల్సిందిగా కేంద్రాన్ని ఈ ఏడాది మే నెలలో కోరింది. ఈ మేరకు నిర్దిష్ట విధానంతో కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టు ముందుకు వెళ్లనుంది. ఏకపక్ష, నిర్హేతుక తీర్పుల పద్ధతిని నిరోధించే లక్ష్యంతో, శిక్షాస్మృతిలోని నిబంధనలను సవరించే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దిగువ కోర్టులకు చిన్నచిన్న శిక్షలు విధించే అధికారం మాత్రమే ఉండాలని ప్రతిపాదిత విధానంలో కేంద్రం సూచించినట్టు తెలిసింది. పోక్సో కేసులపై దిగువ కోర్టులు తీవ్రంగా స్పందిస్తున్న తీరును కేంద్ర న్యాయశాఖ నిశితంగా పరిశీలిస్తోంది. మధ్య భారతంలోని ఓ న్యాయస్థానం పోక్సో కేసులో నిందితుడికి అరెస్టు అయిన 23 రోజుల్లోనే మరణశిక్ష విధించింది. నిందితుడిని ఉరితీయాలంటూ జరిగిన వీధి పోరాటాల ఒత్తిడికి ఆ జడ్జి గురయి ఇలాంటి తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2021నుంచి పోక్సో కింద నమోదైన కేసుల్లో తీర్పులను ప్రతిపాదిత విధానం కింద చేపట్టే న్యాయ సమీక్ష పరిధిలోకి తీసుకురానున్నారు.

పాపం జగన్ ప్రభుత్వం చేస్తే..
భారం ప్రజలపై వేస్తారా?

- విద్యుత్ సర్దుబాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోండి
- ప్రభుత్వానికి షర్మిల డిమాండ్
- నేటి నుంచి మూడు రోజులు నిరసన కార్యక్రమాలు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఛార్జీలపై జగన్ ప్రభుత్వం చేసిన పాపాల భారాన్ని ఇప్పుడు ప్రజల నెత్తిన వేస్తారా అని కూటమి ప్రభుత్వాన్ని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిలదీశారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఎక్కువ ధరకు కరెంటు కొనుగోలు చేస్తే ఆ భారాన్ని ప్రజలపై వేయడం ఏంటని ప్రశ్నించారు. ఐదేళ్లలో వైసీపీ రూ. 35,000 కోట్ల భారం వేస్తే.. ఐదు నెలల్లో కూటమి రూ. 18,000 కోట్ల భారం వేసిందన్నారు. ఆ ట్రూఅప్ భారం నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంధన సర్దుబాటు నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని మంగళవారం ఎక్స్ వేదికగా షర్మిల తెలిపారు.

అర్చకుల కనీస వేతనం 15 వేలకు పెంపు

- ఆమోదించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.50 వేలు పైబడిన ఆదాయం ఉన్న దేవాలయాల్లో అర్చకులకు చెల్లించే కనీస వేతనాన్ని రూ.15,000కు పెంచాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దీనిద్వారా రాష్ట్రంలో 3,203 మంది అర్చకులకు లబ్ధి చేకూరనుంది. తద్వారా దేవదాయ శాఖపై దాదాపు రూ.10కోట్ల వరకూ భారం పడుతుంది. భవిష్యత్తులో అర్చకులకు మరింత మేలు చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.

పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు పునర్వ్యవస్థీకరణ

- చైర్మన్‌గా సీఎం, సభ్యులుగా పలువురు మంత్రులు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ)ను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బోర్డును ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. సీఎస్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ బోర్డులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, ప్రభుత్వ కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీ

రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీని కూడా పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, పరిశ్రమల శాఖ కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ అధికారిక కమిటీలో వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు.

పిఠాపురంలో మరో 12 ఎకరాలు కొన్న పవన్

పిఠాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులో మరో 12 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. నాలుగు నెలల క్రితం ఇక్కడ 3.52 ఎకరాలు కొనుగోలు చేసిన ఆయన తాజాగా మరికొంత భూమిని కొన్నారు. తాను పిఠాపురం నియోజకవర్గంలోనే శాశ్వత నివాసం ఏర్పరచుకుంటానని జనసేనాని ఎన్నికలకు ముందు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇల్లింద్రాడ రెవెన్యూ గ్రామంలోని సర్వే నం. 13, 28, 29 పరిధిలోని 12 ఎకరాలను పవన్ కొనుగోలు చేశారు. మంగళవారం దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రహస్యంగా పూర్తి చేయించారు. పవన్ తరఫున ప్రతినిధిగా రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ కొనుగోలు పత్రాలపై సంతకాలు చేసినట్లు చెబుతున్నారు.

మరో రూ.2,000 కోట్ల అప్పు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా మరో రూ.2,000 కోట్ల అప్పు తెచ్చింది. మంగళవారం ఆర్‌బీఐలో జరిగిన వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు విక్రయించి ఈ రుణం తీసుకొచ్చారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.52,000 కోట్ల అప్పులు తెచ్చినట్లయింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రాష్ట్రానికి రూ.47వేల కోట్ల అప్పులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ పరిమితి పూర్తవడంతో ఇటీవల ఇంకో రూ.7,000 కోట్ల రుణాలకు ఓకే చెప్పింది. అందులోనూ రూ.5,000 కోట్లు తేవడంతో ఇంకా రూ.2,000 కోట్ల పరిమితి మాత్రమే మిగిలి ఉంది.

నాలుగేళ్ల ఇంక్రిమెంట్ బకాయిల విడుదలపై హర్షం

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అడ్‌హక్ వ్యవసాయ అధికారులకు కూటమి ప్రభుత్వం ఇంక్రిమెంట్ల బకాయిలను మంజూరు చేయడం పట్ల ఆ సంఘ నేత మన్మథరావు హర్షం వ్యక్తం చేశారు. ఏటా చెల్లించాల్సిన ఇంక్రిమెంట్లను గత ప్రభుత్వం నాలుగేళ్లుగా తొక్కిపెట్టిందని, ఉన్నతాధికారులు, పాలకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎవ్వరూ పట్టించుకోలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, బకాయిలు విడుదలకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్న చొరవ తీసుకున్నారంటూ, సంఘం తరఫున ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

కూటమి పాలన ఫెయిల్: తులసిరెడ్డి

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన ఫెయిలైందని అనడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలే నిదర్శనమని పీసీసీ అధికార ప్రతినిధి ఎన్ తులసిరెడ్డి విమర్శించారు. 'రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఉచిత గ్యాస్ సిలిండర్ అంటూనే... విద్యుత్ చార్జీల భారం మోపటం దుర్మార్గం. తల్లికి వందనం అమలు చేయలేదు కానీ తండ్రికి లిక్కర్ ఫుల్లుగా అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తోంది. దీనిపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు' అని తులసిరెడ్డి ధ్వజమెత్తారు.

జగన్ పాపాలే పోలవరానికి శాపం: కాలవ

అనంతపురం నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో చేసిన పాపాలు పోలవరానికి శాపంగా మారాయని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. పోలవరం ఎత్తుపై జగన్ అండ్ కో రాద్ధాంతం చేయడంపై ఆయన మండిపడ్డారు. జగన్ అసమర్థతకు పోలవరం దుస్థితే నిదర్శనమన్నారు. ప్రస్తుతం పోలవరాన్ని 45.75 మీటర్ల ఎత్తుతోనే నిర్మిస్తున్నారని, 41 మీటర్లకు కుదించలేదని స్పష్టం చేశారు.

ఉప రాష్ట్రపతిని కలిసిన ఎంపీ లావు



న్యూఢిల్లీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఏపీ ప్రగతి, అభివృద్ధి కోసం కీలకమైన సలహాలు, సూచనలు ఇచ్చినందుకు ఉప రాష్ట్రపతికి లావు శ్రీకృష్ణదేవరాయలు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో
విజయఢంకా మోగిస్తాం: ఎమ్మెల్సీ అశోక్‌బాబు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 'గతంలో ప్రతిపక్షంలో ఉన్నా గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయఢంకా మోగించాం. ఈ సారి కూడా అదే పరిస్థితి కొనసాగుతుంది' అని టీడీపీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు అన్నారు. మంగళవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సర్వర్ సమస్య కారణంగా ఓటర్ల నమోదు కార్యక్రమం కాస్త మందగించినా... నమోదు గతంలో కంటే అధికమే. టీడీపీ బృందం కేంద్ర ఎన్నికల కమిషన్‌ను గ్రాడ్యుయేషన్ ఓటర్ల నమోదు సమయం పెంచాలని కోరుతోంది. విజయవాడలో వరదల కారణంగా ఓటు నమోదు కార్యక్రమం ఆలస్యమైంది. ఈ రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీలను గెలవాల్సిన అవసరముంది. కౌన్సిల్ ప్రక్షాళన కావాలి. టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా మసలుకోవాలి. నాయకుడి ఆదేశాలను తూచాతప్పక పాటించాలి. మనం గెలిస్తే నాయకుల్లో, ప్రజల్లో ఒక నమ్మకం ఏర్పడుతుంది. సమస్యలేవైనా ఉంటే నాయకుల దృష్టికి తెస్తే కచ్చితంగా పరిష్కరిస్తారు. మా దృష్టికి తెచ్చినా చిత్తశుద్ధితో కృషి చేస్తాం. టీడీపీ కూటమి ప్రజల ప్రభుత్వంగా పనిచేస్తుంది' అని అశోక్‌బాబు అన్నారు.

'సరస్వతి'పై
సమగ్ర విచారణ!

- ప్లాంట్ పేరిట రైతుల భూములు దోచేశారు
- సరస్వతీ భూములను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

మాచవరం, పిడుగురాళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పవర్ భూముల సేకరణలో పెద్దఎత్తున అవకతవకలు, అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. 400 ఎకరాలు అటవీ భూమి, 24 ఎకరాల అసైన్డ్ భూమిని కాజేశారని చెప్పారు. భూములు కోల్పోయి నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం వద్ద సరస్వతి పవర్ భూములను పవన్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. "ప్రజల ఆస్తులు లాగేసుకుని తమ సొంత ఆస్తిలా జగన్ కుటుంబసభ్యులు కొట్టుకుంటున్నారు. మాచవరం, దాచేపల్లి మండలాల్లో సరస్వతి పవర్ ప్లాంట్ కోసం జగన్ భూములు తీసుకున్నారు. 2009లో వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో సంస్థ కోసం భూములు బలవంతంగా లాక్కున్నారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పారు. ఇప్పటివరకు పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయలేదు. ఇది రాష్ట్ర ప్రజల సమస్య. ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు.. తన వద్ద ఉన్న ఫర్నిచర్‌ను తీసుకువెళ్లాలని గత ప్రభుత్వానికి లేఖ రాశారు. అయినా ఆయన్ను వేధించి చంపేశారు. 20 లక్షల ఫర్నిచర్ కోసం వేధించిన జగన్.. సరస్వతి పవర్ సంస్థ కోసం వందల ఎకరాలు లాక్కున్నారు. భూముల కోసం పెట్రోలు.. నాటుబాంబులు వేసి రైతులను భయపెట్టారు. వారికి నేటికి న్యాయం జరగలేదు. వేమవరంలో 710.6 ఎకరాలు, చెన్నాయపాలెంలో 273 ఎకరాలు, పిన్నెల్లిలో 93.79, తంగెడలో 107.36 మొత్తంగా రైతుల నుంచి తీసుకున్నది 1,384 ఎకరాలు. 1,083 ఎకరాలు పట్టా భూమి కాగా, చుక్కల భూమి 76 ఎకరాలు ఉంది. సరస్వతి భూముల పరిశీలనకు అటవీ, రెవెన్యూ అధికారులను ఆదేశిస్తే ఇప్పటి వరకు 24 ఎకరాల అసైన్డ్ భూమిని గుర్తించారు. ఇది వేమవరంలోనే ఉంది. ఎస్సీ కుటుంబాలకు చెందిన ఆ భూమిని కూడా వదల్లేదు. రైతులను భయపెట్టి, బాంబులు వేసి, దాడులు చేసి పట్టా భూములను లాక్కున్నారు. సరస్వతి పవర్‌లో 400 ఎకరాలు అటవీ భూములు ఉన్నాయి. కొండలు, చెరువులు సహజ వనరులకు సంబంధించి కూడా 24.78 ఎకరాలు ఉంది. అసలు అటవీ, అసైన్డ్ భూమి ఎంత ఉంది, ప్రాజెక్టు ఎందుకు ప్రారంభించలేదన్న దానిపైనా సమగ్ర విచారణ జరిపిస్తాం. వైఎస్ సీఎంగా ఉన్నపుడు 2009లో 30 ఏళ్లకు లీజుకు తీసుకుని జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఇదే భూములను 50 ఏళ్లకు ఆ లీజు పెంచుకున్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ అయితే అనుమతులు రావని పవర్ ప్లాంట్ కింద తీసుకున్నారు. పర్యావరణ, పొల్యూషన్ బోర్డులు అనుమతులు ఇవ్వలేదు. 196 కోట్ల లీటర్ల కృష్ణా జలాలను వినియోగించుకునేలా సీఎంగా ఉన్నపుడు జగన్ అనుమతి ఇచ్చుకున్నారు. ఈ అంశాన్ని కేబినెట్‌లో కూడా ప్రస్తావిస్తాను" అని పవన్ పేర్కొన్నారు. కాగా, సరస్వతి పవర్ భూములను పరిశీలించేందుకు వచ్చిన పవన్ కల్యాణ్‌కు పల్నాడు ప్రజలు, కూటమి నేతలు, జనసేన కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.



సరస్వతీ భూములను పరిశీలించేందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్, ఎమ్మెల్యే యరపతినేనికి వివరాలు తెలుపుతున్న కలెక్టర్

వైసీపీ వాళ్లకు పోలీసులు భయపడుతున్నారా..

శాంతిభద్రతలే కూటమి ప్రభుత్వానికి ముఖ్యమని పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్రజల మానప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఇప్పుడు పోలీసులు మెత్తబడిపోయారా లేదా వాళ్లకు(వైసీపీ వాళ్లకు) భయపడిపోతున్నారా అంటూ ప్రశ్నించారు. వైసీపీ నేతలు కొందరు ఇంకా అధికారంలోనే ఉన్నట్టు భావిస్తున్నారని, అడ్డగోలుగా వ్యవహరించే వారి తోలు తీస్తామని హెచ్చరించారు. ప్రజలపై బాంబులు దాడులు చేసినా.. వారిని బెదిరించినా ఏ మాత్రం ఉపేక్షించవద్దని ఎస్పీని పవన్ ఆదేశించారు.

నేడు ఢిల్లీకి పవన్.. షాతో భేటీ

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. బుధవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ కానున్నారు. సచివాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి మంత్రివర్గ సమావేశం జరగనుంది. అది పూర్తయిన అనంతరం పవన్ గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి వెళ్లనున్నారు. కేంద్ర హోం మంత్రితో ఆయన ఏపీ అంశాలపై చర్చించనున్నారన్న విషయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



శవాల దగ్గర
రాబందులు!
వైసీపీ సైకో బ్యాచ్‌పై చర్యలు: హోం మంత్రి

- ఏమీ జరక్కపోయినా ఏదో జరిగినట్లు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు
- ఐదేళ్లలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం: అనిత

అనంతపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను నాటి సీఎం జగన్ నిర్వీర్యం చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత విరుచుకుపడ్డారు. శాంతిభద్రతల గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. వైసీపీ నాయకుల పరిస్థితి శవాల దగ్గర రాబందుల్లా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో ఏమీ జరగకపోయినా ఏదో జరిగిపోయినట్లుగా వైసీపీ సైకో బ్యాచ్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ.. కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంగళవారమిక్కడ అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో ఘనంగా నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ అవుట్ పెరేడ్‌కు ఆమె, డీజీపీ ద్వారకా తిరుమలరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అక్కడ, ఆ తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రజల మాన ప్రాణాలను కాపాడడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నిర్వీర్యమైన పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయడం, పోలీసుల సంక్షేమాన్ని పెంపొందిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు వెళ్తోందని చెప్పారు. గత ఐదేళ్లలో జరిగిన తప్పిదాలతో ఇప్పుడు తమ ప్రభుత్వం ఇబ్బందులు పడుతోందని తెలిపారు. సైకో బ్యాచ్ సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు. నిన్నటి రోజున తిరుపతిలో ఒక ఘటన జరిగిందని జగన్ సొంత పత్రిక, చానల్లో పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. కనీసం ఆ అమ్మాయి అత్యాచారానికి గురైందో లేదో వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వంపై బురద జల్లడం... సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం పరిపాటిగా మారింది. వైసీపీ సైకో బ్యాచ్ ప్రజల మనోభావాలతో ఆటలాడుతోంది. ఈ ప్రయత్నాలను అడ్డుకోవడం మా గురుతర బాధ్యత. జగన్ తన ఇంటికి రూ.12 కోట్లు పెట్టి బందోబస్తు ఏర్పాటు చేసుకున్నారే గానీ.. పోలీసు విభాగంలో వేలిముద్రలు గుర్తించే వ్యవస్థ నిర్వహణకు రూ.12 కోట్లు ఖర్చు పెట్టలేదు. ఇలాంటి వ్యక్తా శాంతిభద్రతల గురించి మాట్లాడేది? గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం నిర్మాణానికి కేంద్రం రూ.219 కోట్లు ఇస్తే.. రూ.9 కోట్లు తీసుకుని యూసీ ఇవ్వలేదు. దీంతో మిగిలిన రూ.210 కోట్లు వెనక్కిపోయాయి. ఈ కారణంగా గ్రేహౌండ్స్ అకాడమీయే లేకుండా పోయింది. వేలిముద్రల గుర్తింపు, సీసీ కెమేరాలకు రూ.700 కోట్లు ఖర్చు చేసి ఉంటే వాటి పునరుద్ధరణ జరిగేది. కానీ జగన్ రూ.500 కోట్లు ఖర్చు చేసి రుషికొండలో ప్యాలెస్ మాత్రం కట్టారు. శాంతిభద్రతల గురించి మాట్లాడేందుకు ఆయన సిగ్గుపడాలి' అని ధ్వజమెత్తారు. పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేసి.. సాంకేతికంగా మరింత అభివృద్ధి చేసి, శాంతిభద్రతలు కాపాడతామన్నారు. త్వరలో 6వేలకుపైగా కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. ఎస్ఐ పోస్టుల భర్తీపై సమగ్రంగా సమీక్షిస్తున్నామని చెప్పారు.


> రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నేను ఒక్కటే మాట మీద ఉన్నాం. శాంతిభద్రతలపై రాజీపడే ప్రసక్తే లేదు.
>
> పోలీసు వ్యవస్థకు ఒక్క రూపాయైనా ఇవ్వకుండా అన్ని విభాగాలను జగన్ నిర్వీర్యం చేశారు. సరెండర్ లీవ్‌లు ఇవ్వడు గానీ పబ్లిసిటీ పిచ్చి కోసం సర్వే రాళ్లకు రూ.800 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ రూ.800 కోట్లను పోలీసులకు ఇవ్వాల్సిన టీఏలు, డీఏలకు చెల్లించి ఉంటే బాగుండేది కాదా..?
>
> - హోం మంత్రి అనిత

పోలీసుల ప్రతిష్ఠ పెంచాలి

పోలీసుల ప్రతిష్ఠను పెంచేలా విధి నిర్వహణలో బాధ్యతగా నడచుకోవాలని శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు హోం మంత్రి సూచించారు. ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పెరేడ్‌లో తొలుత ఆమె వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి, నిద్రలేని రాత్రులు గడిపి కలలను సాకారం చేసుకున్నారని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు విధుల్లో చేరబోతున్నారని డీఎస్పీలను అభినందించారు. బాధ్యతగా వ్యవహరించి, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. 'రాష్ట్ర ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడేందుకు పోలీసు వృత్తిని ఎంచుకోవడం హర్షణీయం. పోలీసు ఉద్యోగం మిగతా ఉద్యోగాలవంటిది కాదు. 24 గంటలూ పనిచేయాలి. నిజాయితీ, నిష్పక్షపాతం, బాధితులపట్ల సానుభూతి, విధి నిర్వహణలో నిబద్ధత కలిగి ఉండాలి. సమాజాన్ని సుస్థిరంగా ఉంచి, శాంతిభద్రతలు కాపాడే కీలక బాధ్యతలను పోలీసులు నిర్వర్తిస్తున్నారు. అలాగే పోలీసు వ్యవస్థను ప్రతి ఒక్కరూ గౌరవించేలా చేయాలని సీఎం సంకల్పించారు. పోలీసు శాఖకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. గత ఐదేళ్లలో నిర్వీర్యమైన పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయడమే మా ధ్యేయం. పటిష్ఠపరచడమంటే ఆయుధాలు ఇవ్వడమో.. వాహనాలు ఇవ్వడమో కాదు. పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడం. పోలీసు స్టేషన్ల నిర్మాణం, ఆధునికీకరణ పనులు చేయాల్సి ఉంది. ప్రతి జిల్లాలోనూ సైబర్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి మత్తులో, రాజకీయ ముసుగులో ఎంతో మంది నేరాలకు ఒడిగడుతున్నారు. టెక్నాలజీని వినియోగించుకుని నేరాల కట్టడికి ప్రభుత్వం కృషి చేస్తోంది' అని వివరించారు.



పోలవరం.. 2028 మార్చికి!
త్వరగా పూర్తి చేయడమే కాదు.. నాణ్యతా ముఖ్యమే: సీఎం



అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎదురయ్యే ప్రతి సమస్యనూ అధిగమిస్తూ.. 2028 మార్చినాటికల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టులపై ఆయన సమీక్షించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలవరంలో చేపట్టిన పనులను అధికారులు వివరించారు. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం గ్యాప్-2 పనుల్లో పురోగతిని తెలియజేశారు. డీవాటరింగ్ (కాఫర్ డ్యాంల మధ్య వరదను మోటార్ల ద్వారా తోడేయడం)తో డయాఫ్రం వాల్ నిర్మాణానికి అనువైన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొత్త వాల్‌ను 1,396 మీటర్ల పొడవున నిర్మించాల్సి ఉందని తెలిపారు. అలాగే ప్రాజెక్టు ప్రాంతంలో బుధవారం నుంచి జరిగే వర్క్‌షాపులో వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ పనులపై స్పష్టత వస్తుందని వివరించారు. జల సంఘంతో చర్చలు జరిపి ఈ రెండింటినీ సమాంతరంగా నిర్మించేందుకు ఆమోదం తీసుకోవాలని సీఎం సూచించారు. జనవరిలో డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తే పూర్తి చేసేందుకు సరిగ్గా ఏడాది పడుతుందని నిర్మాణ సంస్థలు వెల్లడించాయి. ఆ వెంటనే ఈసీఆర్ఎఫ్ డ్యాంను ప్రారంభిస్తే పూర్తిచేయడానికి రెండేళ్లు పడుతుందని చెప్పాయి. ఈ రెంటినీ సమాంతరంగా చేపడితే 2027 జూలై నాటికి.. విడివిడిగా చేపడితే 2028 మార్చినాటికి పనులు పూర్తవుతాయని తెలిపాయి. అయితే పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత కూడా అత్యంత ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ పోలవరం ఎడమ కాలువ పనుల 77 శాతం పూర్తయ్యాయని.. రూ.960 కోట్ల పనులకు టెండర్లను పిలిచామని అధికారులు తెలిపారు. కాగా, చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. 3లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు రూ.2,463 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అధికారులు వివరించారు. వెలిగొండ ప్రాజెక్టులో ఇంకా రూ.2,200 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెప్పారు. సమీక్షలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సీఎంవో కార్యదర్శి రాజమౌళి, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, బావర్, మేఘా ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

తప్పు చేసి.. ఎదురు దాడా?

- జగన్‌పై చంద్రబాబు ఆగ్రహం

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ రాష్ట్ర ప్రయోజనాలను ఘోరంగా దెబ్బతీశాడని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో జగన్ చెప్పినవన్నీ అసత్యాలేనని స్పష్టం చేశారు. పోలవరం విషయంలో రాష్ట్రానికి తీరని ద్రోహం చేసి.. కూటమి ప్రభుత్వం ఎత్తు తగ్గించేందుకు అంగీకరించిందంటూ సిగ్గులేకుండా తన పత్రికలో రాతలు రాస్తున్నారని సమీక్ష సందర్భంగా మండిపడ్డారు. పోలవరం ఎత్తును 41.15 మీటర్లకు కేంద్రం కుదించినా కూటమి ప్రభుత్వం తలొంచుకుందని.. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తోందని జగన్ 'ఎక్స్'లో పెట్టిన పోస్టుపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడే తొలి దశలో 41.15 మీటర్లు.. రెండో దశలో 45.72మీటర్ల ఎత్తు అంటూ కొత్తవాదన తెచ్చారని.. మొదటి విడతలో 41.15 మీటర్ల కాంటూరులో పోలవరం పూర్తి చేసేందుకు రూ.10,911.06 కోట్లు కావాలంటూ 2022 జనవరి పదో తేదీన కేంద్రాన్ని కోరారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2023 అక్టోబరులో కేంద్ర జల సంఘం తొలి దశకు ఆమోదం తెలిపిందన్నారు. సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లకు ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర జలశక్తి శాఖ సమ్మతించిందని చెప్పారు. సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీసేలా వ్యవహరించి.. ప్రజలు ప్రతిపక్ష హోదాను కూడా ఇవ్వకపోయేసరికి.. తాను చేసిన తప్పులన్నిటినీ కూటమి ప్రభుత్వంపైకి నెట్టి సొంత పత్రికలో రాసుకుంటున్నాడని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల కాంటూరు ఎత్తులో నిర్మిస్తామని తేల్చిచెప్పారు.

పోలవరం పనులపై నేటి నుంచి వర్క్‌షాపు

పోలవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలపై బుధవారం నుంచి వర్క్‌షాపు జరుగనుంది. ఐదు రోజులు సాగే ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర అధికారులతో పాటు అంతర్జాతీయ నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, డేవిడ్ బి పాల్, జియాన్ ఫ్రాంకో, డి సిక్కో, రిచర్డ్ డొనెల్లీ కూడా పాల్గొననున్నారు. వీరు బుధవారం ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం నుంచి ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకుంటారు. ప్రధాన డ్యాంలో గ్యాప్ 2 ప్రాంతంలో 200 మీటర్ల చానల్ వద్ద మట్టిరాతి నాణ్యత సంబంధిత సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తారు. భోజన విరామానంతరం మూడు గంటలకు ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులతో వర్క్‌షాపు నిర్వహిస్తారు.

గోదావరి-పెన్నా అనుసంధానంపై కదలిక
తొలి దశపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నదుల అనుసంధానం దిశగా టీడీపీ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో నీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష జరిపారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు గోదావరి-పెన్నా అనుసంధాన పథకంపైనా చర్చించారు. ఈ అనుసంధాన ప్రక్రియపై తమ శాఖ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ వాప్కోస్ కూడా ఇచ్చిన వేర్వేరు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లను అధికారులు సీఎం ముందు ఉంచారు. గోదావరి-పెన్నా తొలి దశ పనులకు రూ.6,212.08 కోట్ల వ్యయమవుతుందని నాడు అంచనా వేశారు. ఈ మేరకు 2018 సెప్టెంబరు 5న పరిపాలనా ఆమోదం ఇస్తూ జీవో 98 జారీ చేశారు. అయితే 2019లో జగన్ సీఎం అయ్యాక మిగతా ప్రాజెక్టులతో పాటే దీనినీ మూలనపడేశారు. ఇటీవలి ఎన్నికల్లో గెలిచి టీడీపీ కూటమి అధికారం చేపట్టాక.. ప్రాజెక్టులపై దృష్టి సారించింది. ఇప్పటికే పోలవరం కుడి కాలువ నుంచి పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా ప్రకాశం బ్యారేజీ దాకా జలాలను తరలించే పథకం అమల్లో ఉంది. దీని ఆధారంగానే కృష్ణా డెల్టా సిస్టమ్ ఇంజనీరింగ్ అధికారులు గోదావరి-పెన్నా అనుసంధాన తొలి దశపై డీపీఆర్‌ను రూపొందించారు. దీనిప్రకారం.. పోలవరం కుడి కాలువ నుంచి పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా ప్రకాశం బ్యారేజీ వైపు వచ్చే గోదావరి జలాలను.. బ్యారేజీ ఎగువన 21 కిలోమీటర్ల వద్ద గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం హరిశ్చంద్రపురం గ్రామం వద్ద కృష్ణా కాలువకు మళ్లిస్తారు. అక్కడి నుంచి నకరికల్లులోని నాగార్జున సాగర్ కుడికాలువకు తరలిస్తారు.

ఆ బాలికపై అత్యాచారం జరగలేదు

- పరీక్షల అనంతరం వైద్యుల ధ్రువీకరణ
- బాలికను పరామర్శించిన పులివర్తి నాని దంపతులు

తిరుపతి (వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలానికి చెందిన 14ఏళ్ల విద్యార్థినిపై అత్యాచారం జరగలేదని వైద్యులు నిర్ధారించారని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళుతున్న బాలికను ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో బాలికను వైద్యపరీక్షల నిమిత్తం సోమవారం రాత్రి తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలికను మంగళవారం ఎస్పీ పరామర్శించి వివరాలు సేకరించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి బాలికను అడ్డుకుని.. ప్రేమించాలంటూ వేధించారని, వారిని అడ్డుకునే క్రమంలో బాలిక శరీరంపై చిన్నపాటి గాయాలయ్యాయని తెలిపారు. అంతే కానీ కొన్ని పత్రికల్లో రాసినట్లు, కొందరు నేతలు పేర్కొంటున్నట్లు బాలికపై అత్యాచారం జరగలేదని స్పష్టం చేశారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, బాలికను వేధించిన వారిని అదుపులోకి తీసుకొని చర్యలు చేపడతామన్నారు. బాధిత విద్యార్థినిని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డి, ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి రోజా పరామర్శించారు. కాగా, తన బిడ్డపై ఎటువంటి అత్యాచారం జరగలేదని కేవలం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వేధింపులకు మాత్రమే పాల్పడ్డారని బాలిక తండ్రి చెప్పారు. అయితే కొన్ని పత్రికలు, మీడియాతో పాటు కొందరు రాజకీయ నేతలు అత్యాచారం జరిగిందని తప్పుడు ప్రచారాలు చేస్తూ పరువు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసి తన బిడ్డ భవిష్యత్తును నాశనం చేయవద్దని కోరారు.

తప్పులను సరిదిద్దుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఆక్షేపించారు. ఒక ఎంపీని పట్టుకుపోయి కొట్టడమే ఇందుకు ఉదాహరణంటూ పరోక్షంగా అప్పటి ఎంపీ రఘురామకృష్ణరాజు ఉదంతాన్ని ప్రస్తావించారు. మంగళవారమిక్కడ పోలీసు శిక్షణ కళాశాలలో నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ అవుట్ పెరేడ్‌లోను, అనంతరం మీడియాతోను ఆయన మాట్లాడారు. ఒక పార్టీ (టీడీపీ) కార్యాలయంపై దాడి జరిగితే.. భావప్రకటన స్వేచ్ఛలో భాగంగానే దాడి జరిగిందని అప్పట్లో పోలీసులు రాసుకున్నారని తెలిపారు. ఆ సంఘటనలో ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదన్నారు. ఏదైనా దాడి, సంఘటన జరిగితే చట్టానికి లోబడి ఎప్పుడైనా నిందితులను అరెస్టు చేయవచ్చని చెప్పారు. కేరళలో జరిగిన ఓ సంఘటనకు సంబంధించి 20 ఏళ్ల తర్వాత ఓ ఐపీఎస్ అధికారికి శిక్ష పడిందని గుర్తు చేశారు. తప్పు చేస్తే 30 ఏళ్ల తర్వాతైనా అరెస్టు చేయవచ్చన్నారు. పోలీసులు రాజ్యాంగానికి, చట్టానికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, ఆ జవాబుదారీతనాన్ని పోలీసు వ్యవస్థలో మరింతగా పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాంతిభద్రతలను కాపాడే విషయంలో తమ పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటామన్నారు. మానవ హక్కులు, మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. 'దొంగలు, నేరస్థులను పట్టుకోవడానికి ఫింగర్ ప్రింట్ వ్యవస్థ ఒక ఆయుధంగా ఉండేది. ఆ వ్యవస్థను మూలన పడేయడమంటే నేరస్థులను పట్టుకోవద్దని చెప్పడమే కదా! ఇప్పుడు మేం ఆ వ్యవస్థను పునరుద్ధరించాం' అని వెల్లడించారు. ఐపీఎస్ అధికారి సంజయ్‌పై వచ్చిన అభియోగాలపై విచారణ జరుగుతోందని, ఆ నివేదిక తనకు ఇంకా రావలసి ఉందని తెలిపారు. ప్రొటోకాల్ విషయంలో నిబంధనలను పాటించాలని ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. చట్టాన్ని గౌరవిస్తూ.. రాజ్యాంగాన్ని అనుసరిస్తూ.. పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచుతూ, శాంతిభద్రతలు కాపాడటమే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ రెండూ విధి నిర్వహణలో కీలకమేనని, వాటిని పక్కాగా అమలు చేయాలని ప్రొబేషనరీ డీఎస్పీలకు డీజీపీ సూచించారు. మానవ హక్కులను కాపాడుతూ, రాజ్యాంగంలో పొందుపరిచిన నియమాలకు అనుగుణంగా పనిచేయడాన్ని ఏ ఒక్కరూ మరువకూడదన్నారు. పోలీసు సేవలు అవసరమైన వారిపట్ల మరింత సానుభూతితో ఉండాలని చెప్పారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా అప్‌డేట్ కావాలని.. పాసింగ్ అవుట్ పెరేడ్‌లో చేసిన ప్రతిజ్ఞ మేరకు నిష్పక్షపాతంగా, నిర్భయంగా, రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని పిలుపిచ్చారు. పదవీ విరమణ పొందే వరకూ ప్రతిజ్ఞలోని ఈ అంశాలను మరువకూడదన్నారు.

ఎట్టకేలకు వెంకట్రామిరెడ్డిపై విచారణ!



- విచారణాధికారిగా కడప కలెక్టర్ శ్రీధర్
- ఎన్నికల్లో వైసీపీకి ఉద్యోగనేత ప్రచారం
- ఈసీ ఆదేశాలతో అప్పట్లోనే సస్పెన్షన్
- శాఖాపర చర్యలకు సిద్ధమైన సర్కారు
- రెండు నెలలు ఆలస్యంగా ఆదేశాలు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డిపై విచారణాధికారిని నియమిస్తూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కడప ఆర్‌డీవో జాన్ ఇర్విన్‌ను ప్రజెంటింగ్ అధికారిగా నియమించారు. ఎన్నికల కోడ్ సమయంలో వెంకట్రామిరెడ్డి నిబంధనలకు విరుద్ధంగా బద్వేలు, కడప, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో వైసీపీకి అనుకూలంగా రాజకీయ ప్రచారం చేశారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఎన్నికల సంఘం ఆయనను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో తప్పని పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వమే వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వెంకట్రామిరెడ్డిపై అభియోగాలు నమోదు చేస్తూ ఆగస్టు 21న జీవో ఇచ్చారు. 10 రోజుల్లో దీనిపై వెంకట్రామిరెడ్డి వివరణ ఇవ్వకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆ జీవోలో పేర్కొన్నారు. ఈ మేరకు వెంకట్రామిరెడ్డి తన వాదన వినిపించారు. నిబంధనల ప్రకారం వెంటనే విచారణాధికారిని నియమించాలి. అయినప్పటికీ, 2 నెలలు ఆపి ఎట్టకేలకు విచారణాధికారిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏడుగురు ఏపీ పోలీసులకు ఐపీఎస్

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏడుగురు సీనియర్ పోలీసు అధికారులకు ఐపీఎస్ హోదా లభించింది. ఇద్దరు మహిళలు, ఐదుగురు పురుషులకు కేంద్ర హోంశాఖ ఇటీవలే నాన్ కేడర్ ఎస్పీ నుంచి ఐపీఎస్ కన్ఫర్డ్ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ హోదా డిక్లేర్ చేస్తూ జీవో జారీ చేసింది. 2022బ్యాచ్‌కు చెందిన ఎ.రమాదేవితోపాటు బి.ఉమామహేశ్వర్, జె.రామ్మోహన్‌రావు, ఎస్.శ్రీదేవిరావు, ఇ.జి.అశోక్‌కుమార్‌కు ఐపీఎస్ హోదా లభించింది. 2023బ్యాచ్‌కు చెందిన కేజీవీ సరిత, కె.చక్రవర్తికి పదోన్నతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పోలీసుల అదుపులో ఇద్దరు వైసీపీ కార్యకర్తలు

- చంద్రబాబు, పవన్, లోకేశ్‌పై వివాదాస్పద పోస్టులు
- అరెస్టు చేసిన దువ్వాడ, మార్కాపురం పోలీసులు

కూర్మన్నపాలెం (విశాఖపట్నం), మార్కాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌లపై సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెట్టిన ఇద్దరు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను దువ్వాడ, మార్కాపురం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ కార్యకర్త బోడి వెంకటేశ్.. పవన్ కల్యాణ్, లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో వివాదాస్పద పోస్టులు పెట్టాడు. దీనిపై టీఎన్ఎస్ఎఫ్ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సాకేళ్ల రతన్‌కాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాదవ జగ్గరాజుపేటకు చెందిన వెంకటేశ్‌ను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన కల్లి నాగిరెడ్డి అలియాస్ నాని విజయవాడ వరద బాధితుల సహాయం విషయంలో రూ.534 కోట్ల సొమ్మును ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లూటీ చేశారని అక్టోబరు 7న ఎక్స్‌లో పోస్టు పెట్టాడు. దీనిపై అక్టోబరు 21న మార్కాపురం పట్టణానికి చెందిన కుంచాల యశ్వంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి నాగిరెడ్డి కోసం గాలించిన పోలీసులు మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లి డీమార్ట్ సమీపంలో అతన్ని అరెస్ట్ చేసి మార్కాపురం తరలించారు.

మద్యంలో మతలబు!



(మొదటి పేజీ తరువాయి)

నేరుగా మద్యం దుకాణాల్లో విక్రయించారా? లేక... సొంత బెల్టు షాపులకు తరలించారా? వాటిపై ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని నాటి పెద్దలు పంచుకున్నారా? ఇలా అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటివరకూ ప్రచారం, అనుమానాలుగానే ఉన్న ఈ అంశాలకు ఇప్పుడు బలమైన ఆధారాలు లభిస్తున్నాయి. అయితే, పక్కదారి పట్టిన సరుకు ఎంత అనేది తేల్చాల్సి ఉంది. గత ప్రభుత్వంలో రోజుకు సగటున రూ.80 కోట్ల మద్యం అమ్మితే, ఇప్పుడు రూ.90 కోట్లకు చేరింది. అప్పటికీ, ఇప్పటికీ మద్యం ధరలు మారలేదు. కొత్త మద్యం పాలసీ వచ్చి, ప్రైవేటు షాపులు తెరుచుకుని 21 రోజులే అయ్యింది. తాగే వారి సంఖ్య ఒక్కసారిగా పెరిగే అవకాశమూ లేదు. అయినప్పటికీ... రోజువారీ విక్రయాలు రూ.10కోట్లు పెరగడం గమనార్హం! కూటమి సర్కారు అన్ని రకాల, ఖరీదైన బ్రాండ్లు అందుబాటులోకి తెచ్చినందునే అమ్మకాలు పెరిగాయనే వాదన తేవచ్చు. కానీ... కొత్త పాలసీ వచ్చిన తొలి వారం పది రోజులు డిస్టిలరీల నుంచి పాత సరుకునే విక్రయించారు. అయితే... గతంలో పాపులర్ బ్రాండ్లను తక్కువగా, 'జే' బ్రాండ్లను అధికంగా షాపుల్లో అందుబాటులో ఉంచేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. దీని వల్లే విక్రయాలు పెరిగాయనుకున్నా... రోజుకు రూ.10 కోట్లు తేడా వచ్చే అవకాశం ఎంతమాత్రం లేదు. మరో వైపు.. జగన్ హయాంలో రూ.180 వరకు ఉన్న చీప్ లిక్కర్ ఇప్పుడు రూ.99కే దొరుకుతోంది. దీనికి చాలా డిమాండ్ ఉంది. అంటే... అమ్మకాల విలువ తగ్గాలి. అయినప్పటికీ... గతంతో పోల్చితే రోజుకు రూ.10కోట్ల మేరకు విక్రయాలు పెరిగాయి. అంటే.. నెలకు దాదాపు రూ.300 కోట్లు! ఆ మేరకు వైసీపీ హయాంలో సరుకు పక్కదారి పట్టిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. కొత్త మద్యం పాలసీ వచ్చినప్పటి నుంచి మంగళవారం వరకు... అంటే 21 రోజుల్లో రూ.2,235 కోట్ల విలువైన మద్యాన్ని షాపులు, బార్లు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశాయి. వాటిలో కొంత మేర నిల్వ పెట్టుకున్నారని భావించినా, రూ.90 కోట్లకు తగ్గకుండా అమ్మకాలు జరుగుతున్నాయని స్పష్టమవుతోంది. అదే గత ప్రభుత్వంలో రోజుకు రూ.80 కోట్లు దాటి అమ్మకాలు లేవు.

సీఐడీ సోదాల్లో...

జగన్ హయాంలో డిస్టిలరీలన్నింటినీ వైసీపీ పెద్దలే నడిపించారు. నిబంధనల ప్రకారం డిస్టిలరీల్లో ఉత్పత్తి అయిన మద్యం నేరుగా దుకాణాలకు వెళ్లాలి. ఉత్పత్తికీ, విక్రయాలకూ మధ్య లెక్క సరిపోవాలి. కానీ... ఈ లెక్క తప్పిందని సీఐడీ గుర్తించినట్లు తెలిసింది. ఇటీవల అన్ని డిస్టిలరీలలో ఏకకాలంలో సీఐడీ అధికారులు సోదాలు జరిపారు. అక్కడ జరిగిన ఉత్పత్తికీ, క్షేత్రస్థాయిలో జరిగిన విక్రయాలకూ మధ్య తేడా ఉన్నట్లు తేల్చారు. దీనిపై మరింత లోతుగా పరిశీలిస్తే.. డిస్టిలరీల నుంచి నేరుగా ఎంత సరుకు దుకాణాలకు, బెల్టు షాపులకు తరలిపోయిందో తేలుతుంది.

శ్రీవారి భక్తులకు 'టూరిజం' టోపీ



- పర్యాటక శాఖలో తిరుమల టికెట్ల స్కామ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పర్యాటక శాఖకు ఏటా వందల టికెట్లు కేటాయిస్తుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు పర్యాటక శాఖ ఈ టికెట్లు విక్రయిస్తుంది. వాటి ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత మొత్తం టీటీడీకి ఇచ్చి, మిగిలిన మొత్తం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్(ఏపీటీడీసీ) ఖాతాలో జమ చేస్తుంది. ఈ సంస్థ ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి, వాటిలో భక్తులను తిరుమలకు తీసుకువెళ్లడంతో పాటు ఆహారం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తుంది. దీనికిగాను ప్రతి టికెట్‌ను రూ.2000కు విక్రయిస్తుంది. మూడేళ్ల కిందట ఏపీటీడీసీ అధికారులు 'సంయుక్త భాగస్వామ్య విధానం' అనే కొత్త పథకాన్ని తీసుకువచ్చారు. ఈ విధానంలో టీటీడీకి చెందిన టికెట్లు మాత్రమే విక్రయిస్తారు. అదేవిధంగా ప్రైవేటు రవాణా సంస్థల నుంచి బస్సులు తీసుకుంటారు. ఇలా ఈ పథకం కింద ఐదు రూట్లలో బస్సులు నడిపించారు. చెన్నై నుంచి రెండు, బెంగళూరు నుంచి ఒక బస్సుతో పాటు ఒంగోలు నుంచి ఒకటి, రాయచోటి నుంచి ఒక బస్సును నడిపించారు. సంయుక్త భాగస్వామ్య విధానం అనే పథకంలో.. జగన్ హయాంలో సీఎంవోలో పనిచేసిన ఒక కీలక అధికారి హస్తం ఉందని తెలిసింది. ఆయన కింద పని చేసిన మహిళా అధికారి భర్త.. ఏపీటీడీసీలో కీలకమైన స్థానంలో ఉన్నారు. సదరు అధికారి బంధువునే తిరుపతి డివిజన్‌లో కీలకమైన పోస్టులో నియమించారు. ఈ ముగ్గురు కలిసి ఏపీటీడీసీ రవాణా విభాగాన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నారు.

రోజుకు 200 టికెట్లు

ఏపీటీడీసీ రవాణా విభాగం ద్వారా రోజుకు 200 టీటీడీ టికెట్లు అందుబాటులో ఉంటాయి. అయితే చాలా మంది భక్తులు ఏపీటీడీసీ ద్వారా టికెట్లు కొనుగోలు చేసినా, ఆ సంస్థ బస్సుల్లో ప్రయాణం చేయరు. నేరుగా వారి సొంత వాహనాల్లోనే తిరుమలకు చేరుకుంటారు. అక్కడ మాత్రం ఏపీటీడీసీ ఇచ్చిన టికెట్లతో శ్రీవారి దర్శనం చేసుకుంటారు. ఈ విషయాన్ని గ్రహించిన ముగ్గురు అధికారులు ఒంగోలు, రాయచోటి నుంచి బస్సులు నడపడం మానేశారు. చెన్నై నుంచి రెండు బస్సులు నడవాల్సి ఉండగా.. ఒక బస్సునే నడిపించేవారు. ఈ మూడు బస్సుల ద్వారా రోజుకు దాదాపు 120 టికెట్లు భక్తులకు విక్రయించవచ్చు. ఏపీటీడీసీ అధికారులు బస్సులు పెట్టకపోయినా ప్రతి టికెట్ మీద రూ.1,200 తీసుకున్నారు. ఈ సొమ్మును నకిలీ ప్రైవేటు రవాణా సంస్థను సృష్టించి, ఆ సంస్థ ద్వారా బస్సులు నడిపినట్లు చూపించి సంస్థ ఖాతాలో జమ చేశారు. రోజుకు 120 టికెట్లు ఈ విధంగా అమ్మినట్లు తెలుస్తోంది. దీనివల్ల సదరు అధికారులకు రోజుకు రూ.1.50 లక్షల వరకు, నెలకు దాదాపు రూ.50 లక్షల వరకు దక్కాయి. ఏపీటీడీసీ విజిలెన్స్ విభాగం ఈ వ్యవహారాన్ని ఎప్పుడో గుర్తించింది. కానీ వైసీపీ హయాంలో కీలకంగా వ్యవహరించిన అధికారుల హస్తం ఉండడంతో మౌనం వహించారు. టీటీడీ టికెట్ల అక్రమాలకు పాల్పడిన సీఎంవో అధికారి రిటైర్ అయ్యారు. ఏపీటీడీసీలో ఉన్న కీలక అధికారి తెలంగాణకు వెళ్లిపోయారు. తిరుపతిలో కీలకంగా వ్యవహరించిన అధికారిని టూరిజం అధికారులు ఇటీవల రిలీవ్ చేశారు.

అన్నం కాదు.. బిల్లులు పెట్టారు!

లేని బస్సులు ఉన్నట్లు చూపించి టికెట్ సొమ్ములు నొక్కేసిన అధికారులు అక్కడితో ఆగలేదు. భక్తులకు టిఫిన్, భోజనాలు పెట్టకుండానే.. పెట్టినట్లు చూపించి రూ.కోటిన్నర వరకు వెనుకేసుకున్నారు. తిరుమల కొండపై ఏపీటీడీసీకి హోటల్ ఉంది. ఈ సంస్థ బస్సుల ద్వారా కొండపైకి వచ్చిన భక్తులకు ఆ హోటల్‌లోనే టిఫిన్, భోజన ఏర్పాట్లు చేయాలి. అయితే అసలు బస్సులే నడపని ఏపీటీడీసీ అధికారులు భోజనం విషయంలోనూ తెలివి ప్రదర్శించారు. 5 బస్సుల్లో వచ్చిన భక్తుల కోసం ప్రతి రోజు టిఫిన్, భోజనాలు పెట్టినట్టు చూపించారు. తిరుమల కొండపై ఉన్న ఏపీటీడీసీ హోటల్ మేనేజర్ ప్రతి రోజు వందల మంది భక్తులకు టిఫిన్, భోజనాలు అందించినట్లు నకిలీ రికార్డులు సృష్టించారు. ఈ క్రమంలో రూ.కోట్లు నొక్కేశారు. ఉన్నతాధికారుల తనిఖీల్లో భక్తులు లేకుండానే టిఫిన్, భోజనాలు పెట్టినట్లు రికార్డులు సృష్టించారని గుర్తించారు. మొత్తం రూ.కోటిన్నరపైనే అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. మేనేజర్ రోశిరెడ్డిపై చర్యలకు సిద్ధమయ్యారు.

లేనిపోనివి ప్రచారం చేస్తే ఊరుకోను

- పరువు నష్టం దావా వేస్తా.. వీడియో విడుదల చేసిన వైఎస్ విజయలక్ష్మి



అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో గత రెండురోజులుగా జరుగుతున్న దుష్ప్రచారం తనను తీవ్రంగా కలచి వేస్తోందని మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్ విజయలక్ష్మి అన్నారు. ఇకపై ఇటువంటి లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. మంగళవారం తన వివరణతో కూడిన వీడియోను విజయలక్ష్మి విడుదల చేశారు. ఇటీవలి రెండు లేఖలూ తాను రాసినవేనని వివరించారు. "కొంతమంది మీడియాలో లేనిపోని కథనాలు ప్రచారం చేయడం చూస్తుంటే తీవ్ర మానసిక వేదన కలుగుతోంది. కుటుంబంలో అభిప్రాయ భేదాలు ఉండొచ్చు. కానీ, కుటుంబంలో అన్నకు చెల్లి - తల్లికి కొడుకు కాకుండా పోతారా? షర్మిల నా కూతురే కాదంటున్నారు. ఇదెక్కడి అన్యాయం? నన్ను అడ్డుపెట్టుకుని చేస్తున్న నీచ, నికృష్ట రాజకీయాలను ఖండించకపోతే ప్రజలు నిజమని నమ్మే ప్రమాదం ఉంది. అందుకే ఈ వివరణ ఇస్తున్నాను. రెండురోజుల కిందట నా కారుకు ప్రమాదం జరిగిందని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. గతంలో ఎప్పుడో జరిగిన కారు ప్రమాదాన్ని ఇప్పుడు జరిగినట్లు దుష్ప్రచారం చెయ్యడం అత్యంత జుగుప్సాకరం. రాజకీయంగా లబ్ధి పొందాలనే ఇదంతా చేస్తున్నారు. అమెరికాలో ఉన్న నా మనవడి దగ్గరకు వెళితే దాన్ని కూడా తప్పుగా చిత్రీకరించారు. భయపడి నేను విదేశాలకు వెళ్లిపోయినట్లుగా దుష్ప్రచారం చేశారు. ఇది అత్యంత నీతిమాలిన చర్య. రాజకీయ ప్రయోజనాల కోసం ఇంతగా దిగజారి ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇకపై ఇటువంటి లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తే నేను చూస్తూ ఊరుకోను. పరువు నష్టం దావా వేస్తా"నని విజయలక్ష్మి హెచ్చరించారు.

పారిశ్రామికవేత్తలకు అండగా ప్రభుత్వం!

- ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి
- ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో-2024 పోస్టర్ ఆవిష్కరణ

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో పారిశ్రామికవేత్తలను ఇబ్బందులకు గురిచేసి.. పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయే పరిస్థితులు సృష్టించిందని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో పారిశ్రామికవేత్తలకు అనేక ప్రోత్సాహకాలను అందిస్తూ అండగా నిలబడుతోందన్నారు. రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య(ఏపీ ఛాంబర్స్) ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి డిసెంబరు 1 వరకు విజయవాడలో నిర్వహించతలపెట్టిన 'బిజినెస్ ఎక్స్‌పో-2024'ను విజయవంతం చేసేందుకు మంగళవారం కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బిజినెస్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ట్యాక్స్, విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచేసి పరిశ్రమలు మూతపడే పరిస్థితిని తీసుకువచ్చిందని విమర్శించారు. ఆ లోపాలన్నింటినీ కూటమి ప్రభుత్వం సరిచేస్తోందని చెప్పారు.

పారదర్శకంగా డీఎస్సీ

- 2-3 రోజుల్లో నోటిఫికేషన్
- పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు: లోకేశ్



విద్యా శాఖపై జరిగిన సమీక్షలో మంత్రి లోకేశ్, ఆ శాఖ అధికారులు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల, ఇంటర్ విద్యపై మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమీక్ష జరిపారు. బుధవారం ప్రకటించాలనుకొన్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు మరో 2-3 రోజులు గడువు తీసుకోవాలని నిర్ణయించారు. అభ్యర్థుల వయోపరిమితి పెంపు, ఇతర అంశాలపై సీఎంతో చర్చించిన అనంతరం నోటిఫికేషన్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. సమీక్షలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ వీలైనంత ఎక్కువ మందికి డీఎస్సీలో అవకాశం కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నెల 11న ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ఇస్తామన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని డిసెంబరు మొదటి వారంలో నిర్వహించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే టీచర్లకు పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు రిపోర్టు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలల ర్యాంకింగ్‌పై దృష్టిపెట్టాలన్నారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణత పెరగాలి

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలని మంత్రి లోకేశ్ సూచించారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివి జేఈఈ, నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థుల స్ఫూర్తి కథనాలు ప్రజలకు తెలిసేలా కసరత్తు చేయాలన్నారు. రిమోట్ ప్రాంతాల్లో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేసేవారికి త్వరగా అనుమతులు జారీచేయాలన్నారు. మండలానికో ఇంటర్ కాలేజీ ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్‌లో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు ప్రవేశపెడుతున్నామని, ప్రశ్నపత్రాల్లోనూ మార్పులు చేస్తున్నామని తెలిపారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, వి.విజయరామరాజు, కృతికా శుక్లా, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నారాయణరావుకు ఎస్టీయూ మద్దతు

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావుకు మద్దతివ్వాలని నిర్ణయించినట్లు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భూ కబ్జాలపై ఉక్కుపాదం!

దురాక్రమణదారులకు 10 నుంచి 14 ఏళ్ల జైలు

- అపరాధంగా భూమి మార్కెట్ విలువ వసూలు
- నేడు మంత్రివర్గ సమావేశంలో చర్చ!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో భూ కబ్జాలపై ఉక్కుపాదం మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేటు భూములను అడ్డగోలుగా దురాక్రమణ చేసేవారికి 10 నుంచి 14 ఏళ్ల పాటు జైలుశిక్ష విధించేలా కఠినమైన చట్టం తీసుకురానుంది. జైలుశిక్షతో పాటుగా కేసు తీవ్రతను అనుసరించి సదరు భూమి మార్కెట్ విలువ మొత్తాన్ని కూడా వసూలు చేసేలా కఠినమైన క్లాజులను ఆ చట్టంలో చేర్చనున్నారు. బుధవారం జరగబోయే కేబినెట్ సమావేశం ఆమోదం కోసం 'ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ గ్రాబింగ్ అండ్ ప్రొహిబిషన్ యాక్ట్-2024' ముసాయిదా ఫైలును రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. దీన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణల నిరోధక చట్టం-1982ను ఉపసంహరించుకోవాల్సి ఉంది. అంటే, ఇప్పుడున్న చట్టాన్ని అసెంబ్లీలో వెనక్కి తీసుకొని, కొత్త చట్టాన్ని ప్రతిపాదించి, సభలో ఆమోదించాలి. ఆ తర్వాతే కొత్త చట్టం అమల్లోకి వస్తుంది. ఇదంతా జరగాలంటే ప్రస్తుత చట్టం ఉపసంహరణకు, కొత్త చట్టం ముసాయిదా బిల్లును మంత్రివర్గం ఆమోదించాల్సి ఉంటుంది. దీంతో ఈ అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు అజెండాలో చేర్చినట్లు తెలిసింది.

విలువైన భూములు స్వాహా

ప్రస్తుతం అమల్లో ఉన్న భూ ఆక్రమణల చట్టం-1982లో తీసుకొచ్చింది. గత 25ఏళ్లుగా ఈ చట్టం అమలు ఊసే లేదు. చట్టం అమలు కాకపోవడంతో దురాక్రమణదారులు రెచ్చిపోతున్నారు. రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. వీరికి కొందరు రెవెన్యూ అధికారులు సహకరించి రాత్రికి రాత్రే భూ రికార్డులు మార్చేస్తున్నారు. అక్రమార్కులకు రాజకీయ నేతలు కూడా తోడవడంతో చట్టం అమలు చట్టుబండలైంది. కొందరు ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వ భూముల రికార్డులను మార్చేసి అమ్ముకున్న ఉదంతాలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు, కబ్జాకోరులు రెచ్చిపోయారు. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా విలువైన భూములను స్వాహా చేశారు. రెవెన్యూ శాఖలోని కొందరు అధికారులు అక్రమార్కులకు సహకరించి ప్రభుత్వ, అసైన్డ్, చుక్కల భూములు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమర యోధులు, కంపెనీలకు ఇచ్చిన భూముల రికార్డులను తారుమారు చేశారు.

కొత్త చట్టంపై రెవెన్యూ కసరత్తు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ, అసైన్డ్ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటోంది. ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొస్తామని సీఎం చంద్రబాబు జూలైలోనే ప్రకటించారు. ఈమేరకు రెవెన్యూ శాఖ కొత్త చట్టం తయారీపై కసరత్తు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భూములను కబ్జా చేస్తే 10నుంచి 14 ఏళ్ల వరకు జైలుశిక్ష విధించడంతో పాటు కేసు తీవ్రతను జరిమానాను కూడా ప్రతిపాదించారు. కబ్జా చేసిన భూములను తిరిగి వెనక్కి తీసుకొని, అసలైన యజమానులకు దక్కేలా చట్టపరమైన చర్యలు ప్రతిపాదించారు. రెవెన్యూ శాఖ ప్రతిపాదించిన శిక్షలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది? ఇంకా ఏమైనా మార్పులు ప్రతిపాదిస్తారా? లేక దాన్నే యథాతథంగా ఆమోదిస్తారా?.. అన్న చర్చ జరుగుతోంది.

అక్రమ అధికారుల ఆస్తులు స్వాధీనం

కబ్జాకోరులకు సహకరించి, ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసే అధికారులపై కొత్త చట్టంలో కఠిన శిక్షలు ప్రతిపాదించారు. భూమి కబ్జాలో అధికారి పాత్ర ఉందని నిరూపితమైతే వారికి ఏడాది నుంచి ఏడేళ్ల వరకూ జైలుశిక్షతోపాటు వారి ఆస్తుల స్వాధీనానికి కూడా ప్రతిపాదించినట్లు సమాచారం.

చంపి.. సూట్‌కేస్‌లో కుక్కి..

- ఆభరణాల కోసం వృద్ధురాలి దారుణ హత్య



సూట్‌కేస్‌లో రమణి మృతదేహం

నెల్లూరు క్రైం, చెన్నై, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాయగూరలు తీసుకువస్తానని వెళ్లిన వృద్ధురాలు పొరుగు రాష్ట్రంలోని రైల్వే స్టేషన్‌లో సూట్‌కేసులో శవమై కనిపించింది. సంచలనం రేపిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులోని రాజేంద్రనగర్‌లో మురుగేశం, మణ్యం రమణి (65) దంపతులు ఉంటున్నారు. సోమవారం ఉదయం కూరగాయల కోసం రమణి సమీపంలోని దుకాణానికి వెళ్లింది. ఎంత సేపటికీ ఆమె రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావుకు.. తమిళనాడులోని తిరువళ్లూ జిల్లాలోని మీంజూరు రైల్వే పోలీసులు ఫోన్ చేసి సూట్‌కేసులో వృద్ధురాలి మృతదేహం గుర్తించామని సమాచారమిచ్చారు. సూట్‌కేసు తెచ్చిన నెల్లూరుకు చెందిన బాలసుబ్రహ్మణ్యం, ఆయన కుమార్తె దివ్యశ్రీ తమ అదుపులో ఉన్నారని చెప్పారు. మృతదేహం ఫొటోను పరిశీలించిన ఇన్‌స్పెక్టర్.. ఆమె రమణియేనని రైల్వే పోలీసులకు తెలిపారు. దీంతో మీంజూరు రైల్వే పోలీసులు తండ్రీకుమార్తెలను స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, హత్య చేసిన తీరును వెల్లడించారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. బాలసుబ్రహ్మణ్యం కుటుంబం రమణి ఇంటికి సమీపంలోనే ఉంటోంది. వారి మధ్య పరిచయం ఉంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న బాలసుబ్రహ్మణ్యం, తనకు తెలిసిన రమణి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకోవాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం కూరగాయలకు వెళ్లిన వృద్ధురాలితో మాటామాటా కలిపి తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను హత్య చేసి ఒంటిపై ఉన్న నల్లపూసల దండ, కమ్మలు తదితర బంగారు ఆభరణాలు దోచుకున్నాడు. ఓ ట్రావెల్ సూట్‌కేస్‌లో రమణి మృతదేహాన్ని కుక్కాడు. ఆ సూట్‌కేస్ తీసుకొని బాలసుబ్రహ్మణ్యం, దివ్యశ్రీలు ఊరెళ్తున్నామంటూ నెల్లూరులో చెన్నై వెళ్లే ప్యాసింజర్ రైలు ఎక్కారు. రైలులో రద్దీ ఎక్కువగా ఉండటంతో సూట్‌కేస్‌ను బయట పడేయడం కుదరలేదు. చెన్నై సమీపిస్తుండటంతో మీంజూరు స్టేషన్‌లో రైలు దిగేశారు. ప్లాట్‌ఫాంపై సూట్‌కేస్ వదిలి వెళ్లేందుకు ప్రయత్నించగా, ఓ యువకుడు అక్కడే ఉన్న రైల్వే పోలీసులకు ఉప్పందించాడు. వారు సూట్‌కేస్‌ను పరిశీలించగా అందులో నుంచి వృద్ధురాలి మృతదేహం కనిపించింది. ఆభరణాల కోసమే హత్య చేసినట్లు బాలసుబ్రహ్మణ్యం వెల్లడించినట్లు తెలిసింది. రమణి మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం జరిపించి, కుటుంబసభ్యులకు అప్పగించారు.

నేడు కేబినెట్ భేటీ

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం కేబినెట్ సమావేశం కానుంది. భూ ఆక్రమణల నిరోధక చట్టం-1982 రద్దు ప్రతిపాదనపై ఈ భేటీలో చర్చించనున్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో లక్షల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి అందుతున్న ఫిర్యాదుల్లో 80 శాతం భూ ఆక్రమణలకు సంబంధించినవే ఉంటున్నాయి. ప్రస్తుత చట్టంతో అక్రమార్కులపై చర్యలకు ఇబ్బందులు ఉన్నాయని భావించిన కూటమి ప్రభుత్వం దీని స్థానంలో కొత్త చట్టం తేవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొత్తగా ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ అండ్ ప్రొహిబిషన్ బిల్లు-2024పై కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై కూడా సమావేశంలో చర్చించనున్నారు. వైసీపీ హయాంలోని నామినేటెడ్ పదవుల కేటాయింపు చట్టం-2019ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనికి అనుబంధంగా ఇచ్చిన జీవో 77ను కూడా రద్దు చేయనుంది. 2017లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వేను నామినేటెడ్ పోస్టుల నియామకానికి ప్రాతిపదికగా తీసుకోవాలని భావిస్తోంది.



అంబులెన్స్‌లు ఆపేస్తాం!

- ప్రభుత్వానికి 'అరబిందో' హెచ్చరిక
- వెంటనే రూ.141 కోట్లు విడుదల చేయాలి
- ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్‌కు లేఖ
- కూటమి సర్కారును బదనాం చేసే ధోరణి

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని బదనాం చేయాలని అరబిందో సంస్థ కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఉద్యోగుల జీతాలు నిలిపివేసి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుతోంది. ఇప్పుడు ఏకంగా 108 అంబులెన్స్‌లు, 104 వాహనాలు నడపలేమని ప్రభుత్వానికి లేఖ రాసింది. సంస్థకు ఎప్పటి నుంచో ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచీ ఈ సమస్య ఉంది. దాదాపు రూ.141 కోట్ల బకాయిలున్నాయి. అయినా నాడు ఏ రోజూ సంస్థ పన్నెత్తి మాట్లాడలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఉద్యోగులకు జీతాలు నిలిపివేయడంతోపాటు ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేస్తోంది. వెంటనే రూ.141 కోట్లు విడుదల చేయకపోతే 108 అంబులెన్స్‌లు, 104 వాహనాలను నడపలేమని లేఖ రాసింది. ఈ లేఖను మంగళవారం ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుకు అందించింది. వెంటనే నిధులు విడుదల చేయకపోతే మంగళవారం సాయంత్రం నుంచే వాహనాలు నిలిపేస్తామని లేఖలో పేర్కొంది. సోమవారం సాయంత్రమే 190 వాహనాలను అరబిందో సంస్థ నిలిపివేసింది. మంగళవారం ఉదయం మరో 200 వాహనాల వరకూ నిలిచిపోయాయి. ప్రభుత్వానికి లేఖ రాసిన తర్వాత మరో 100 వాహనాల వరకూ నిలిపేసింది. ఇదేమిటని ప్రశ్నిస్తే.. వాహనాల్లో డీజిల్ కొట్టించడానికి కూడా నిధులు లేవంటూ చేతులెత్తేసింది. రెండు రోజుల వ్యవధిలో దాదాపు 400 వాహనాలను అరబిందో సంస్థ నిలిపేసింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం రోజూ 750 వాహనాల వరకూ క్షేత్రస్థాయిలో తిరుగుతున్నట్లు చూపించారు. కానీ, అరబిందో సంస్థ సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో తిరుగుతున్న వాహనాల సంఖ్యను తక్కువగా చూపిస్తోంది. దీనిపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినా, తాము ఏమీ చేయలేమని స్పష్టంగా చెప్పేసింది. దీనిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

ఎప్పుడూ ఆలస్యమే...

అరబిందో సంస్థ 2021 జూలైలో 108 అంబులెన్స్‌లు, 104 వాహనాల నిర్వహణను చేపట్టింది. అప్పటి నుంచీ వైసీపీ ప్రభుత్వం ఏనాడూ సక్రమంగా బిల్లులు చెల్లించలేదు. ఎప్పుడూ నెల, రెండు నెలలు ఆలస్యం చేస్తూనే ఉంది. అయినా అరబిందో సంస్థ నాడు ప్రభుత్వాన్ని హెచ్చరించిన, లేఖ రాసిన సందర్భాలు లేవు. అయితే, ప్రభుత్వం మారాక ఆ సంస్థ తొలిసారి హెచ్చరిక లేఖ రాసింది. దీని వెనుక ఉద్దేశం ఏమిటని కూటమి ప్రభుత్వం ఆరా తీసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.